
Website : www.saisadguruvani.org

"మాస్టర్ ఇ.బి. ఆరాధనోత్సవ" ప్రత్యేక సంచిక



శ్రీ భరద్వాజ


# సద్గురువాణి



సంపుటి-22

ఏప్రిల్, మే, జూన్ - 2022

సంచిక-2



శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక

శ్రీ భరద్వాజ

# సద్గురువాణి


సంపుటి - 22 ఏప్రిల్, మే, జూన్ - 2022 సంచిక - 2

**శ్రీ దత్తసాయి మాస్టర్ సాంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక**

ప్రధాన సంపాదకులు :
శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు

'మాస్టర్ ఇ.బి. ఆరాధనోత్సవ' ప్రత్యేక సంచిక

నిర్వహణ :
శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము



"క్షణ క్షణమూ ఆత్మ వికాసానికై కృషిచేయటం ఒక్కటే
మానవ జీవిత లక్ష్యం కావాలి"
- పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## చందా వివరములు

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | - | రూ॥ | 10/- |
| సంవత్సర చందా (పోస్టేజితో) | - | రూ॥ | 50/- |
| 3 సం॥ల చందా | - | రూ॥ | 150/- |
| 5 సం॥ల చందా | - | రూ॥ | 250/- |
| పోషకులు (ఉదారులు) | - | రూ॥ | 1000/- |

మనియార్డర్లు పంపవలసిన చిరునామా :

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

**C/o. శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,**


ప్లాట్ నెం. 13, పవర్ సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర,
పరవాడ (మం), విశాఖపట్నం - 531 021.
సెల్ : 9849645224

E-mail : poorna.sai09@gmail.com
Website : www.saisadguruvani.org
Facebook : Sri Shiridi Sai Seva Trust
Co-Ordinator at USA : Sri K. KARUNAREDDY

## విషయ సూచిక

1. విషయసూచిక ........ 1
2. మా మాట ........ 2
3. సమర్ధ రామదాస స్వామి ........ 4
4. ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటేచాలు ........ 5
5. శ్రీగురు చరితామృతము ........ 7
6. పండుగలు - పర్వదినాలు ........ 9
7. ప్రాణహిత పుష్కరాలు ........ 10
8. ఒక్క క్షణం ........ 11
9. అక్షయ తృతీయ ........ 12
10. నమో శ్రీ ఆంజనేయం ........ 13
11. జిజ్ఞాస ........ 15
12. శ్రీగురు సిద్ధారూఢ ........ 16
13. పూర్ణ అంతరంగాలు ........ 17
14. ఆధ్యాత్మిక-సామాజిక సేవలో ........ 21
15. మేము సహితం ........ 23
16. ఆధ్యాత్మిక-సామాజిక సేవలో చిత్రమాలిక ........ 24
17. జన్మదిన శుభాకాంక్షలు ........ 26
18. సాయి మాస్టర్ భక్త సమ్మేళనం ........ 30
19. అవధూత శ్రీ చివటం అమ్మ ........ 32
20. శ్రీ పాకలపాటి గురువుగారు ........ 33
21. స్టేట్‌మెంట్ ........ 34
22. బాలవికాశం - చెరుకు ముక్క ........ 35
23. తెలుసుకో ఈ జీవిత సత్యం ........ 36
24. మొగలిచర్ల శ్రీ దత్తాత్రేయ స్వామి ........ 37
25. తెలుసుకుందాము ........ 38
26. నాకు తెలిసిన నిజం ........ 39
27. మహాత్ముల ముద్దుబిడ్డడు ........ 41
28. పుస్తక పరిచయం ........ 42
29. స్ఫూర్తి ప్రధాత (బి.వి. నర్శింహస్వామి) ........ 33
30. అవధూత శ్రీ రాఖాడి బాబా ........ 45
31. ఉగాది పచ్చడి ........ 46
32. శ్రీ నాగమునీంద్రస్వామి ........ 47
33. ఏరిన ముత్యాలు ........ 48








# మా మాట

## పాఠకులకు, ప్రకటన కర్తలందరికి ఉగాది 'శ్రీ శుభకృత్' నామ సంవత్సర మరియు శ్రీరామనవమి శుభాకాంక్షలు

"బ్రహ్మ నా తండ్రి, మాయ నా తల్లి, వారిద్దరి ఐక్యం వల్లనే నాకీదేహం వచ్చింది" అంటారు శ్రీశిరిడీసాయిబాబా. బీజము బ్రహ్మకాగా, క్షేత్రము మాయ రూపములో ఉన్న ప్రకృతి – స్త్రీ రూపము, ఆ ప్రకృతే తల్లిగా, చెల్లిగా, భార్యగా, ఇంకా ఎన్నో రూపాలతో మన చుట్టూ ఆవరించి ఉంది. అంతటా నిండి ఉన్న ప్రకృతి అనేక రూపాలతో మనకు గోచరిస్తూ ఉంటుంది. విచక్షణా జ్ఞానముతో మసలుకొనేవారికి, తనలో ఇమిడి ఉన్న అనేక ఆధ్యాత్మిక రహస్యాలను వెల్లడి చేస్తుంది ప్రకృతి, మనోవికారాలతో సంచరిస్తే, వారిపట్ల వికృతి రూపములో విలయతాండవము చేసి, వినాశనానికి కారణం అవుతుంది, దాన్నే "శక్తి స్వరూపము" అని అంటారు. ఆ శక్తి అందరిలోనూ ఉంటుంది. దానిని వినియోగించుకునే విధానాన్ని అనుసరించి ఫలితం ఆధారపడి ఉంటుంది. దానిని సక్రమముగా వినియోగించుకోవాలి అంటే సంస్కారము కావాలి. అటువంటి "ఉత్తమ సంస్కారము పెంపొందించుకోవటానికి, కుసంస్కారాలను తొలగించుకోవటానికి చేసే తీవ్రమయిన ప్రయత్నమే నిజమైన సాధన. మన హృదయకుహరాలలో మూట కట్టుకుని ఉన్న సంస్కారము, మదిలోని భావాలయ్యి చెలరేగి, మాటల రూపములో వ్యక్తమయ్యి, క్రియారూపము దాలుస్తుంది. ఆ సంస్కారము గతజన్మ కర్మల వలన సంక్రమిస్తుంది" అంటారు మాస్టర్ ఇ.బి. జన్మతః సంక్రమించిన కుసంస్కారాలను, కర్మ సంస్కారము ద్వారా తొలగించుకోవటము మానవ జన్మ ప్రధాన లక్ష్యము కావాలి, అందుకొరకై చేసే తీవ్రమయిన ప్రయత్నానికి సద్గురువు సహకారము కావాలి. ఎన్నో జన్మల పుణ్యఫలము వలనగాని సద్గురువు సాంగత్యము లభించదు. వి.హెచ్.ఠాకూర్ అనే వ్యక్తి ఉద్యోగరీత్యా 'నాన్హేఘాట్' అనే లోయకు బదిలీ చేయబడతాడు. కొండలు, లోయలు దాటి అక్కడకు వెళ్ళటానికి వెరుస్తున్న సమయములో, సమీప దేవాలయములో పురాణ ప్రవచనము చేస్తున్న "అప్పా" అనే కన్నడ సాధువు చెంతచేరి, కష్టాలు కడతేరే మార్గము తెలుపమని కోరగా, ఆ సాధువు 'విచారసాగరము' అనే గ్రంథము ఠాకూర్‌కు ప్రసాదించి, "దీని పారాయణ వలన శీఘ్రగతిన నీవు కష్టాలనుంచి బయటపడి, ఉద్యోగరీత్యా ఉత్తర దేశము వెళ్ళినప్పుడు, ఒక మహాత్ముడు తారసిల్లుతారు, అప్పుడు నీకు ఉత్తమమైన మార్గము లభిస్తుంది" అని చెబుతారు. దున్నపోతుపై కొండలు, లోయలు దాటి నాన్హేఘాట్ అనే ఊరు చేరిన ఠాకూర్ ఒళ్ళు హూనముకాగా, జీవితములో ఇంతకు మించిన నరకము లేదు అని బాధపడతాడు. సాధువు మాటపై విచారసాగర గ్రంథాన్ని పారాయణ చేయటము ద్వారా అతను మహారాష్ట్రకు బదిలీ అయ్యి, ఆనోటా ఈనోటా సాయి గురించి విని, సాయి దర్శనం చేసుకోగా, అంతకుముందు జీవితములో పడిన అన్ని కష్టాలు మరచిపోయి, మనస్సు అప్రయత్నముగా ఆనందపారవశ్య మవుతుంది. తన పాదాలపై వ్రాలిన ఠాకూర్‌తో సాయి – "అప్పా చెప్పిన మాట నిజమే! గ్రంథ పారాయణ వలన నీవు చేరవలసిన చోటికే చేరేవు. అయితే కేవలము గ్రంథ పారాయణ మాత్రమే సరిపోదు, అందులోని విషయాలు ఆచరణ ద్వారా అనుభవములోకి వచ్చినప్పుడే గమ్యం చేరగలవు. ఆ పని ఇక్కడ ప్రారంభమవుతుంది. అయితే అది అంత సులభము కాదు. 'నాన్హేఘాట్' లోయను దున్నపోతు మీద దాటటము కంటే కష్టం. ఆధ్యాత్మిక విద్య అనేది పదునైన కత్తిమీద నడకలాంటిది. కాలు కోసుకుంటుందని పైపైన నడిస్తే, పట్టుజారి పడతావు, పట్టుకోసం బిగువుగా నడిస్తే కాలు కోసుకుంటుంది. ఆచితూచి అడుగు వేయటము ద్వారానే గమ్యం చేరగలవు" అంటారు బాబా. అంతేకాక ఒకసారి దీక్షిత్‌తో "ఆధ్యాత్మిక మార్గము ముళ్ళు, రాళ్ళతో నిండి అస్తవ్యస్తముగా ఉంటుంది. అయితే గురువు చేయి పట్టుకుని నడిస్తే, వాటన్నిటినీ అధిగమింపచేసి, గమ్యం చేరుస్తాడు గురువు" అంటారు సాయి.

గురువు చేయి పట్టుకోవటానికి అర్హత కావాలి. పట్టుకున్న చేయి విడవకుండా నడవటానికి సంస్కారము కావాలి. సద్గ్రంథ పారాయణ అర్హత ప్రసాదిస్తే, అర్థం చేసుకున్నది ఆచరణాత్మకమై, గురువుపై అపారమైన విశ్వాసముతో ముందుకుసాగితే ఉత్తమ సంస్కారము మేల్కొని గురుమార్గములో పయనము సాగుతుంది. అయితే అది అంత సులభ సాధ్యం కాదు. ఒక్క అడుగు ముందుకు సాగుదాము అని అనుకునే క్షణములో, మనస్సు చేసే మాయతో, రెండు అడుగులు వెనక్కి వేసి, పట్టుకున్న గురువు చేయి వదిలి, గురువుకి దూరము కావటం జరుగుతుంది. అదే సాయి చెప్పిన "మాయ". అది తనంతట తానుగా ఎవ్వరినీ తనను అతిక్రమింపనీయదు. "నూనె వర్తకులు, దుకాణదారుల రూపములో మాయ నన్ను ఎంతో బాధిస్తున్నది" అని మహల్సాపతితో అంటారు బాబా. బాబానే మాయకు లోనయ్యారని కాదు ఆ మాటలోని భావం. కలి ప్రభావానికి లోనయిన వారిలోని కుసంస్కారాలనే నూనెను సాయి తీసుకుని,

వారిని మాయాతీతులను చేద్దామని బాబా ప్రయత్నము చేస్తుంటే, దానిని అతిక్రమించటానికి ఇష్టపడక, లౌకికమైన లాభాల వేటలోపడి కొట్టుమిట్టాడుతున్నారు ఆ ఊరి ప్రజలు. ప్రతి ఒక్కరిని ఉత్తమమైన మార్గములో పయనింపచేసి, గమ్యం చేరుద్దామని సాయిబాబా తన అవతార లక్ష్యంగా ప్రయత్నిస్తుంటే, అర్థం చేసుకోలేని ఆ ఊరి ప్రజలను చూసి, మాయను అతిక్రమించటానికి ఒక్క అడుగు కూడ ప్రయత్నం చేయని వారిని చూసి బాధపడి బాబా "నేను శిరిడీ వదిలి వెళుతున్నాను" అని చెప్పి రహటా, నీమ్‌గావ్‌ల వైపు సాయి వెళ్ళేవారు. అయితే "నేను విషయం ఎరుకపరచి వారిని సక్రమముగా ఉండేలా చెబుతాను" అని మహల్సాపతి నచ్చచెప్పటంతో బాబా తిరిగి శిరిడీ వచ్చేవారు. బాబా మాటలోని అంతరార్థాన్ని గ్రహించి మహల్సాపతి తగురీతిన మసలుకునేవాడు.

ఒకసారి మహల్సాపతితో "నీవు రాత్రిపూట ఇంటి నుండి వచ్చేటప్పుడు చేతికర్ర, లాంతరు తీసుకుని రా! దారిలో దొంగలు ఎదురవుతారు!" అంటారు బాబా. "నా దగ్గర దోచుకునేదేముంది బాబా! ముగ్గురు ఆడపిల్లలతో పూట గడవటమే కష్టముగా ఉంది, కొన్ని రోజులు పస్తులు కూడా ఉంటున్నాము, నీవు ఇచ్చే ప్రసాదమే మా యింటిల్లిపాదికి భోజనముగా గడుపుతున్న నా దగ్గర ఏముంది దోచుకోవటానికి, నా కారుపంచె తప్ప" అని సమాధానమివ్వలేదు మహల్సాపతి. సాయిసేవలో జీవితాన్ని ధన్యత చెందించుకోవటానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహల్సాపతి, సాయి ఆదేశాన్ని మారుమాటాడక శిరసావహించి, రాత్రిపూట మశీదుకు లాంతరు, చేతికర్రతో బయలుదేరేడు. మార్గమధ్యములో లాంతరు వెలుగులో దారికి అడ్డంగా పడుకుని ఉన్న ఒక పెద్ద పామును చూసి, కర్రతో శబ్దము చేయగా, అది ప్రక్కపొదలలోకి వెళ్ళిపోయింది. సాయి హెచ్చరికలోని ఆంతర్యాన్ని గ్రహించిన మహల్సాపతి సాయి పాదాలపైన వ్రాలేడు. సామాన్యమైన దొంగలు లౌకికమైన సంపదే అపహరిస్తారు, కాని చీకటిలో కనపడక పాముపై వేసే తన కాలు తన జీవితము అనే ప్రాణాన్నే హరిస్తుంది, అది అర్థంచేసుకునే సంస్కారము మహల్సాపతిలో ఉంది కనుకనే మృత్యువు నుంచి బయటపడ్డాడు. అదే సద్గురువు ఔన్నత్యాన్ని గుర్తించి, వారి హెచ్చరికలను తూచాతప్పక పాటించటము ద్వారా కలిగే ప్రయోజనం. ఒకసారి తాత్యాకోతే పాటిల్ మశీదులో ఉన్న సాయితో, మాటవరసకు చెప్పి, కోపర్‌గ్రామ్‌లో ఉన్న సంతకు బయలుదేరపోతాడు, సాయి అతనిని "ఇప్పుడు వద్ద"ని వారిస్తారు. "నీకేం ఫకీరువు! నీకేమీ అక్కరలేదు! ఇప్పుడు సంతకు వెళ్ళి నిత్యావసర వస్తువులు, కూరగాయలు తెచ్చుకోకపోతే సంసారమెట్లా గడుస్తుంది? సంసారము గురించి నీకు తెలియదు" అని తనకున్న చనువుతో సాయికి ఎదురు చెప్పి, వద్దని వారిస్తున్నా గుర్రపు బగ్గీపై సంతకు బయలుదేరుతాడు. కొద్దిదూరము వెళ్ళగానే ఎదురైన మోటారు వాహనమును చూసి బెదిరిన గుర్రము పరుగెత్తి, ప్రక్క కాలువలో పడగా, బండి తల్లక్రిందులయ్యి, ఒళ్ళంతా దోక్కుపోగా, దుమ్ముధూళితో నిండిన శరీరముతో కుంటుకుంటూ నెమ్మదిగా మశీదుకు చేరిన తాత్యాతో సాయి, "తిక్క కుదిరిందా! చెబితే వినక్కరలేదా!" అంటారు. వెంటనే "అన్నీ అపశకున మాటలే! వద్దన్నావు చూడు ఎట్లా అయ్యిందో!" అంటాడు తాత్యా. "ఏమయింది, ప్రాణము పోలేదు కదా! కేవలము దెబ్బలేకదా తగిలింది" అంటారు బాబా ప్రేమతో. తాత్యాను తన బహిః ప్రాణముగా చూసుకుంటానని అతని తల్లికి సాయి మాట ఇచ్చారు కనుక ఆపద అంతటితో ఆగింది. అది మాయ యొక్క ప్రభావము. మహల్సాపతి సాయిని గురించే చింతన చేస్తూ, వారి మాటలోని ఆంతర్యాన్ని గ్రహించటానికి ప్రయత్నము చేసి, బాబా కృపతో సంస్కారము పెంచుకుంటూ, మనస్సు చేసే మాయను అతిక్రమించాడు. సద్గురువుతో సన్నిహితత్వము ఉన్నా, వారి ఆంతర్యాన్ని గ్రహించలేని తాత్యా, ఆయన అండ ఉండి కూడా సంపూర్ణమైన కృపను పొందలేదు. ఇట్లాంటి ఉదాహరణలు ఎన్నో కలవు సాయి చరిత్రలో. వాటిని పారాయణ చేయటము ద్వారా సంస్కారాన్ని పెంపొందించుకున్నవారు, మనోవికారానికి కారణమైన మాయను జయించి, బ్రహ్మతత్వము గ్రహిస్తారు. అదే సాయిబోధలోని భావం.

స్వప్రయత్నము ఒక్క అడుగు కాగా, సద్గురువు ఆలంబన పది అడుగులు అయ్యి, మనల్ని ఆధ్యాత్మిక పథంలో ముందుకు నడిపించి, జన్మసార్థకతకు దోహదం అవుతుంది. భక్తాగ్రేసరుడు శ్రీరామభక్త హనుమాన్ తమ ఆచరణ ద్వారా మనకు ప్రబోధించేది అదే. సాయిభక్తులమని మనము భావించుకుంటే చాలదు. హనుమాన్‌లా జీవించినప్పుడే సాయి మనలో కొలువయ్యి ఉండి, అలవోకగా మాయను అతిక్రమింపచేసి, గమ్యం చేరుస్తారు. ఆ దిశగా మనము వేసే ప్రతి అడుగు ముందుకు సాగాలని కోరుకుంటూ, నిరంతరము వెంటనుండి నిర్దుష్టమైన శ్రీసాయి మార్గములో నడిపిస్తున్న పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి 33వ ఆరాధనోత్సవము సందర్భముగా, కృతజ్ఞతా పూర్వకముగా ఈ సంచికను "మాస్టర్ ఇ.బి. ఆరాధనోత్సవ ప్రత్యేక సంచిక"గా రూపొందించి అందించటము జరిగింది. జగద్గురువు శ్రీశిరిడీసాయి సంప్రదాయాన్ని అందరితో కలసి పంచుకోవటానికి మేము చేసే చిరు ప్రయత్నమే **"శ్రీ భరద్వాజ సద్గురువాణి"**.

సర్వత్రా వినిపించే **"శ్రీసాయి విశ్వవాణి"**ని ఒక్కటిగా చేసి, **"శ్రీ భరద్వాజ సద్గురువాణి"** ద్వారా అందించే మా అక్షరసేవ నిరంతరం కొనసాగించగలమని, అందుకు ఎల్లవేళలా మీ సహాయ సహకారాలు ఇలాగే కొనసాగాలని "సద్గురువాణి"ని మీ "హృదయవాణి"గా తీర్చిదిద్దే ప్రయత్నం అహర్నిశలు కొనసాగించగలమని మరొక్కసారి సవినయముగా మనవిచేసుకుంటూ




**బుద్ధజయంతి మరియు హనుమజ్జయంతి శుభాకాంక్షలతో.....**

**మీ పబ్లిషర్**
**శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**

# శ్రీ సమర్థ రామదాసస్వామి - సజ్జనఘడ్

మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లా శంబాజీనగరుకు 100 మైళ్ళ దూరంలోని జామ్ అనే గ్రామంలోని శ్రీ సూర్యాజీపంత్ థోసాల్ శ్రీమతి రాణుభాయి దంపతులకు, తండ్రి సూర్యాజీపంత్ శ్రీరామ మందిరంలో భక్తులకు శ్రీరామ జనన ఘట్టం వున్న అధ్యాయాన్ని ప్రవచిస్తున్న సమయంలోనే రాణుభాయికి 1608 చైత్ర శుద్ధ నవమి శ్రీరామనవమి రోజున సమర్థరామదాస స్వామి జన్మించారు. సూర్య నారాయణుని ప్రసాదంగా భావించి ఆ బాలుడికి మొదట 'నారాయణ' అని పేరు పెట్టారు.

చిన్ననాటి నుండే శ్రీరామ, ఆంజనేయస్వామి భక్తుడైన నారాయణకు లోతుగా ఆలోచించడం చిన్నతనం నుండే అలవడింది. అల్లరి బాగా చేస్తున్నాడని ఒకనాడు తల్లి కోప్పడితే అలిగిన నారాయణ ఆ రోజంతా ఒక చీకటి గదిలో కూర్చొని ధ్యానం చేసుకుంటూ ఉండడం చూసిన తల్లి 'నారాయణా' ఏం చేస్తున్నావు అని అడుగగా "ప్రపంచం గురించి ఆలోచిస్తున్నాను" అని బదులిచ్చాడట. ఈ మాటలు వినగానే సన్యాసిగా మారిపోయి తన బిడ్డ ఎక్కడికి వెళ్ళిపోతాడో అని ఆ తల్లికి చింత ప్రారంభం అయింది. వివాహం చేస్తే కుటుంబ బాధ్యతలో పడతాడు అని ఆలోచించి, వివాహము తలపెట్టగా, ముహూర్త సమయంలో పురోహితుడు సావధాన (జాగ్రత్త వహించు) అని అనగానే తక్షణమే తటాలున అక్కడ నుండి లేచి దేశాటనమునకు బయలుదేరేడు నారాయణ.



తన తీర్థయాత్రలో భాగంగా గోదావరీ తీరాన గల 'నాసిక్' చేరి అక్కడ పన్నెండు సంవత్సరాల పాటు కఠోర సాధన చేసారు శ్రీ నారాయణ. ప్రాతః కాలం నుంచి మధ్యాహ్నం వరకు గోదావరీ నీళ్ళలో నుంచుని గాయత్రీ మంత్రజపం చేసేవారు. అటుపిమ్మట అక్కడ పంచవటిలో "శ్రీరామజయరామ జయజయరామ" మంత్రాన్ని జపిస్తూ 13 కోట్ల మంత్రజపం అయిన పిదప శ్రీరామచంద్రుని సాక్షాత్కారం పొందేరు శ్రీనారాయణ. పూర్తి సన్యాస జీవితాన్ని ప్రారంభించిన శ్రీనారాయణ శ్రీ రామదాసుడిగా మారిపోయారు. దేశమంతా తీర్థస్థలాలు పర్యటించారు. పండరీపురంలో పాండురంగ విఠలుడు శ్రీరాముడుగా దర్శనం ఇవ్వగా సమర్థుడైన రామదాసుడు - సమర్థ రామదాసుగా కీర్తి పొందేరు. అక్కడే ఆయన భక్త తుకారామ్‌ను కూడా కలిసారు.

12 ఏళ్ళపాటు కాలినడకన యావద్భారత దేశంలోని తీర్థయాత్రలను సేవించారు. దేశమంతటా మహమ్మదీయుల పాలనలో హిందువు అనుభవిస్తున్న బాధలను హిందూధర్మానికి కలుగుతున్న గ్లాని ఆయన కళ్లారా చూసి, ఈ పతనావస్థనుండి సమాజాన్ని ఉద్ధరించాలంటే సమాజంలో శక్తి సామర్థ్యాలను నిర్మాణం చేయాలని భావించి అదే విషయాన్ని అంటే శక్తి రూప సమాజం నిర్మాణం కావాలని అందరికి ఉపదేశించేవారు. ప్రజలను ధార్మిక, జాతీయ భావాలతో చైతన్య పరుస్తూ, ప్రతి చోట వీర హనుమాన్ విగ్రహాలు ప్రతిష్టాపన చేయించారు. కోదండ రాముణ్ణి, హనుమంతుణ్ణి ఉపాసించమని ప్రచారం చేశారు. అనేక చోట్ల వేలాది సంఖ్యలో మఠాలు, వ్యాయామశాలలను స్థాపించి జాతి ఆధ్యాత్మిక, జాతీయ భావాలతో శక్తిశాలిగా రూపొందేలా జన జాగరణ చేసే సంఘటనలు నిర్మాణం చేశారు శ్రీ సమర్థ రామదాసస్వామి.

రామదాసు కీర్తిని విని మహారాష్ట్రదేశము పాలించే శివాజీ చక్రవర్తి ఆయనదగ్గరకువచ్చి మంత్రోపదేశము తీసుకున్నాడు. తనతో పాటు రాజధానికి తీసుకువెళ్ళి "సజ్జనగడ"లో ఆశ్రమం కట్టించి రోజూవెళ్ళి గురుదేవుని దర్శనం చేసుకొని వస్తూండేవాడు.

రామదాసుకు నగరములో తిరిగి భిక్షతెచ్చుకునే ఆచారము వున్నదికనుక అక్కడా అట్లాగే గృహస్థుల ఇళ్ళకువెళ్ళి భిక్ష తెచ్చుకుంటున్నాడు.

ఒకనాడు శివాజీ చక్రవర్తి కోట పైభాగమునుండి ఇదిచూశాడు. నాలాంటి చక్రవర్తికి సద్గురువువైవుండి కడుపునింపుకొనడానికి పట్టెడు మెతుకులకోసం ఇల్లిల్లూ తిరగవలసిన ఖర్మపట్టిందా! తనకెంత అవమానం! అని అనుకొని కోటదిగి రామదాసుకు ఎదురుగావెళ్ళి "స్వామీ! మీరు ఇట్లా భిక్షకొరకు తిరగటం నేను చూడలేను. నా రాజ్యమును మీకు సమర్పించుకుంటున్నాను స్వీకరించండి" అని రాజముద్రవేసిన పత్రము జోలెలో వేశాడు.

రామదాసు నవ్వుతూ "వత్సా! ఏ అధికారమున నా రాజ్యమని అనగలిగితివి? ఈ ప్రజలమీద నీకేం అధికారము వున్నది? భగవంతుడు సృష్టించిన మానవులపై భగవంతునికిమాత్రమే అధికారము వుంటుంది. నీవు కేవలం నిమిత్తమాత్రుడవు. తమ మంచిచెడ్డలు చూసుకొనుటకు ప్రజలచే ఎన్నుకొనబడిన అధికారివి మాత్రమే" అని అనగా శివాజీ సిగ్గుపడి తలవొంచుకున్నాడు.

గురుదేవుని ఆజ్ఞానుసారంగా శివాజీ "రామరాజ్య"మని ప్రజలందరూ ఆనందించేలాగున పరిపాలించాడు. రామదాసు "దాసబోధ' అనే గ్రంథం రచించి శిష్యులను వెంటబెట్టుకుని దేశమంతా తిరిగి ఉపదేశాలిస్తూ ప్రజలను భక్తి మార్గాసక్తులుగా మార్చారు. అలా తిరుగుతూనే తనకు అంత్యకాలము సమీపించిందని తెలుసుకొని ఆ విషయం శిష్యులకు చెప్పేరు.

"సర్వకాల సర్వావస్థలలోనూ "శ్రీరామ జయరామ జయ జయరామ" అనే త్రయోదశాక్షర మంత్రమును మర్చిపోకుండా ధ్యానించండి ఇదే నా అంతిమ సందేశము" అనిచెప్పి "జయజయ రఘువీర సమర్థ" అని కేకవేసి ప్రాణము విడిచారు.

శ్రీరామచంద్రుడి అనుగ్రహముతో శ్రీ సమర్థ రామదాసస్వామి పాదుకల రూపంలో శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం (పవర్‌సిటీ, విశాఖపట్నం) విచ్చేసి అనుగ్రహించటము జరుగుతున్నది.

శ్రీ రామచంద్రాయనమః


(ఏప్రిల్ 10వ తేదీ ఆదివారము శ్రీరామనవమి మరియు శ్రీ సమర్థరామదాసు జయంతి సందర్భముగా సమర్పణ.)

సేకరణ : **శ్రీమతి ఆర్. సాయి సృజన,** బెంగుళూరు

# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

**"సిద్ధ యోగీంద్రులు"**

"ఎవరయితే నా లీలలు గానం చేస్తూ, నాగురించే చింతన చేస్తూ, నా నామాన్నే స్మరిస్తూ ఉంటారో, వారు ఇహపరాల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు వారి కర్మ నశిస్తుంది" అన్నారు శ్రీసాయి. భ్రమరం ఒక కీటాన్ని తెచ్చి గూటిలో ఉంచి, దాని చుట్టూ ఝుంకారం చేయటం వలన నిరంతరం దానినే చింతన చేసిన ఆ కీటకము కూడ భ్రమరంగా మారిపోతుంది. అలానే "సత్ శిష్యుడు కూడ నిరంతరం తన గురువు గురించే ధ్యానించి తానే గురురూపుడవుతాడ"ని అవధూతోపాఖ్యానం. సర్వ కాల సర్వావస్థలయందు గురు చింతనతో తగురీతిన జీవించిన నాడు గురువు అనుగ్రహానికి పాత్రులవుతారు. అందుకు ఉదాహరణ రాధాకృష్ణమాయి. తన ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణుడిని జగద్గురువు శ్రీసాయిలో దర్శించి, నిరంతరం సాయిని ధ్యానిస్తూ, తన శాల (ఇంటి)లో ఉంటూనే సాయిచెంతకు వచ్చేవారికి భోజన వసతి ఏర్పాటు చేయటముతోపాటుగా, బాబాకు కావాల్సిన సకల సదుపాయాలు శాల నుంచే ఏర్పాటు చేస్తూ, చివరకు సాయిసన్నిధిలో జరిగే ప్రతి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా రూపొందించటములో అలనాడు శ్రీసాయి సంస్థానమునకు ఒక రూపురావటానికి, ప్రత్యక్షంగా, పరోక్షంగా రాధాకృష్ణమాయి కృషి ఎంతో ఉంది. ద్వారకామాయిలో శ్రీసాయిబాబా చెంత అనుమతి తీసుకుని శాలకు వచ్చే వారికి తగిన భోజన ఏర్పాట్లు చేసేది రాధాకృష్ణమాయి. ఆ ఏర్పాట్లు చూసి "ఇంతమంది, ఈ సమయంలో వస్తామని ఎట్లా తెలుసు" అని అడిగితే సర్వసమర్థుడైన శ్రీసాయి తగురీతిన ప్రేరేపించేవారు, అని బదులివ్వటమే కాకుండా ద్వారకామాయిలో శ్రీసాయి చెంత జరిగిన సంఘటనలను పూసగుచ్చినట్లు అవసరమైనప్పుడు అవసరమైన వారికి తెలియజేసేది రాధాకృష్ణమాయి. అది అంతా శ్రీసాయి కృప అని చిరునవ్వుతో బదులిచ్చేది తప్ప తనకు తెలుసు అని ఏనాడు అనలేదు. అదీ భ్రమర కీటక న్యాయము అంటే. అదే రీతిన సంస్కరించబడినవారిలో శ్రీ రఘువీర పురందరే కూడ ఒకరు.



శ్రీసాయి పిలుపుతో తన కుటుంబముతో కలసి శిరిడీ వచ్చిన పురందరే ద్వారకామాయిలో శ్రీసాయిని దర్శించుకొని "శాలకు వెళ్ళి భోజనం చేసి రమ్మని" సాయి చెప్పటంతో రాధాకృష్ణమాయి ఇంటికి వెళ్ళగా, తలుపు తీయకుండానే ప్రశ్నించి రాధాకృష్ణమాయి త్రిప్పి పంపగా, మశీదుకు తిరిగి వచ్చిన పురందరే, బాబా ఆదేశముతో మరలా రాధాకృష్ణమాయి ఇంటి ముంగిట చేరిన వెంటనే పాదాలపై పడి భోరున విలపించి, అటుపిమ్మట అత్యంత ఆదరణ చూపిన రాధాకృష్ణమాయి చర్యకు ఆశ్చర్యచకితుడయినాడు పురందరే. శ్రీసాయినే తన పరమ గమ్యమని తన అనుభవం ద్వారా తెలుసుకుని, తరచు శిరిడీసాయిని దర్శించుకునే వాడు పురందరే. తన ఒక్కడి సంపాదనతో కుటుంబ పోషణే కష్టతరమయిన పురందరేతో, ఇల్లుకట్టుకోమన్న శ్రీసాయి ఆజ్ఞ మేరకు అతికష్టంమీద బాంద్రా ఊరిచివర ఒక స్థలం మాత్రం కొనగలుగుతాడు, అయితే తను చెప్పిన విధముగా ఇల్లు కట్టలేదని బాబా, పురందరేకు ఒక కొత్తరకం శిక్ష వేస్తాడు. నిరంతరం తలలో విపరీతమైన నరాల పోటుతో బాధపడేవాడు పురందరే. తలలోని నరాలపోటుతో నిద్ర కరువైన పురందరేను చూసి, రాధాకృష్ణమాయి, బడేబాబా మొదలైనవారు ఆ బాధ ఉపశమింపజేయమని బాబాను కోరగా, "నేను చెప్పిన మాట వినలేదు కదా! ఇల్లు కడితేనే ఆ బాధ తగ్గేది" అంటారు బాబా. మదిలో కించిత్తు కినుక కూడ వహించక, విధిలేక ఆఫీసులో 500 రూపాయలు అప్పుచేసి ఊరికి దూరంగా తాను కొన్న స్థలంలో, అందరికీ ఇల్లు కట్టుబడిచేసే శ్రీపురందరే, తన తలలోని నరాల బాధతో ఆపని తన తమ్ముడికి అప్పచెప్పగా, నల్లరేగడి నేలలో బలమైన పునాదులు లేకుండానే, త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేస్తాడు అతని తమ్ముడు. నిర్మాణ దశలోనే ఇంటి గోడలు బీటలు వారుతున్నా, సాయి ఆదేశం మీరకూడదని త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేయించి, గృహప్రవేశం చేసిన మరుక్షణం పురందరే తలలోని నరాల బాధ తగ్గిపోతుంది. ఊరికి దూరంగా ఏకాంతముగా ఉన్న ఇంటిలో యుక్త వయస్కురాలైన భార్యను, చంటిబిడ్డను ధైర్యంగా వదలి ఆఫీసు పని మీద బొంబే వెళ్ళి ఏరాత్రికో ఇంటికి నిర్భయముగా తిరిగివచ్చేవాడు "నీ ఇంటికి నేనెప్పుడూ కాపలా కాస్తూనే ఉన్నాను" అన్న సాయి అభయంపై అపార విశ్వాసం కల పురందరే.

మనకు అర్హత లేకపోయినా కోరినది నెరవేర్చమని పదే పదే సద్గురువును ప్రాధేయపడుతూ, అత్యుత్తమమైనది ప్రసాదించమని అడిగేవారికి, గురువాజ్ఞపై అత్యంత కష్టతరంగా ఏర్పాటు చేసుకున్న గూడుపైన కూడ వ్యామోహం పెంచుకోని పురందరేకు తేడా అదే. దాని పర్యవసానం, సర్వకాల సర్వావస్థలయందు సద్గురు రక్షణ లభించటమే కాకుండా, తగురీతిన జీవించటంతోపాటు సద్గురువు నిరంతరం తనలో, తనతో ఉన్న అనుభూతి అనుభవం అవుతుంది. అందుకు నిదర్శనమే శ్రీ రఘువీరపురందరే జీవితం. ఒకసారి శిరిడీ వెళదామని కుటుంబంతో సహా సమాయుక్తమైన పురందరేకు స్వప్నంలో శ్రీసాయి కన్పించి "శిరిడీ రావద్దు వస్తే సటకాతో కొడతానన్నారు", అది బాబా ఆజ్ఞగా పాటించి, ప్రయాణం


విరమించి ఆఫీసుకు వెళ్ళటం వలన పెద్ద సమస్యనుండి బయటపడడం జరిగింది. ఒకసారి శిరిడీలో బాబా దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణానికి సిద్ధమై, రైలు సమయం దాటిపోతున్న బాబా అనుమతి ఇవ్వకపోవటంతో ఉండిపోయిన పురందరే, అటుపిమ్మట బాబా అనుమతితో అకాలములో స్టేషనుకు చేరగా, అప్పుడే వచ్చిన ఒక ప్రత్యేక రైలులో సకాలములో గమ్యం చేరుతాడు.

ఒకసారి శిరిడీ వచ్చి సెలవు అయిపోయి బయలుదేరటానికి పురందరే సంసిద్ధమవ్వగా “నేనే నీ పై అధికారిని” అని చెప్పిబాబా చాలారోజులు శిరిడీలో ఉంచివేయటముతో ఉద్యోగంపై ఆశ వదలివేసుకొని ఉండిపోయి, చాలా రోజుల తరువాత బాబా అనుమతితో ఆఫీసుకు వెళ్ళినప్పుడు అతను సెలవు పెట్టకుండా ఆఫీసుకు గైరుహాజరయినందుకు రాజీనామా చేయమని ఆదేశించిన మేస్త్రి, పురందరే ఇచ్చిన రాజీనామా పత్రాన్ని, నాటి బ్రిటీషు అధికారి విల్సన్ దొరకు పంపగా, విధులకు రాలేకపోవటానికి కారణమేమిటని అడిగిన ఆ అధికారి, “శిరిడీలో బాబా చెంత ఉండిపోయాను” అని చెప్పగానే లేఖ చింపి, చెత్త బుట్టలో వేసి, వెంటనే ఉద్యోగములో చేరమని చెప్పి, మేస్త్రిని పిలచి “అతను నీ బంట్రోతుకాదు” అని మందలించటమే కాకుండా, ఆరు నెలలలో పురందరేకు ప్రమోషన్ కూడ ఇవ్వడం జరిగింది. అందువలన ఆ మేస్త్రి పురందరే క్రింది ఉద్యోగి అయినాడు. బాబామాటపై పురందరేకు గల అపారమైన విశ్వాసానికి ఇది మరొక నిదర్శనం.

ఒకసారి తల్లి భార్య బిడ్డతో కలసి నాసిక్ బయలుదేరటానికి సంసిద్ధమవగా, అక్కడ ప్లేగు వ్యాధి ప్రబలింది అని తెలిసి, యాత్ర మానివేయమని తల్లి ఎంతచెప్పినా, బాబా ఆశీర్వాదంతో కుటుంబముతో సహ సురక్షితంగా యాత్ర పూర్తిచేసుకొని వచ్చాడు పురందరే. అది సద్గురువుకు పగ్గాలు అర్పించటమంటే, సాయి అడిగిన శ్రద్ధ– సబూరి అనే రెండు పైసల దక్షిణ సమర్పించటమంటే అదే, తద్వారా సాయి నెరిపే ఆధ్యాత్మిక శిక్షణలో తగురీతిన సంస్కరించబడి, శ్రీసాయి సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులవ్వటం జరుగుతుంది. అందుకు ఆలంబనగా పురందరే జీవితంలో జరిగిన మరొక సంఘటనను పరిశీలిద్దాము.

ఒకసారి తన తల్లి, భార్య, బిడ్డతో కలసి తన అత్తగారింటికి బయలుదేరేడు పురందరే. తీరా రైల్వేస్టేషనుకు వచ్చాక అత్తారింటికి కాకుండా శిరిడీ వెళ్ళాలి అనే ప్రేరణ కలిగింది పురందరేకు, వెంటనే భార్య, తల్లితో “నాకెందుకో ఇప్పుడే శిరిడీ వెళ్ళాలి అని అనిపిస్తున్నది, కనుక మీరు తిరిగి మన ఇంటికి వెళ్ళండి. నేను తిరిగివచ్చిన తరువాత మీ అమ్మగారింటికి వెళదాము” అన్న పురందరే మాటలకు నిశ్చేష్టులై ఉండిపోయిన భార్యను, తల్లిని అక్కడ వదలి, వారెంత వారించినా వినకుండా అప్పుడే వచ్చిన రైలు ఎక్కి మన్మాడ్ చేరి అక్కడ నుండి శిరిడీకి చేరేడు పురందరే. మశీదులోకి అడుగిడి చూసేసరికి ఉబ్బసంతో బాధ పడుతూ, రొప్పుతూ ఉన్నారు శ్రీసాయిబాబా. ఆ స్థితిలో బాబాను చూడగానే పురందరేకు దుఃఖం ఆగలేదు మాటమాత్రం చేత, ఊదితో సర్వరోగాలు తగ్గించే బాబా, అట్లా బాధపడటం చూసి, ఏమి చేయలేని తన అసహాయ స్థితిని తలచుకొని రోధించాడు పురందరే. అతని బాధను చూసి అక్కడి వారి కళ్ళు చెమర్చాయి. కన్నీటి పర్యంతమైన పురందరేను చూస్తూ “ఎందుకు ఏడుస్తావు, ఏమీ కాదులే” అన్నారు బాబా. “అలా బాధపడుతూ వుంటే చూస్తూ ఎలా ఉండగలముబాబా, అసహాయులైన మాకు ఏమి చేయాలో తెలియటం లేదు, మాపై దయతో ఏమి చేయాలో చెప్పండి సాయి” అన్న పురందరేతో “ఏమి భయం లేదు, ఇది అల్లా ప్రసాదించారు కనుక, అల్లానే నివారిస్తారు, నాలుగు రోజులలో తగ్గిపోతుంది, అయినా మూడు రోజులుగా నీగురించే అనుకుంటున్నాను, నిన్ను రమ్మని జాబు వ్రాయమని కాకాసాహెబ్‌తో చెప్పేను” అన్నారు బాబా. “కాకావ్రాసిన జాబు నాకింకా చేరలేదు, దానికంటే ముందే, నా మదిలో తగురీతిన ప్రేరణ కలిగించి మీరే ఇక్కడకు తీసుకువచ్చారు” అన్నాడు పురందరే. నిజానికి బాబా మాటపై కాకాసాహెబ్ జాబు వ్రాయబోతుంటే, “సాయి వారించి, వద్దులే, అతడే ఇక్కడికి వస్తున్నాడు” అన్నారు సాయి, అది గురుశిష్య బంధం అంటే. మొదట శిరిడీ వచ్చినప్పుడు రాధాకృష్ణమాయి చర్యలోని అంతర్యము తెలియక ఆశ్చర్యపోయిన పురందరే, నేడు తనను చూసి ఇతరులు ఆశ్చర్యచకితులయ్యే స్థితికి వచ్చాడు. అంతటి ఆధ్యాత్మిక ఉన్నతి కలగటానికి కారణం నిరంతరం సద్గురు చింతనలో గడపటమే.

ఈ సృష్టి అంతటా, సద్గురువాణి నిండి ఉంటుంది. అయితే అందులో మనం అనుసంధానము అయినప్పుడే ఆవాణిని ఆలకించి, తగురీతిన చరించగలుగుతాము, దూరశ్రవణము (రేడియో) గాని, దూరదర్శన్ (టి.వి.) మీట నొక్కగానే అంతవరకు అంతటా వ్యాపించి ఉన్న విషయాలు వాటి ద్వారా అనేక రూపాలలో శ్రవణము చేయగలుగుతాము, దృశ్యముద్వారా వీక్షించగలుగుతాము. అదేవిధముగా చైతన్య స్వరూపుడయి అంతటా నిండి ఉన్న సద్గురువువాణిని వారితో అనుసంధానమైననాడు మనము వినగలుగుతాము. రేడియోలో బ్యాటరీ వేసి, సరిగ్గా ట్యూన్ చేయగలిగితే రేడియో ద్వారా ఆ యా కేంద్రముల ఆకాశవాణిని మనము ఎలా వినగలుగుతామో, అదేవిధముగా మనోశక్తితో, సద్గురువుపై ధ్యానను కేంద్రీకరించగలిగితే సర్వత్రా ఉన్న సద్గురువు బోధను ఆలకించి తగురీతిన ఆచరణకు ఉపక్రమించగలము. కనీసం సద్గురువుపై ధ్యాస కలిగిఉన్నా తగురీతిన వారు ప్రేరేపించి నడిపించగలరు. అందుకు ఉదాహరణే పురందరే జీవితంలోని సంఘటనలు. వీటన్నింటిని మించి, నేడు శిరిడీలో ప్రతి గురువారము అత్యంతవైభవంగా జరిగే చావడి ఉత్సవమునకు పురందరే నిమిత్తమాత్రుడయినాడు. అందుకు సంబంధించిన ఒక అద్భుత సంఘటన, అందులో పురందరే పాత్ర ద్వారా బాబా చేసిన అద్భుతమైన బోధ గురించి వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.



# శ్రీ గురు చరిత్రామృతము

**వివరణ : వి.వి. పూర్ణచంద్రరావు**

కలియుగములో రెండవ దత్తావతారమైన శ్రీగురుడిగా ప్రసిద్ధికెక్కిన శ్రీ నృసింహసరస్వతిస్వామి తన తీర్థాటనలో భాగముగా భువనేశ్వరీమాత క్షేత్రమైన భిల్లవటి గ్రామం చేరి ఏకాంతముగా తన అవతార కార్యక్రమము కొనసాగిస్తున్నారు. ఆ సమయములో కొల్హాపుర పట్టణములో వేదవిదుడు, అపార విద్యాపారంగతుడైన బ్రాహ్మణుడికి లేకలేక ఒక కుమారుడు కలిగినప్పటికి, అతడు మందమతి అవ్వటంతో ఆ దిగులుతోనే కొలది కాలములోనే ఆ బ్రాహ్మణ దంపతులు మరణించగా, ఆ బాలుడు తన తాత, మేనమామల ఇంట పెరగసాగేడు. తాత మేనమామలే కాకుండా, ఆ ఊరివారు కూడ ఆ బాలుడి తండ్రిపై గల గౌరవంతో అతనికి విద్యాబుద్ధులు నేర్పించటానికి ఎంతో ప్రయత్నించారు, కాని వారి ప్రయత్నాలన్నీ వృథా ప్రయాసలే కాగా, రాను రాను తన బంధువులు మరియు ఆ ఊరి ప్రజల ఎత్తిపొడుపు మాటలు భరించలేక తీవ్ర మనస్తాపమునకు గురియైన ఆ బాలుడు, కనీసం ఆకులు అలములు ఆరగిస్తూనైనా అడవిలో జీవించవచ్చని భావిస్తూ, సమీప అడవికి బయలుదేరి, మార్గ మధ్యములో భిల్లవటి గ్రామం చేరి, అపారమహిమగల అచ్చటి భువనేశ్వరీమాత గురించి ఆలకించి, ఆలయం చేరి, పలువిధములుగా ఆతల్లిని ప్రార్థించి, తనను కరుణించమని వేడుకుంటూ, "గాయత్రీ మంత్రము కూడ నోట ఉచ్చరించలేని నాలుక వృథా" అంటూ భువనేశ్వరీమాత ఎదుట తన నాలుకను కోసుకుని, మరి మూడు దినములలో తన భవితం గురించి తగిన ఆదేశము రాకున్నచో ఇచ్చటనే ప్రాయోపవేశము చేసెదనని, కఠినదీక్షతో నిద్రాహారములు మాని, అచటి పూజారులు ఎంత వారించినను వినక కఠిన దీక్షను కొనసాగించెను. ఒక నాటిరాత్రి భువనేశ్వరిమాత స్వప్నములో దర్శనమిచ్చి ఆ బాలుడిని అనునయించి, "ఊరిచివర అడవిలో కృష్ణాతీరాన ఈశ్వర స్వరూపుడై, ఔదుంబర వృక్షఛాయలో వసించుచున్న మహానుభావుడిని ఆశ్రయించు, నీ కోరిక నెరవేరగలదు" అన్న భువనేశ్వరీమాత ఆదేశాన్ని అనుసరించి ఆ బాలుడు కృష్ణానదిని దాటి అక్కడ పశ్చిమతీరాన మేడిచెట్టుక్రింద అపారమైన తేజస్సుతో, తపోమూర్తియై నిలచిన శ్రీగురుడి పాదాలపై పడి భోరున విలపించి, తన భాధను వెల్లడి చేయగా, పరమ దయాళువు అయిన శ్రీగురుడు, ఆ బాలుని శిరస్సుపై చేయి ఉంచి ఆశీర్వదించగానే, అతనికి నాలుక తిరిగి రావటమే కాకుండా, సకల విద్యాపారంగతుడైనాడు. అంతట ఆ బాలుడు పలురీతుల శ్రీగురుడిని స్తుతించి, వారి అనుగ్రహ ఆశీస్సులతో తన స్వగ్రామమునకు బయలుదేరెను. ఆ గ్రామ ప్రజలు, పూజారి ఆ సంఘటనకు అచ్చెరువొంది, శ్రీగురుడిని దర్శించుకొని, అంతవరకు కేవలం ఒక యతి అని భ్రమించి ప్రవర్తించిన తమ అజ్ఞానాన్ని మన్నించమని వేడుకొని, పలురీతుల శ్రీగురుడిని సేవించుకున్నారు. ఆ లీల ఆనోట, ఈనోట ప్రాకి, క్రమేపీ శ్రీగురుని దర్శనానికి ప్రజలు తండోపతండాలుగా రాసాగారు.

"గత జన్మ పుణ్యఫలం, తల్లితండ్రుల పూజాఫలం, ధర్మనిరతి, మనము చేసిన కర్మాచరణ వలన సంప్రీతుడైన భగవంతుడు తగిన గురువు దగ్గరకు పంపుతాడు" అన్న దానికి ప్రత్యక్ష నిదర్శనం ఈ లీల.గత జన్మలోచేసిన కర్మల ఫలితం ఈ జన్మలో అనుభవించ వలసివస్తుంది. సత్కర్మల వలన సంపద, కీర్తి, ప్రజ్ఞాపాటవములు, దుష్కర్మల వలన కష్టం నష్టం, రోగాలు, బాధలు మొదలైనవి అనుభవించవలసి వస్తుంది, అంతేకాక, గతజన్మ ఋణానుబంధాలే నేటి సంపదలు, భార్యాబిడ్డలు మొదలైనవని ఆర్యోక్తి. అపారమైన కీర్తి ప్రతిష్టలు అనుభవించే మహాపండితుడైన విద్వాంసుడు, మందమతియైన కుమారుని రూపంలో దుఃఖాన్ని అనుభవించి, తనువు చాలించారు, తరచిచూస్తే తరలిపోయిన వారికన్నా, ఉన్నవారికే బాధ ఎక్కువ.

ఎందరికో విద్య నేర్పిన తన తొలిగురువు అయిన తన తండ్రి, ప్రేమించి లాలించే తల్లి దూరమై, ఎన్నోబాధలు అనుభవించాడు ఆ బాలుడు. గతజన్మ కర్మలవలన మందమతియై, తన మతిమరుపుతో గాయత్రీ మంత్రాన్ని కూడ మననం చేయలేక, ఒకవేళ ఎదుటివారి ద్వారా ఆలకినస్తూ ఉచ్చరిద్దామని ప్రయత్నంచేసినా, నాలుక తిరుగక, సరిగ్గా ఉచ్చరించలేక, లోకుల పలుమాటలను పలురీతుల భరించాడు ఆ బాలుడు. తన దుస్థితిని, తన తాత, మేనమామ, చివరకు ఊరివారికి విన్నవించుకొన్నా ఫలితం లేకపోగా, వారి అవహేళనలను భరించలేక జనారణ్యంవీడి నిజారణ్యం చేరి, అక్కడ బ్రతుకు వెళ్ళదీయాలను కున్నాడు ఆ బాలుడు. తన దుస్థితికి తాను వగచాడే గాని, సాటివారిని, చివరకు

భగవంతుడిని కూడ నిందించలేదు. ఎక్కడో చదివినట్లు గుర్తు "భగవంతుడిని ప్రార్థించు గాని ప్రశ్నించవద్దు". తన దుస్థితికి తానే వగచాడు. దేవి నామం పలుకలేని నాలుకను కత్తిరించుకొని తనకు తానే శిక్ష వేసుకున్నాడు, అమ్మను ప్రాధేయపడ్డాడు. అంతటితో అతడి కర్మ తీరింది. భువనేశ్వరీమాత ఆదేశాన్ని తూచ తప్పకుండా పాటించినందులకు శ్రీగురుడి సన్నిధి ఆ బాలుడిపాలిట పెన్నిధి అయ్యి, క్షణకాలంలో సకల విద్యాపారంగతుడిని చేసింది.

మనలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞాన స్వరూపులుగా మార్చటానికే త్రిమూర్తులు, కలియుగంలో గురురూపమైన శ్రీ దత్తాత్రేయుడుగా అవతరించటం జరిగింది. సకల జనావళిని ఉద్ధరించాలనే అవతార లక్ష్యం కలిగిన "శ్రీ దత్తావతారులు ప్రముఖముగా కొన్ని లక్షణాలు కలిగి ఉంటారు. కేవలం భిక్షావృత్తితో మాత్రమే జీవిస్తారు, వేదికలెక్కి ఉపన్యాసాలు ఇవ్వరు, తమ ప్రాభల్యం చాటుకోవటానికి భక్తులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే చిల్లర మహిమలు చేయరు, వీలయినంతవరకు జన సంచారానికి దూరంగా ఉండటానికే ఇష్టపడతారు" అంటారు ఆచార్య శ్రీ భరద్వాజగారు. మార్తాండుడి తేజస్సు, సుగంధ భరితమైన కస్తూరి సువాసనలు ఎట్లా వ్యాపిస్తాయో, అదే విధముగా "మందమతియైన ఆ బాలుడికి నాలుక రావటమే కాకుండా తన హస్తస్పర్శతో సకల విద్యాపారంగతుడిని చేశారు" అన్న శ్రీగురుని లీలావిలాసము వ్యాప్తి కాసాగింది. అంతట శ్రీగురుడు ఆ ప్రదేశము వీడి తన పర్యాటన కొనసాగిస్తూ ముందుకు సాగేరు.

సంసార సాగరములో పడి దారితెన్ను కానరాక కొట్టుమిట్టాడే నాబోటివారి పాలిట కామధేనువు, కల్పవృక్షము కంటే అధికమై, సంసార సాగరము నుండి సురక్షితంగా ఒడ్డుకు చేర్చే నావవంటి శ్రీగురుచరితామృతాన్ని శ్రవణం చేయిస్తూ, నాపాలిట శ్రీగురు స్వరూపులైన ఓ సిద్ధమునీ! మీకు జయము జయము, శ్రీ గురుడి లీలావిలాసములతో పాటుగా, నాలో చెలరేగే సందేహాలను నివృత్తిచేస్తూ, శ్రీగురుకథా శ్రవణముపట్ల నాకు మరింతగా ఆసక్తి కలుగజేస్తున్న మీకు ఏమిచ్చి ఋణము తీర్చుకోగలను. శ్రీగురుడిని శంకిస్తూ, అనేక కష్టాలపాలైన నాకు, నేడు శ్రీగురుకథా శ్రవణమందు అపారమైన భక్తి ఏర్పడటమే కాకుండా, క్రమేపీ వారి చరణారవిందములపై నా మనస్సు స్థిరముగా నిలుస్తూ ఉన్నది. కనుక నాపై దయతో మరింతగా శ్రీగురులీలావిలాసములు తెలియజేయమని ముకుళిత హస్తాలతో, అమితమైన భక్తిశ్రద్ధలతో శిరస్సు వంచి వేడుకున్న నామధారకుడితో సిద్ధముని "ఓ శిష్యశిరోమణి నిన్ను చూస్తుంటే నాకు మహదానందము కలుగుతున్నది. శ్రీగురుచరిత్ర శ్రవణము చేతనే నీలో కలిగిన ఈ మార్పు నిన్ను ధన్యత చెందిస్తుంది. నీమూలముగా నేనూ మరింత వివరముగా శ్రీగురుని లీలలు స్మరించుకుంటూ, నీతో పంచుకోవటము ద్వారా నాలో మరింత ఉత్సాహము, స్ఫూర్తి కలుగుతున్నది. భిల్లవటిని వీడి తన పయనం కొనసాగించిన శ్రీగురుడి లీలావిలాసములు తెలియచేసేదను సావధానుడవై ఆలకించుమని" శ్రీగురుచరిత్రలోని 18వ అధ్యాయంలోని విషయ విశేషాలు సిద్ధముని చెప్పటం ప్రారంభించారు.

భిల్లవటిని వీడి తన తీర్థాటన కొనసాగించిన శ్రీగురుడు, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వరుణా సంగమములో భక్తులను అనుగ్రహించి, అటుపిమ్మట కృష్ణానదీ తీరానగల తీర్థాలను పవిత్రం ఒనర్చవలెనని, వాటిలో స్నానమాచరిస్తూ నరసింహవాడి అనే క్షేత్రము చేరెను. అచ్చట పంచగంగలైన శివ, భద్ర, భోగవతీ, కుంభీ, సరస్వతి అనే ఐదు నదులు - కృష్ణ- వేణిలో సంగమించుటచే పంచగంగా సంగమమని, సప్త గంగా సంగమమని ప్రసిద్ధిచెందింది. కాశీ, ప్రయాగ పుణ్య క్షేత్రములవలే ఆసంగమము అత్యంత ప్రసిద్ధి చెందినది. పురాణ ప్రసిద్ధమైన పంచగంగా సంగమస్థానములో స్నానమొనర్చిన సమస్త పాపములు తక్షణమే నశించిపోవునని ప్రతీతి. అత్యంత మనోహరమైన ఈ సంగమస్థానము వద్దే అమరపురమనే గ్రామము కలదు. అచ్చట సాక్షాత్తు కల్పవృక్షము వంటి ఔదుంబర వృక్షము కలదు. షట్కూల తీర్థమని పిలువబడే ఆ సంగమ ప్రదేశములో అమరేశ్వరుడే దైవము. ఆయన సన్నిధిలో 64 మంది యోగినులు నివసించుటచే నిర్గుణ రూపమైన శక్తిపీఠముగా ఆక్షేత్రము విరాజిల్లు చుండెడిది. లింగరూపములో ఉన్న అమరేశ్వరునికి నమస్కరించి, పూజించిన మానవులు తప్పకుండా అమరత్వాన్ని పొందగలరు. అంతటి ప్రసిద్ధి చెందిన ఆ క్షేత్రములో కోటితీర్థములు నిర్గుణ రూపంలో ఉండును. అచ్చటి కృష్ణానది వేణి నదితో కలసి నిరంతరము దక్షిణ దిక్కుగా ప్రవహిస్తూ ఉంటుంది. ఈ ప్రదేశము నందే అపరిమితమైన తీర్థములు కలవని పురాణములలో విస్తృతముగా వర్ణించబడినది. వాటిలో తూర్పు, పశ్చిమ ఒడ్డులను తాకుతూ దక్షిణముగా ప్రవహించే పశ్చిమ వాహిని అయిన కృష్ణానదిలో బ్రహ్మహత్యాది పాపములను పరిహరించే శుక్లతీర్థము, అమరేశ్వర సన్నిధానము నందు పాపవినాశ తీర్థము, కామ్యతీర్థము, వరదతీర్థము మరియు షట్కూలతీర్థములతో పాటుగా, ప్రయాగతీర్థము, శక్తితీర్థము, అమరతీర్థము, కోటితీర్థములు కలవు. సంగమమునకు ఇరువైపుల కల ఈ తీర్థములన్నియు మహామహిమాన్వితమయినవి.

అచ్చట నిరంతరం ప్రవహించే కృష్ణ - వేణీ నది సంగమ క్షేత్రములో పంచగంగలు కలియుటచే సప్త గంగాసంగమము అని పిలువబడే ఈ సంగమ మహిమ వర్ణించనలవికానిది. ఇదొక సిద్ధ క్షేత్రము. ఆ క్షేత్రము సందర్శనము మాత్రము చేతనే సర్వ అభీష్టాలు నెరవేరును. అచ్చట తీర్థములలో స్నానమాచరించిన సకల మనోరథాలు నెరవేరును. అటువంటి మహా పుణ్యక్షేత్ర మగుటచేతనే శ్రీగురుడు అచ్చట సంగమ క్షేత్రములోని ఔదుంబర వృక్షాన్ని తన నివాస యోగ్యముగా చేసుకున్నారు. అందుచేత ఆ ఔదుంబర వృక్షము భక్తులపాలిట కల్పతరువయినది. శ్రీగురుడు అక్కడ నివసించుట వలన ఆ క్షేత్రమహిమ జగద్విఖ్యాతమైనది. ఆ సంగమ క్షేత్రములోని ఔదుంబర వృక్షఛాయలో తన అనుష్ఠానము ఒనర్చుకుంటూ, మధ్యాహ్నము సమయములో భిక్షార్థమై

సమీపమందలి అమరపురం గ్రామం వెళ్ళుచుండెడివారు శ్రీగురుడు. ఆ గ్రామంలో వేదాధ్యాయన పరుడైన ఒక బ్రాహ్మణుడు నివసించెడివాడు. నిరుపేద అయిన ఆబ్రాహ్మణుడు, వైదిక కార్యక్రమాలు లేని సమయములో యాయవారవృత్తితో తన కుటుంబ పోషణ చేసుకుంటూనే, ఉన్నదానిలో భక్తి శ్రద్ధలతో క్రమం తప్పకుండా పంచయజ్ఞాలు నిర్వర్తించేవాడు. (పంచమహాయజ్ఞాలు–బ్రహ్మయజ్ఞం,దేవయజ్ఞం,పితృయజ్ఞం,భూతయజ్ఞం,మనుష్యయజ్ఞం)

తన సహధర్మచారిణి సహకారంతో తన కుమార్తె, కుమారుడితో కూడి తన శక్తిమేరకు, అతిథి అభ్యాగతులను భగవత్ స్వరూపులుగా భావిస్తూ, తన కర్తవ్యాన్ని నిర్వర్తించేవాడు. ఒక రోజు ఆ బ్రాహ్మణుడు యాయవార వృత్తి చేసుకొని, ఇంటికి తిరిగి వచ్చాడు. అతని దురదృష్టమేమో ఆరోజు పిడికెడు బియ్యం కూడ లభించలేదు. ఇంట్లో దినుసులతోపాటు ధాన్యం కూడ నిండుకొని ఉన్నాయి, ఆకలితో ఉన్న భార్య, కుమార్తె, కుమారుడిని చూస్తూ వారి క్షుద్బాధను తీర్చటానికై ఆ బ్రాహ్మణుడు యోచిస్తున్న సమయంలో భిక్షకై గుమ్మం ఎదుట నిలచిన శ్రీగురుడిని చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు అతను. క్షణకాలంలో తేరుకొని, భార్యను పిలచి ముంగిట నిలచిన ఈశ్వర స్వరూపమైన శ్రీగురుడి పాదాలకు నమస్కరించి, లోనికి ఆహ్వానించాడు. అతిథి మర్యాదలను కొనసాగిస్తునే, ఆలోచనలో పడ్డాడు అతను. “తమ ఆహారంకోసమై ఆలోచిస్తున్న తరుణంలో ఈశ్వర స్వరూపుడైన యతీశ్వరుడు తమ ముంగిట నిలచారు. మధ్యాహ్న భిక్షా సమయంలో విచ్చేసిన వారికి తగురీతిన గౌరవించి ఆహారం అందజేయుట గృహస్తు ప్రథమ కర్తవ్యం. అట్లుకాక రిక్త హస్తములతో ఖాళీ కడుపుతో వెనుతిరిగిన అతిథి, గృహస్తు పుణ్యాన్ని తీసుకొని వెళతారని శాస్త్రం. అటువంటి తరుణంలో సాక్షాత్తు శ్రీగురుడే తమ గృహాన్ని పావనం చేశారు ఏమిటి కర్తవ్యం” అంటూ అంతర్మథనుడైనాడు ఆ బ్రాహ్మణుడు. అటుపిమ్మట జరిగిన శ్రీగురుని లీలావిలాసములు వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.

## పండుగలు - పర్వదినాలు

### ఏప్రిల్ - 2022

1. కొత్త అమావాస్య
2. తెలుగు నూతన సంవత్సరం
   ఉగాది – శ్రీ “శుభకృత్” నామ సంవత్సరం
3. రంజాన్‌నెల ప్రారంభం
3. మహద్గురు శ్రీ పూర్ణానందస్వామి ఆరాధనోత్సవం (తిథిప్రకారం)
8. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవం (తిథిప్రకారం)
10. శ్రీరామనవమి, శ్రీ గురుసిద్ధారూఢస్వామి జయంతి
10. శ్రీ సమర్థరామదాసస్వామి జయంతి, సజ్జనఘడ్
12. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవం (తేదీప్రకారం)
13. “ప్రాణహిత” (ప్రణీత) నది పుష్కరాలు ప్రారంభం
14. మహావీర్ జయంతి
14. భగవాన్ శ్రీరమణమహర్షి ఆరాధనోత్సవం (తేదీప్రకారం)
14. సాయిభక్త శ్రీ శివనేశన్‌స్వామి జయంతి (తిథిప్రకారం)
14. స్వామి సమర్థ శ్రీ అక్కల్‌కోటస్వామి ప్రకటమైనరోజు (తిథిప్రకారం)
15. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి కళ్యాణోత్సవం
15. గుడ్‌ఫ్రైడే
16. చైత్రపూర్ణిమ
24. “ప్రాణహిత” నది పుష్కరాలు ముగింపు
30. మాత ఆనందమాయి జయంతి

### మే - 2022

3. అక్షయ తృతీయ
   శ్రీ సింహాచల నృసింహస్వామి నిజరూప దర్శనం
   చందనోత్సవం – సింహాచలం, విశాఖపట్నం జిల్లా
3. రంజాన్ పండుగ
8. మొగలిచర్ల శ్రీ దత్తాత్రేయస్వామి ఆరాధనోత్సవం (తిథిప్రకారం)
10. శ్రీ గురుసిద్ధారూఢస్వామి ఆరాధనోత్సవము, హుబ్లీ (తిథిప్రకారం)
10. ఖ్వాజీ మొహిద్దీన్ చిస్తీ జయంతి (తేదీప్రకారం)
15. ఉపాసనీ మహరాజ్ జయంతి (తేదీప్రకారం)
16. పదకవితా పితామహుడు తాళ్ళపాక శ్రీఅన్నమాచార్య జయంతి
16. వైశాఖ పూర్ణిమ – బుద్ధజయంతి
20. కంచిపరమాచార్య శ్రీ చంద్రశేఖర సరస్వతి మహస్వామి వారి జయంతి
22. ఆధోని అవధూత శ్రీ తిక్కలక్ష్మమ్మ ఆరాధనోత్సవం (తిథిప్రకారం)
23. హజరత్ శ్రీ కాలేమస్తాన్‌షావలియా ఆరాధనోత్సవం (తేదీప్రకారం) గుంటూరు
25. హనుమజ్జయంతి
   వివిధ ఆధ్యాత్మిక – సామాజిక సేవాకార్యక్రమాలు – శ్రీసద్గురు పాదుకాక్షేత్రం – పవర్‌సిటీ, విశాఖపట్నం

### జూన్ - 2022

6. అవధూత శ్రీ చివటం అమ్మ ఆరాధనోత్సవం (తిథిప్రకారం)
14. యోగిరాజు శ్రీ దామరాజు వేంకటయోగీంద్రులు (శ్రీ పాకలపాటి గురువుగారి) (తిథిప్రకారం) జయంతి – నర్సీపట్నం
26. అవధూత శ్రీ నాగమునీంద్రస్వామి ఆరాధనోత్సవం (తిథిప్రకారం)
27. శ్రీ వాసుదేవానందసరస్వతీస్వామి ఆరాధనోత్సవం (తిథిప్రకారం)

### జూలై - 2022

1. శ్రీ గులాబ్‌బాబా జయంతి (తేదీప్రకారం) కాటేల్
2. పూరీ జగన్నాథుని రథయాత్ర
10. తొలి (శయన) ఏకాదశి

12, 13, 14 గురుపూర్ణిమ మహోత్సవాలు–పవర్‌సిటీ, విశాఖపట్నం

13. గురుపూర్ణిమ
17. కర్కాటక సంక్రమణం – దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభం
23. ఆడి కృత్తిక

# సంప్రదాయాలు - ప్రాణహిత (ప్రణీత) నది పుష్కరాలు

పవిత్ర జీవనదీమతల్లిగా గుర్తింపుపొంది, అధిక భాగం తెలుగు నేలలో ప్రవహిస్తున్న గోదావరి నదికి ప్రధాన ఉపనది ప్రాణహిత (ప్రణీత) నది. సహ్యాద్రి పర్వత శ్రేణులు ప్రాణహిత జన్మస్థలం. మహారాష్ట్రలోని అహెరి వద్ద పెన్‌గంగా నది వేయిన్ గంగాతో కలుస్తుంది. మరోవైపు వేయిన్ గంగా, వరదా నదీ ప్రవాహంతో కలిసి ప్రాణహిత నదిగా రూపుదిద్దుకుని మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా, అదిలాబాద్ జిల్లా సరిహద్దుల గుండా 130 కి.మీ.లు ప్రవహించి కాళేశ్వరం వద్ద గోదావరిలో సంగమించి, ప్రాణహిత గోదారమ్మకు అండదండనిచ్చి ఎన్నటికీ ఎండిపోకుండా జలసిరులు పొంగిస్తూ, తన పేరును సార్ధకం చేసుకుంటోంది. కాళేశ్వరక్షేత్రంలో పుష్కర స్నానమాచరించి ముక్తేశ్వరున్ని దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం.



సమస్త ప్రాణికోటి మనుగడకు ఆధారం జలం. జలం పుట్టిన తరువాత జీవకోటి ఉద్భవించింది. జలధారల వెంటే తొలుత నాగరికత విస్తరించింది. అలాంటి జలానికి దేవత రూపాలనిచ్చి తల్లిగా ఆరాధించడం హిందూ సంప్రదాయం. అలాగే నదీ స్నానాలు, కోనేటి స్నానాలు, సముద్ర స్నానాలు, మంగళ స్నానాలు అని అనేక హిందూ సంప్రదాయాలు నీటితో ముడిపడి ఉన్నాయి. అలాగే తీర్ధయాత్రలు, పుణ్యక్షేత్రాల దర్శనం కూడా నీటితో ముడిపడి ఉంది. శ్రాద్ధకర్మలు, పిండ ప్రధానాలు, తర్పణాలు కూడా జలంతో ముడిపడినవే. నదీతీరంలో పితృకర్మలాచరించడం మోక్షదాయకమని పెద్దలు చెప్తారు. పితరులను ఉద్ధరించడానికి భాగీరధుడు గంగానదిని భూమికి తీసుకు వచ్చాడని పురాణాలు చెప్తున్నాయి. నదీ స్నానాలలో పుష్కర స్నానం పుణ్యప్రదమని హిందువుల విశ్వాసం. తైత్తరీయ ఉపనిషత్తు "బ్రహ్మ నుండి ఆకాశం, ఆకాశం నుండి వాయువు, వాయువు నుండి జలం, జలం నుండి భూమి, భూమి నుండి ఔషధులు, ఔషధుల నుండి అన్నం, అన్నం నుండి జీవుడు పుట్టాయని" వివరిస్తుంది. ఇలా జీవరాశులకు ప్రధానమైన జలం, స్నానం ప్రాముఖ్యతను గుర్తుచేసేవే పుష్కరాలు.

పురాణ గాథల ప్రకారం పూర్వకాలంలో పుష్కరుడు అనే బ్రాహ్మణుడు శివుడి కోసం ఘోర తపమాచరించాడు. అతడి భక్తికి మెచ్చి ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకొమ్మన్నాడు శివుడు. అందుకు పుష్కరుడు జీవులు చేసిన పాపాలతో నదులు అపవిత్రమవుతున్నాయనీ నదులు పునీతమైతే దేశం సుభిక్షంగా ఉంటుందనీ ఆలోచించి 'దేవా! నా శరీర స్పర్శచే సర్వం పునీతం అయ్యేట్టు వరమివ్వు' అని ప్రార్థించాడట. అప్పుడు శివుడు " నీవు ఏ నదిలో ప్రవేశిస్తే ఆ నది పుణ్యతీర్థమవుతుంది. ఆ నదిలో స్నానమాచరించిన వారంతా పాపవిముక్తులవుతారు' అని వరమిచ్చాడట. పుష్కర మహత్యం తెలుసుకున్న గురుడు (బృహస్పతి) తనకూ పుష్కరత్వం ప్రసాదించమని బ్రహ్మను గురించి తపమాచరించగా అందుకు పుష్కరుడు అంగీకరించలేదు. పుష్కర, బృహస్పతులిద్దరికీ నచ్చజెప్పిన బ్రహ్మ వారిద్దరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించాడు. బృహస్పతి ఏడాదికి ఒక్కో రాశి చొప్పున 12 రాశుల్లో సంచరిస్తాడు ఆ మేరకు, బృహస్పతి ఆయా రాశుల్లో చేరిన తొలి పన్నెండు రోజులనూ ఆది పుష్కరాలుగానూ చివరి పన్నెండు రోజులనూ అంత్య పుష్కరాలుగానూ వ్యవహరించి పుష్కర వేడుకలు నిర్వహిస్తారు. ఉదాహరణకు గురుడు మేషరాశిలో ప్రవేశించినప్పుడు గంగ పుష్కరాలు నిర్వహిస్తారు. అలాగే వృషభరాశిలో ప్రవేశించినప్పుడు నర్మద, మిధునరాశిలో ప్రవేశించినప్పుడు సరస్వతీనది పుష్కరాలు... ఇదే కోవలో మీనరాశిలో ప్రవేశించినప్పుడు వచ్చేవే ప్రాణహిత నదీ పుష్కరాలు. ఆ సమయంలో బ్రహ్మాది దేవతలంతా పుష్కరునితో సహా నదీజలాల్లో ప్రవేశిస్తారు కాబట్టి ఆ యానదుల్లో స్నానాలాచరించడం వల్ల జన్మజన్మల పాపాలు నశిస్తాయనీ, అక్కడ పిండప్రధానాలు చేస్తే పితృదేవతలు పుణ్యలోకాలు పొందుతారనీ భక్తుల విశ్వాసం.


కరీంనగర్ జిల్లా మహాదేవపూర్ మండలంలో జిల్లా కేంద్రానికి 140 కి.మీ.ల దూరంలో ఉంది కాళేశ్వరక్షేత్రం. గోదావరి, ప్రాణహిత, సరస్వతీ (అంతర్వాహిని) నదులు కలిసే ప్రాంతం కావడంతో త్రివేణి సంగమంగా ప్రసిద్ధి కెక్కింది. త్రివేణి సంగమంలో కలిసే పెన్ గంగా, వరదా నదులను కలిపి పంచగంగ అంటారు. కాళేశ్వర, ముక్తేశ్వర లింగాలుగా శివుడు ఇక్కడ ఒకే పానపట్టంపై కొలువుండటం విశేషం. ఇందులో ముక్తేశ్వరుని లింగానికి రెండు నాసికా రంధ్రాలు ఉండి వాటిలో ఎన్ని నీళ్లు పోసినా కనిపించకుండా పోవడం ఇక్కడ మరో ప్రత్యేకత. ప్రధాన దేవాలయానికి ఆగ్నేయ భాగంలో యమకోణం ఉంది. ఈ యమకోణం ముందు తలవంచి పడమర నుంచి తూర్పునకూ దక్షిణం నుంచి ఉత్తరం వైపూ దూరి బయటకు వస్తే పాపాలన్నీ పరిహారమవుతాయని భక్తుల నమ్మకం..

ప్రణీతావరదావైన్యా గౌతమీచ సరస్వతీ
నద్యః పంచ వహంత్యత్ర ప్రయాగా త్కోటిశోధికం


ప్రాణహిత నది, వైన్య, వరద, సరస్వతీ నదులు గోదావరిలో సంగమించే క్షేత్రంలో స్నానమాచరిస్తే త్రివేణి సంగమ క్షేత్రమైన అలహాబాదు (ప్రయాగ)లో స్నానం చేసిన దానికంటే కోటిరెట్లు అధికమైన ఫలం లభిస్తుందని స్కంధపురాణంలోని కాళేశ్వర ఖండం చెబుతోంది. అంతటి ప్రత్యేకత గలది కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరం.

(ఏప్రిల్ 13వ తేదీ బుధవారము నుండి 24వ తేదీ ఆదివారము వరకు ప్రాణహిత నదీ పుష్కరాల సందర్భముగా సమర్పణ)


సేకరణ : **శ్రీమతి వి.యస్ లక్ష్మి**




# ఒక్క క్షణం !

1912వ సం॥లో ఒకనాడు ప్రొద్దున్న శ్రీ రమణమహర్షి, పళనిస్వామి, వాసుదేవ శాస్త్రి, మరి కొందరు విరూపాక్ష గుహ నుండి, నూనె, షీకాయ పొడి తీసుకొని పచ్చఅమ్మన్ కోవెలవైపు బయలుదేరారు – అక్కడ అభ్యంగన స్నానానికి అనువుగా ఉంటుందని. ఆ స్నానమయిన తరువాత కొండమీదకు అడ్డదారిన తిరుగు ప్రయాణం ప్రారంభించారు. స్నానమూ, ఆ తరువాత నడకా, మహర్షికి కొంత అలసట కలిగించాయి. ఎండ తీవ్రంగానే ఉంది. సమయం 10 గంటలు అయింది. కొండనెక్కటం ఇంకా శ్రమ కలిగించింది. పళనిస్వామి, శాస్త్రి ముందుగా నడచిపోతున్నారు. మహర్షి 'తాబేలు బండ' దగ్గరికి చేరుకొనేప్పటికి సొలసి పోయారు. ఆ తరువాత జరిగిన దానిని భగవాన్ శ్రీ రమణమహర్షి గారి మాటల్లో తెలుసుకుందాము.



"హఠాత్తుగా నా యెదుట నున్న ప్రకృతి అదృశ్యమై, నా కంటి ముందు తెల్లని పరదాని పరచినట్లు, ఆ ప్రకృతిని కప్పేసినట్లు అనిపించింది. అట్లా క్రమేపీ జరగటం నాకు స్పష్టంగా కనబడుతూనే ఉంది. ఒక దశలో సగభాగం ప్రకృతి కనిపిస్తూండగా – మెల్లగా ఆ తెరని లాగుతున్నట్లు అనిపించింది. ఇది జరగగానే పడిపోతానేమో నన్న భావంతో నడవటం ఆపేశాను. తేరుకున్న తరువాత మళ్ళీ నడకని ప్రారంభించాను. మళ్ళీ రెండవసారి సొలసి పోవటమూ, అంతా చీకటిమయమూ అయినప్పుడు ఒక బండరాయి నానుకున్నాను, తేరుకోవటానికి. అప్పుడు ఆ తెల్లని తెర నా చూపును పూర్తిగా కప్పివేసింది. తలతిరిగింది. రక్తం నాళాలలో ప్రవహించట మాగిపోయింది., శ్వాస నిలచిపోయింది. చర్మం నీలంగా మారిపోయింది. చనిపోయినప్పుడు వచ్చే నీలపు రంగు అది. ఇంకా నీలంగా అవుతూనే ఉంది. వాసుదేవ శాస్త్రి నేను చనిపోయాననుకున్నాడు. నన్ను తన చేతులలోకి తీసుకొని బిగ్గరగా ఏడ్వసాగాడు. అతని ఒళ్లు వణికిపోయింది. అతని పట్టూ, ఏడుపూ తెలిశాయి నాకు. అతని ఏడుపు అర్థమయింది నాకు. నా శరీరరంగు మారిపోవటం, గుండె ఆగిపోవటం, శ్వాస ఆగిపోవటం – అన్నీ తెలిశాయి నాకు. నా కాళ్ళూ చేతులూ చల్లబడటం కూడా తెలిసింది. అయినా నా సహజ సమాధి ఆ స్థితిలో కూడా కొనసాగుతూనే ఉంది. నాకే మాత్రమూ భయం కలుగలేదు. నా శరీర దుస్థితికి చింతా కలుగలేదు. బండరాయి దగ్గర మామూలు ఆసనంలో కూర్చోగానే కళ్ళు మూసుకున్నాను – నేను రాయికి చేరగిల్లలేదు. రక్త ప్రసారం లేకపోయినా, శ్వాస లేకపోయినా శరీరం అదే ఆసనంలో ఉండిపోయింది. ఈ పరిస్థితి పది, పదిహేను నిమిషాలపాటు నిలిచింది. హఠాత్తుగా శరీరంలో విద్యుత్ప్రవాహంవలె ఏదో పాకింది. వెంటనే రక్త ప్రసారం బలీయంగా ప్రారంభించింది, అట్లాగే శ్వాస కూడా, ఒళ్ళంతా చెమటలు పోశాయి. చర్మం మళ్లీ మామూలుగా సజీవమయిన స్థితిలో ఉండే రంగులోకి మారింది. అప్పుడు కళ్ళు తెరచి "పోదాం పదండి" అన్నాను. ఇంక ఏ గొడవా లేకుండా విరూపాక్ష గుహని చేరుకొన్నాం. నా రక్త ప్రసారమూ, శ్వాస ఆగిపోవటం ఆ ఒక్కసారే జరిగాయి".

ఈ సంఘటన గురించి మహర్షి ఇట్లా అన్నారు –"ఆ రకమైన మూర్ఛను నేను కావాలని తెచ్చుకోలేదు. చనిపోయేటప్పుడు ఈ దేహమెట్లా ఉంటుందో చూద్దామన్న కోరిక కూడా కలుగలేదు. ఇతరులకి చెప్పకుండా ఈ దేహాన్ని విడువను అని నేనెప్పుడూ అనలేదు. అప్పుడప్పుడు నాకు వచ్చే మూర్ఛల వంటిదే అది కూడా. ఎటొచ్చీ ఈసారి మాత్రం బాగా తీవ్రతరమైంది." అని భగవాన్‌గా ప్రసిద్ధికెక్కి, కోట్లాది మందిని ఆత్మజ్ఞానంవైపు నడిపిన, నడిపిస్తున్న శ్రీ రమణమహర్షి చెప్పిన మాటలివి. నేడు బాబా దగ్గరకు కోరికలు కష్టాలతో వెళ్ళి ఒక అనుభూతో, అనుభవమో రాగానే సాక్షాత్తు సాయినే నన్ను అనుగ్రహించి, తన ప్రతినిధిగా మార్చేరు, మిమ్ములను సకల వ్యాధి, బాధ రహితులుగా , ఆత్మజ్ఞానులుగా, తత్వ జ్ఞానులుగా, ఆధ్యాత్మిక గురువులుగా, పరమహంసలుగా మహర్షులుగా పరమ గురువులుగా చివరకు సాయి స్వరూపులుగా మార్చి, ఆ శక్తిని మీకు ప్రసాదిస్తామని చెబుతూ, సాయి పేరిట వ్యాపారాశ్రమాలు ప్రారంభించేవారికి, శ్రీ రమణమహర్షి లాంటి నిజమైన సద్గురువులకు తేడా అదే. ఆధ్యాత్మిక ప్రపంచానికి చక్రవర్తి అయిన శ్రీ శిరిడీసాయినాధునికి ఏ బిరుదులులేవు. శ్రీ శిరిడీసాయి సన్నిధిలో దాదాపు ఐదున్నర గంటలపాటు విశ్వచైతన్యానుభూతి పొందిన శ్రీ భరద్వాజగారు దాదాపు 12 సంవత్సరాలపాటు, తరచూ శిరిడీ వెళుతూ, సాయి సమకాలనీకుల అనుభవాలను తెలుసుకుంటూ గ్రంథస్తం చేసి, లక్షలాది మందిని నిర్దుష్టమైన సాయి మార్గంలో పయనింపచేస్తున్న వారికి కూడ ఏ బిరుదులు లేవు. కాని ఒక్కసారి కష్ట నష్టమో, రోగమో, బాధో తగ్గించుకోవటానికి శిరిడీవెళ్ళి, సాయి

అనుగ్రహముతో అది తొలగగానే గురువులుగా చెలామని అయ్యే వారికి మాత్రం ఎన్ని బిరుదులో.

మానవజాతి మనుగడకే ఆదర్శంగా నిలచిన శ్రీ రామాయణాన్ని ప్రథమంగా మనకందించిన వాల్మీకిని ఆది కవిగా మాత్రమే గుర్తించాము. ఆయనకు ఏ బిరుదులు లేవు, శ్రీ శిరిడీసాయిబాబా చరిత్రను సాయి అనుగ్రహంతో మొట్టమొదటగా భక్త జనులకు అందించిన అన్నాసాహెబ్ ధభోల్కర్‌ను సాయి స్వయంగా సంబోదించిన 'హేమాద్రిపంత్' అనే పేరు తప్ప మరే బిరుదులు లేవు. ఇలాంటివి ఇంకా ఎన్నో ఎన్నెన్నో, అన్నీ తెలిసినవారు కూడా ఎటువైపు పయనం చేస్తున్నారు? ఏమి ఆశిస్తున్నారు? వారిని ఆశ్రయించినవారు ఏమి పొందుతున్నారు? అవన్నీ తెలిసి ప్రచారం చేస్తున్న వారు ఏమి ఆశిస్తున్నారు? అది చూస్తున్న మనం ఏమి పొందుతున్నాము. అందుకే మన పూర్వీకులు అన్నారు ఓటికుండకు శబ్దమెక్కువ అని.

కష్టమో! నష్టమో, బాధో రోగమో ఇంకేదో మిషతో శ్రీ శిరిడీసాయిబాబాను ఆరాధించటం ప్రారంభించి, పూర్వజన్మ సుకృతం వలన అనుకున్నది నెరవేరిన వెంటనే, తాము శ్రీసాయి అనుంగులమని, వారి కృప మాపై అపారముగా వర్షిస్తున్నది, దానిలో కొంచెం మీకు పంచుతాము రండి అంటూ గురువుగా అవతారమెత్తి పబ్బంగడుపుకునే మిడతంబొట్ల గురువుల పాలిట పడకుండా, మన సంస్కారానికి అనువైన గురువుచెంత చేరి, వారి సంపూర్ణ అనుగ్రహం పొందే విధముగా తీర్చిదిద్దే కరదీపిక అయిన 'శ్రీగురుచరిత్ర'ను అందించారు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. నేడు దాని పారాయణ వలన సాటిలేని గురుసాన్నిధ్యం ప్రసాదిస్తుందని స్వయముగా తాను అనుభవించి అందించారు మాష్టారుగారు. శ్రీగురుచరిత్ర పారాయణ వలన ఉత్తమ గురు సంప్రదాయమెరిగి, సద్గురువును ఆశ్రయించి తమ జీవితాలను సార్ధకతమొందించు కుంటున్నారు లక్షలాది మంది. మానవాళికి రెండు కళ్ళలాంటి శ్రీగురుచరిత్ర, శ్రీసాయిబాబా జీవితచరిత్రల పారాయణ ద్వారా నిజమైన గురుతత్వమెరిగి జగద్గురువు అయిన శ్రీ శిరిడీసాయిబాబాను ఆశ్రయించి, సేవించి తరిస్తామోలేక, బోధక గురువు బాహ్యాండంబరాలకు ఆకర్షితులయ్యి పరిభ్రమిస్తూ ఉందామా అని ఒక్క క్షణం ఆలోచించి ప్రయత్నం కొనసాగిద్దాము.

# అక్షయ తృతీయ

అక్షయం అంటే ఎన్నటికీ తరగనిది అని అర్థం. తెలుగు కొత్త సంవత్సరములో రెండవ మాసమయిన వైశాఖములో మూడవ రోజు అయిన తదియను అక్షయ తృతీయ అంటారు.



మత్స్య పురాణంలోని అరవై ఐదవ అధ్యాయం ప్రకారం ఈశ్వరుడు పార్వతీదేవికి సర్వకామ ప్రథమైన అక్షయ తృతీయ వ్రతం గూర్చి చెప్పాడు. వైశాఖ శుద్ధ తదియ నాడు చేసే ఏ వ్రతమైనా, జపమైనా, హోమమైనా, దానాదులేవైనా లేక పుణ్య కార్యాచరణమేదైనా దాని ఫలితము అక్షయమౌతుంది. అలాగే పుణ్య కార్యాచరణ వల్ల వచ్చే ఫలితం అక్షయమైనట్లే, పాపకార్యాచరణ వల్ల వచ్చే పాపం కూడా అక్షయమే అవుతుంది. తృతీయా తిథి బ్రహ్మతో కలిసి ఉంటుంది. అందుచే విశేష పూజనీయమైనది. ఈ నాడు ఉపవాస దీక్ష జరిపి, ఏ పుణ్య కర్మనాచరించినా కూడా తత్సంబంధ ఫలము అక్షయముగానే లభిస్తుంది. ఈ తిథినాడు అక్షయుడైన విష్ణువు పూజింపబడతాడు. అందుకే దీనికి అక్షయ తృతీయ అని పేరు.

అక్షయ తృతీయ నాడు బంగారం వెండి లాంటి విలువైన వస్తువులు కొనటం రివాజుగా మారింది. కానీ అప్పో సొప్పో చేసి ఈ పండుగ జరుపుకోకూడదు. ఈ రోజు అప్పు చేస్తే అది కూడ అక్షయమవుతుంది.

వైశాఖ శుద్ధ తదియ నాడే శ్రీ సింహాచలములోని శ్రీ వరాహనరసింహస్వామి చందనోత్సవం (నిజరూప దర్శనం) ఉంటుంది. ఈరోజే పరశురాముని జన్మదినం, పవిత్ర గంగానది భూమిని తాకిన పర్వదినం, త్రేతాయుగం ప్రారంభమైన రోజు, శ్రీ కృష్ణుని తన బాల్యమిత్రుడు కుచేలుడు కలుసుకున్న రోజు, సూర్య భగవానుడు అజ్ఞాతవాసములోని పాండవులకు "అక్షయపాత్ర" ఇచ్చిన రోజు, వ్యాసమహర్షి వినాయకుడి సాయంతో "మహాభారతము"ను వ్రాయ ప్రారంభించిన రోజు, కుబేరుడు సమస్త సంపదలకు సంరక్షకునిగా నియమింపబడిన రోజు, ఆది శంకరాచార్యులు "కనకధారాస్తోత్రం" చెప్పిన రోజు, అన్నపూర్ణాదేవి అవతారం ప్రారంభమయిన రోజు, శ్రీకృష్ణుడు ద్రౌపది మానసంరక్షణ చేసిన రోజు. ఇంత పవిత్రమైన రోజున సత్కర్మాచరణ చేసి మనమూ ఆ భగవంతుని కృపకు పాత్రులవుదాము.

(మే 3వ తేదీ మంగళవారము
అక్షయతృతీయ సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీమతి విజయలక్ష్మి**, గోపాలపట్నం, వైజాగ్

# నమో శ్రీఆంజనీయం

మహర్షి వాల్మీకి మానవజాతికి అందించిన ఆదికావ్యం శ్రీమద్రామాయణం, అందులో కావ్య నాయకుడు శ్రీరామచంద్రుడు, ఆ తరువాత అంతటి ఉన్నతస్థానాన్ని పొందినవాడు హనుమంతుడు.

బాల, అయోధ్య, అరణ్యకాండలలో హనుమంతుడి ప్రస్తావన లేదు. కిష్కింధలో దర్శనమిచ్చిన హనుమంతుడు, సుందరకాండలో తన విశ్వరూపాన్ని ఆవిష్కరించి, యుద్ధకాండ ముగిసి శ్రీరామ పట్టాభిషేక పర్యంతం మన కన్నుల ఎదుట కదలాడుతూనే ఉంటాడు.

సామాన్యముగా భక్తులయిన వారందరికీ హనుమంతుడు–
యత్ర యత్ర రఘునాథ కీర్తనం, తత్ర తత్ర కృత మస్తకాంజలిం
బాష్పవాది పరిపూర్ణ లోచనం, మారుతిం సమత రాక్షసాంతకం.
(రామనామం వినిపించే ప్రతిప్రాంతంలో ఆనంద భాష్పాలతో తలవంచి నిలబడే మారుతికి నమస్కారం, ఇది భక్తుల దృష్టిలో హనుమంతుని రూపం) అయితే ఆదికవి వాల్మీకి అంతర్యంలో మాత్రం



అంజనా నందనం – వీరం, జానకీ శోకనాశనం
కపీశం అక్షహంతారం, వందే లంకా భయంకరం
అదీ ఆంజనేయుని స్వరూపం, రూపం.

శ్రీరామలక్ష్మణులు సీతను వెదకుతూ కిష్కింధ చేరారు. చేరిన వారిని ఋశ్యమూక పర్వతం మీద ఆప్తసచివులతో వున్న సుగ్రీవుడు చూస్తూనే గజగజలాడిపోయి పరుగు లంకించుకున్నాడు, అది చూసిన హనుమంతుడు సుగ్రీవుడిని ఆపి, ప్రభూ! ఏమిటి పరుగు, ఎక్కడికీ ప్రయాణం? అని అడిగేడు. "హనుమా! చూశావా ఆ కోదండపాణుల్ని, శక్తి సంపన్నులయిన వారిని మా అన్నగారయిన వాలి నన్ను చంపడానికి పంపేడు" అన్నాడు సుగ్రీవుడు.

"ప్రభూ! భయగ్రస్త హృదయానికి శంకలు ఎక్కువ. నిజానికి వారెవరో ఎందుకు వచ్చారో తెలియకుండా ఎందుకీ పలాయనం. మీరిక్కడే ఆగండి. నేను విషయం తెలుసుకొని క్షణంలో తమకు నివేదిస్తాను, అని భిక్షుక రూపంలో శ్రీరామలక్ష్మణుల ముందుకు చేరి చేతులు జోడించి, తలవంచి వినయముగా

"దివ్యకాంతులతో విరాజిల్లే మీ కాంతి చతుర్దశ భువనాలనూ గజగజలాడించ గలిగిన మీ ధనుర్బాణాలూ, కరవాలాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ఇవన్నీ వీరులయిన రాజ పురుష లాంచనాలు, కాని జటాజూటాలూ, నారచీరలూ ధరించి ముని బాలకులవలె వున్నారు మీరు. ఇది ఆశ్చర్యంగా వుంది. తమ రెవరు? ఏ పనిమీద యిటు వచ్చారు మన్నించండి. నేనెవరినో తమకు చెప్పలేదు. ఈ కిష్కింధకు తన తమ్ముడు మరియు రాజైన సుగ్రీవుని రాజ్యభ్రష్టుని చేసి, ఆయన భార్యను కూడా తన దగ్గరే ఉంచుకున్నాడు వాలి. నేను సుగ్రీవుని అనుచరుడను, హనుమంతుడు అంటారు" అన్నాడు హనుమ.

సంతోషంతో వికసించిన వదనంతో శ్రీరాముడు లక్ష్మణుని వైపు తిరిగి, "లక్ష్మణా! ఈ కవిప్రవరుని సంభాషణ ఎంత ఉదాత్తంగా వున్నదో చూశావా! వేదత్రయం అధ్యయనం చేసి, ఆరుశాస్త్రాలూ, కంఠపాఠం అయ్యి, నవ వ్యాకరణాలూ కరతలామలకం అయినవాడు కాని యిలా మాట్లాడలేడు. అంతే కాదు, మాట్లాడుతున్నప్పుడు తల విసరడం, కనుబొమలు ఎగరవేయడం, నుదురు బిగించడం వంటి వికారాలేమీ లేవు, చెప్పవలసిన విషయాన్ని ముక్తసరిగా మూడు ముక్కలలో చెప్పాడు, అంతమాత్రాన మనకు వినబడకుండా అక్షరాలు మింగేయలేదు, సాగతీక లేదు. గొంతు చించుకుని కఠోరంగా అరవలేదు. సంస్కార సంపన్నమైన మధ్యమస్థాయిలో హృదయాహ్లాదకరంగా మాట్లాడేడు. ఇంతటి ప్రతిభ కలిగిన సచివుడుంటే – ముల్లోకాలనూ జయించగలం. కనుక ఇతనితో నువ్వు సముచిత రీతిలో మాట్లాడు" అని అన్నాడు శ్రీరాముడు

తనంతవాడయిన లక్ష్మణునిడితో శ్రీరాముడు హెచ్చరికగా మాట్లాడడం ఇంతకు పూర్వం లేదు, అనంతరం అసలే లేదు.

తాను మాట్లాడిన మూడు మాటలలో శ్రీరామచంద్రుని అభినందనలను అరనిముషములో అందుకున్న అద్భుత ప్రతిభాశాలి హనుమంతుడు. జీవకోటిలో "మాట అనే వరం" లభించిన మానవుడు, ఎప్పుడు, ఎక్కడ, ఎలా మాట్లాడాలో ఆంజనేయుడి ద్వారా గ్రహించాలని వాల్మీకి భావం.

భూగోళంలోని వానర సంఘాలకు అధిపతి – వాలి – మహా బలిష్టుడు. చతుర్దశ భువనాలనూ విలవిలలాడించిన లంకేశ్వరుడైన, రావణుని వంటి మహావీరుని తన చంకలో ఇరికించి సప్త సముద్రాలలో ముంచి వదలిన వీరుడు వాలి. అంతటివాడు – రాముడు విడిచిన ఒకే ఒక్క బాణంతో నేలకూలినాడు. వాలి నేల కూలిన వార్త విని వినగానే హుటాహుటిన వచ్చింది వానరేశ్వరుని భార్య తార. వస్తూనే భర్త దగ్గర కూలబడి ఏడ్చింది, ఏవేవో అన్నది. అందరూ శిలాప్రతిమలవలె వింటున్నారు. ఆవిడ ఎదుట నిలిచి మాట్లాడే ధైర్యం లేదెవరికీ.

"మహారాణీ! జగదేక మల్లుడయిన వానరేశ్వరుని పట్టపురాణివి, నువ్వు శోకిస్తున్నావా! సర్వవానరయోధులతో కిష్కింధ నీ కనుసన్నలలో నడుస్తుంది, గుండె నిబ్బరం చేసుకుని నీ బిడ్డను సింహాసనం మీద కూర్చోబెట్టు, నీ బుద్ధిబలం వానరరాజ్యానికి పెట్టనికోట'' అని అన్నాడు హనుమంతుడు. ధీశక్తి సంపన్నురాలయిన తార ఆసమయంలోతన కుమారుడిని రాజు చేయదని తెలుసు. ధీశాలి అయిన హనుమ మాటకు దుఃఖాన్ని దిగమింగిన తార, తన కుమారుడిని కాదని సుగ్రీవుడిని రాజ్యాభిషక్తుడిని చేసింది. అదీ ఎప్పుడు ఎట్లా ఏమి మాట్లాడాలో తెలియటమంటే.

శ్రీరాముడికి ఇచ్చిన మాటప్రకారం సుగ్రీవుడు సీతాన్వేషణకై నాలుగు దిక్కుల వానరులను పంపి, దక్షిణ దిక్కుకు వెళ్ళేవారికి జాంబవంతుని నాయకుడిగా అంగదుడిని, హనుమంతుడిని కూడ

పంపగా, వారు బయలుదేరుతుండగా శ్రీరాముడు హనుమంతుడిని పిలిచి తన అంగుళీయకం యిచ్చి జానకీదేవికి గుర్తుగా చూపమన్నాడు.

వానరవీరులందరూ సముద్రతీరం చేరారు. అంతవరకూ ఉరకలు వేసిన వారి ఉత్సాహం శతయోజనాల విస్తీర్ణమైన సముద్రం చూడగానే చప్పబడిపోయింది తటస్థంగా ఉండిపోయారు కపివీరులందరూ, అంగదుడు అంతదూరం వెళ్ళగలనుగాని, తిరిగి వచ్చేశక్తి లేదన్నాడు, జాంబవంతుడు వృద్ధుడు, ఇంక హనుమ. మౌనంగా ఉన్న హనుమంతుడి శక్తిని అతనికి తెలియజేస్తూ కార్యోన్ముఖుడిని చేశాడు నాయకుడయిన జాంబవంతుడు, హనుమంతుడు బయలుదేరాడు. సముద్రం మీద సాగుతున్నాడు. దారిలో మైనాకుడు అతిథి సత్కారం చేస్తానంటే, కార్యార్థియై వెళ్ళేవానికి ఈ సన్మానాలు పనికిరావన్నాడు. నాగమాత సురస అడ్డుపడి మింగేస్తానంది. యుక్తితో ఆమె గర్భంలో ప్రవేశించి ఆవలకు వచ్చి ముందుకు సాగి, ఆవలి తీరం చేరుతుండగా ఛాయాగ్రాహి సింహక కబళించబోయింది. దాన్ని కడతేర్చి లంకానగరం పొలిమేరలో కొండమీద దిగాడు. అక్కడ లంకానగర అధిష్ఠాన దేవత లంకిణి ఎదురు కాగా దాన్ని నిర్జించి, సీతాన్వేషణ ఆరంభించాడు. రాజభవనాలు, అమాత్యమందిరాలు, సచివసౌధాలు, పరిజనగృహాలు అన్నీ మూల మూలలా వెదకి వెదకి కనిపించక విషాద హృదయుడై అశోకవనంలో అడుగుపెట్టాడు హనుమ. ఎక్కడా సీత కనిపించలేదు. ఇక ప్రాయోపవేశమే శరణ్యం అనుకున్నాడు హనుమ అందుకు కారణం, "సీతను చూడకుండా వస్తే వానరులందరికీ శిరచ్ఛేదమే శిక్ష" అది సుగ్రీవాజ్ఞ. అందువల్ల తను తిరిగి వెళ్ళి లంకలో జానకి కనబడలేదని చెప్పగానే వానర వీరులందరికీ మరణం తప్పదు, అంతకు ముందే శ్రీరాముడు ప్రాణం వదులుతాడు, వెనువెంట లక్ష్మణుడు, ఈ వార్త విని అయోధ్యలో వీరి ఆప్తులు అందరూ ప్రాణాలు వదులుతారు.

అంతకంటే తనే ప్రాణత్యాగం చేస్తే, యింకా హనుమంతుడు వస్తాడు, వస్తాడనుకుంటూ అందరూ జీవిస్తారు. అదీ హనుమంతుడి లోని లోక సంక్షేమదృష్టి. మరుక్షణం హనుమకు అశోకవనంలో సీత కనిపించింది. ప్రాణం లేచి వచ్చింది. అదే సమయంలో అక్కడకు రావణుడు రావటం, ఎన్నో దుర్భాషలాడి వెళ్ళడం, ఆ భాధపడలేక సీతాదేవి ప్రాణం వదలడానికి సిద్ధపడింది, అప్పుడు హనుమంతుడు తన బుద్ధిశక్తిని అంతా ఉపయోగించి, శ్రీరామచరితం గానంతో సీతామాతలో ధైర్యం కలిగించి, అసలు విషయం తెలియజేసి, గుర్తుగా శ్రీరామచంద్రుడు ఇచ్చిన అంగుళీయకం ఇచ్చి, సీతామాత ఇచ్చిన చూడామణి తీసుకొని, బంటు అయిన తన బలాన్ని అశోకవన ధ్వసం, రాక్షస సంహారము ద్వారా తెలియజేసి, తద్వారా రావణుడి కొలువుచేరి, తన దైవమైన శ్రీరాముడి శక్తిసామర్థ్యాలు ఎరుకపరచి, తన వానర శక్తిని తెలియజేస్తూ, లంకాదహనం చేసి,తిరిగి సముద్రం దాటి ఇవతలి తీరానికి వచ్చి, తన ఆప్తమిత్రుల మధ్య నిలబడి, సముద్ర లంఘనం, లంకాప్రవేశం, సీతాన్వేషణ, లంకా దహనం, రాక్షస సంహారగాథ అంతా సవిస్తరంగా వినిపించాడు, కాని శ్రీరామచంద్రమూర్తికి సీతాదేవి అందించిన సందేశం మాత్రం ప్రస్తావించలేదు.

కిష్కింధలోని శ్రీరాముడి సన్నిధికి చేరి లక్ష్మణ సుగ్రీవుల సన్నిధానంలో, సముద్ర లంఘన, ప్రయాణమధ్యములో లంకలో తను చేసిన పనులు మొత్తము మూడు మాటలలో ముగించి, సీతాసందేశాన్ని మాత్రం యథాతథంగా శ్రీరాముడికి వినిపించాడు. అదీ హనుమంతునిలోని సమయ, సందర్భ, ప్రదేశ, భాషణ స్ఫూర్తి. ఎక్కడ, ఎప్పుడు, ఎంత, ఏది, ఎలా మాట్లాడాలి అనేది కిష్కింధ, సుందర, యుద్ధ కాండలు మూడూ పూర్తిగా చదివితే ఆంజనేయస్వామి ద్వారా మనకు బోధ పడుతుంది. అందుకనే మన పెద్దలు నిత్యమూ సుందరకాండ పారాయణ, లేక శ్రవణం చేయమని చెప్పటంలోని అంతర్యం.

భక్తుడు (బంటు) అనేవాడు ఎలా ఉండాలి, తన ఆచరణ ద్వారా ఉన్నస్థితి నుండి ఉన్నతస్థితికి ఎట్లా ఎదగాలో శ్రీరామభక్తుడైన హనుమంతుడి చర్యల ద్వారా తెలుసుకొని మసలుకోమనే, శిరిడీలో రోజు విడిచి రోజు జరిగే చావడిఉత్సవములో శ్రీ శిరిడీసాయిబాబా హనుమాన్ మందిరము వైపు తిరిగి చేసే భంగిమలలోని భావమేమో. మేము సాయి భక్తులము అని అంటుంటాము. భక్తుడు అంటే ఆంజనేయస్వామి. మోక్షప్రదాత అయిన శ్రీరామచంద్రుని దర్శనం కాలేదని మనము చింతించవలదు. శ్రీరామనామం ఉచ్చరిస్తూ హనుమాన్ చెంత చేరితేచాలు, తన హృదయ నివాసి అయిన శ్రీరాముడిని మనకు దర్శింపచేస్తాడు రామభక్త హనుమాన్. నాలికపై సాయినామం ఉచ్చరిస్తూ, సాయి భక్తులమని భావిస్తూ, మనలో, మనచుట్టూ అనేక రూపాలలో ఉన్న సాయిని గుర్తించలేక వెదుకులాడే వారలము, శ్రీసాయిరాముడిని ఇతరులకు ఎట్లా చూపించగలము.


సకల వేదాల సారమైన 'రామ' అనే నామం ఉచ్చరిస్తే సకల పాపాలు తొలగిపోతాయి. "సాయి అన్న నామాన్ని ఉచ్చరించి నంతమాత్రాన సప్త సముద్రాల అవతల ఉన్నా, నేను నిన్ను కాపాడుతాను" అన్నారు బాబా. సప్తసముద్రాల అవతల భగవంతుడి సింహాసనము ఉంది, అది మానవ హృదయంలో ఉంది, అంటే సాయి రాముడు మన హృదయ నివాసియై ఉన్నాడు. అది మరచి జీవించిననాడు, ఎన్ని లక్షలసార్లు సాయినామం ఉచ్చరించినా, బాబా అనుగ్రహానికి పాత్రులు కాలేరు. అది గ్రహించి జీవించమనే శ్రీసాయిరాముని బోధ. అప్పుడు నిరంతరము మనలో, మనతో ఉండి, చివరికంటా ఉండి గమ్యం చేరుస్తాడు శ్రీసాయి. అది గుర్తించి జీవించటమే సాయి భక్తులమనుకునే మన ప్రథమ, ప్రధాన కర్తవ్యం. అప్పుడే మనం 'హనుమ'లా నిజమైన భక్తులమవుతాము. ఆదిశగా జీవనం కొనసాగించే శక్తిని బుద్ధిని ప్రసాదించమని శ్రీరామభక్త హనుమాన్‌ను వేడుకొంటూ, "హనుమజ్జయంతి"ని జరుపుకుందాము.

పౌరాణిక సార్వభౌమ బ్రహ్మశ్రీ మల్లాది చన్ద్రశేఖరశాస్త్రి గారి "సుందరకాండ ప్రవచనము" మరియు 'శ్రీ పురాణ పండ' వారి 'రామాయణ' ప్రవచనముల ఆధారముతో సమర్పణ

(మే 25వ తేదీ బుధవారము హనుమజ్జయంతి సందర్భముగా ప్రత్యేక వ్యాసము)

సేకరణ, సంకలనం : **"సత్యాన్వేషి"**

# జిజ్ఞాస



**ప్రశ్న : ఉత్తమ జపము ఏది?**

**భగవాన్ :** జపము వాచికము. దాని స్మృతి, ఆపైన ధ్యానము ఈ క్రమంలో సాగి, అజవర అప్రయత్నమగు నిరంతర జపము, జపకర్త, "ఆత్మయే". జపములన్నింటిలో "నే నెవరన్న" జపమే అత్యుత్తమం.

**ప్రశ్న : జ్ఞాని అయినవాడు, తానేగిన మార్గానుసారమేకాక ఇతర మార్గానువర్తునులకును సహాయం చేయగలడా?**

**భగవాన్ :** ఆహా.. తప్పకుండా.. ఏ మార్గంలో ఉన్నవారికైనా సహాయం చేయగలదు. ఎట్లాగంటే, ఒక కొండ వున్నదనుకో, అది ఎక్కేందుకు ఎన్నోమార్గాలు, తానెక్కినదోవనే రమ్మంటే ఒకరికి నచ్చవచ్చు. ఇంకొకరికి నచ్చకపోవచ్చు. నచ్చనివారిని అటే రమ్మంటే రాలేరు. అందువల్ల ఏ దోవ ననుసరించిన వారికి ఆ దోవనే పైకి వచ్చేందుకు సహాయం చేస్తారు. మార్గమధ్యంలో ఉన్నవారికి, ఇంకొక దారిలోని మంచి చెడ్డలు తెలియవు గాని, శిఖరమెక్కి కూర్చున్నవారికి, అన్నిదోవలూ కనిపిస్తూనే వుంటాయి. ఇట్లా తప్పుకోబాబు, అట్లా రా నాయనా, అని చెప్పి చూపగలరు. అందరికీ గమ్యస్థానం ఒక్కటేగదా.

**ప్రశ్న : "నేనెవరిని" విచారించేందుకు ముందు కర్మ సన్యాసం చేయాలా?**

**భగవాన్ :** సన్యాసమంటే ఏమని మీ అభిప్రాయం? కూర్చోవడం, లేవడం, తిరగడం అన్నీ కర్మలేగదా? ఇందులో దేన్ని విడుస్తారు? అందుకే నేను కర్తననే అహంభావం విడువుమన్నారు పెద్దలు.

**ప్రశ్న : నేను స్వప్రయత్నంతో మనస్సును ఏకాగ్రతపరచినా శాంతిని పొందలేకపోతున్నాను. ఈ ప్రయత్నంలో విజయం పొందటానికి మరొక శక్తి యొక్క సహాయానికి అన్వేషిస్తున్నాను. ఆ అనుగ్రహం నాకు ఉంటుందా భగవాన్?**

**భగవాన్ :** మంచిదే అనుగ్రహం అంటే ఏమిటి? వ్యక్తిగతంగా మనస్సు బలహీనంగా ఉండటం వల్ల అనుగ్రహాన్ని అర్థించాల్సి వచ్చింది. ఋషులు, పుణ్యాత్ముల సేవ ఈ అనుగ్రహాన్ని పొందడానికి కదా... శక్తివంతులైన ఋషుల సన్నిధిలో, దుర్బరులయిన మనస్సు గల వారు శక్తిమంతులు అవుతారు. దీనినే "అనుగ్రహం" అని పిలుస్తారు. ఇదియే అనుగ్రహ ప్రయోజనం. ఈ అనుగ్రహం బాహ్యమైనది కాదు. బాహ్యమైనది అయితే అది నిరూపయోగమే. అనుగ్రహం ఎప్పుడు అంతర్గతమైనది. ఈ అనుగ్రహమే "ఆత్మ" ఈ అనుగ్రహ ప్రభావం వల్లనే నీవు భగవంతుని స్మరించగలుగుతున్నావు.... అన్వేషించగలుగుతున్నావు.

**ప్రశ్న : అనుగ్రహం కేవలం గురువువల్ల మాత్రమే లభించేది కదా భగవాన్?**

**భగవాన్ :** ఈశ్వరుడు, గురువు, అనుగ్రహము అనేవి... కేవలం పర్యాయపదాలు మాత్రమే. గురువు తాను ఆత్మ కంటే భిన్నంగా ఉన్నానని తలిస్తే... అతడు గురువుగా ఉండడానికి అనర్హుడు.

గ్రంథాలు దీక్షలు అనేక విధాలుగా పేర్కొన్నాయి. హస్త దీక్ష, మనోదీక్ష, వీక్షణదీక్ష, గురువు, అగ్ని, నీరు, జప, మంత్రము ల ద్వారా శిష్యులకు గురువు దీక్ష ఇస్తారు. అప్పుడు శిష్యుడు పక్వత చెందుతాడు. గురువు దక్షిణామూర్తి ఏం చేశారు. మౌనం ద్వారానే శిష్యుల సందేహాలను తీర్చివేశారు కదా. అప్పుడు శిష్యులు వారి వ్యక్తిత్వాన్ని కోల్పోయారు. అదే "జ్ఞానం". మిగిలినవన్నీ శుష్కము, నిస్సారము అయినా వ్యర్థ ప్రలాపాలు మాత్రమే.

మౌనం కంటే శక్తివంతమైనది మరొకటి లేదు. శాస్త్రాలు ఎంతటి గొప్పవి అయినా "మౌనానికి" సాటిరావు. గురువు నిశ్చలుడై శాంతిని, శక్తిని నిరంతరమూ ప్రవహింపచేస్తూ ఉంటాడు. సమస్త శాస్త్రాలను ఒకచోట గుట్టగా చేర్చినా, గురువు అనుగ్రహం ముందు నిలవలేవు. మేము ఎంతో కాలం నుండి గురు సన్నిధిలో ఉన్నాము. శ్రవణం చేశాము, జటిల సాధనాలతో అలసిపోయాము. అయినా మేమేమీ అభివృద్ధిని పొందలేదు అని కొందరు తరచూ ఫిర్యాదు చేస్తూ ఉంటారు. కలవర పడతారు కూడా. అభివృద్ధి అనేది నీ లోపల జరుగుతుంది. అది బాహ్యమైనది కాదు. అంతర్గతమైనది. సూక్ష్మమైనది. నిరంతరమైన సాధన వల్ల ఈ అంతర్గతమైన అభివృద్ధి తప్పకుండా జరుగుతుంది ఇది నిశ్చయము.

**ప్రశ్న : పతంజలి యోగ సూత్రాల ద్వారా సిద్ధులు సంపాదించటం మంచిదేనా?**

**భగవాన్ :** ఆత్మ దర్శనం ముందు, ఈ సిద్దులన్నీ ఉత్తచప్పన, వట్టి నీడలు. పతంజలే చెప్పారు. ఇవన్నీ మనస్సుయొక్క అభ్యాస పాటవం మీద ఆధారపడి వుంటాయి.

**ప్రశ్న : గాయత్రి జపం ఉపయోగపడుతుందా?**

**భగవాన్ :** గాయత్రి అంటే ఏమిటి? ఈ సకలాన్ని ప్రకాశింప చేస్తున్నదో, దానిపై నాదృష్టి నిలుచుగాక అని ధ్యానం చేయటమే కదా. ధ్యానం అంటే, నిజమైన అర్థము ఒక విషయముపై దృష్టిని నిశ్చలంగా నిలపడం. నిజానికి ధ్యానమే మన స్వరూపం. ఇతర తలంపులన్నింటిని మనం త్రోసివేస్తే, "నేను నేను" అంటూ ఆత్మ భాసించటం కనుకొనగలం. దీనిని మీరు, ఏ పేరుతోనన్నా పిలవండి.

(ఏప్రిల్ 14వ తేదీ భగవాన్ శ్రీరమణమహర్షి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **శ్రీరమణ సంభాషణలు**

# శ్రీ గురు సిద్ధారూఢస్వామి

కర్ణాటక రాష్ట్రములోని హుబ్లీలో కొలువై లక్షలాది మందిని జ్ఞానమార్గంలో నడిపించి, శిరిడీ సాయికి సమకాలీకులైన శ్రీ గురుసిద్ధారూఢస్వామి హుబ్లీలో సమాధిగ్రస్తులైనారు. ఒకసారి సిద్ధారూఢస్వామి శిష్యులు ఒకరు శ్రీసాయి సన్నిధికి రాగా "నీవు ఒక పెద్ద మహాత్ముని కొలువుకు చెందినవాడివని" ప్రశంసించారు. ప్రేమ, త్యాగం, క్షమా, దయా గుణాలకు మారుపేరైన శ్రీ స్వామి చరిత్ర పరిశీలించి చూస్తే "ఆధ్యాత్మిక విద్య పదునైన కత్తి మీద నడకలాంటిది" అన్న సాయి సూక్తి గుర్తుకు రాకమానదు. సామాన్య స్థితినుంచి అన్నిటిని అధిగమించి మహోన్నత స్థితికిచేరిన స్వామి జయంతి ఏప్రిల్ 10వ తేదీ మరియు ఆరాధనోత్సవం మే 10వ తేదీ సందర్భముగా స్వామి వారు తనపాద స్పర్శతో పావనం చేసిన ఆంధ్రదేశ పర్యటనా విశేషాలను మీకందిస్తున్నాము.



శ్రీ గురు సిద్ధారూఢ స్వామి విశాఖజిల్లాలోని సింహాచలానికి వచ్చి అక్కడ దేవాలయములో శ్రీ నరసింహస్వామివారి మూర్తికి గంధలేపనం చేయడం చూచి, "భగవంతుడు సద్వాసనలతో కూడిన భావానికి దొరికేవాడే గానీ, చావు పుట్టుకలే నేను అనే దుర్వాసనా భావానికి గోచరింపడు అనే భావాన్ని ఈ లేపనం సూచిస్తున్నది" అని తెలిపి అక్కడ నుండి బయలుదేరి, విజయనగరానికి వచ్చారు. అక్కడ కొందరు బైరాగులు వంట చేసుకొని భుజిస్తూ, అక్కడేవున్న స్వామిని కూడ పిలిచారు. భోజనం చేస్తూ, వారికి మనము తిన్న అన్నము దేహంలో కలిగే మార్పుల గురించి వివరించి అన్నం పరబ్రహ్మం అన్న విషయాన్ని తెలియజేశారు.

అక్కడనుండి ఆ సిద్ధారూఢులు భద్రాచలానికి వచ్చారు. అక్కడ రామదాసు పునరుద్ధరించిన శ్రీరామచంద్రుల దేవాలయం చూసి, అక్కడ నుండి సజ్జనగడ్‌కు వచ్చి అక్కడ సమర్ధ రామదాస స్వామి స్థాపించిన శ్రీరామమూర్తినీ, రామదాసు సమాధినీ దర్శించారు. అక్కడినుండి విజయవాడ వైపుకు సాగి, దారిలోని క్షేత్రాలన్నీ దర్శిస్తూ కృష్ణాతీరానికి వచ్చారు. అక్కడ విశ్రాంతి కోసం ఒక చెట్టు నీడలో కూర్చుని వుండగా ఒక స్త్రీ అక్కడకు వచ్చి ముక్తి మార్గముపదేశించమని ప్రార్థించింది. దానికి సిద్ధులు స్త్రీలకు జ్ఞానమార్గము యోగ్యముకాదని, సోమవార వ్రతమాచరింపవలసినదనీ బోధించి, ఆ వ్రత మహిమ వివరించారు. (శ్రీ గురుడు కూడ ఒక స్త్రీకి సోమవార వ్రత విశిష్టత తెలియజేయటం శ్రీగురుచరిత్రలోని 35వ అధ్యాయములో చూడవచ్చు.)

అక్కడినుండి సిద్ధులు మంగళగిరికి వచ్చారు. అచటి దేవాలయంలోకి ప్రవేశించి, పూజారిని ప్రసాదం పెట్టమని అడిగారు. అర్చకుడు సిద్ధులకు పానకమిచ్చాడు. అది త్రాగి సిద్ధులు మంగళగిరి కొండమీద నుండి దిగివస్తూ, దారిలో ఒక గుహలో ఒక బ్రాహ్మణుడు క్షుద్రవిద్యలకై సాధన చేస్తుండటం చూచి, వాటిని విడువమని చెప్పి, అతనికి నాలుగు వర్ణాశ్రమ ధర్మాలను బోధించి, ఆశీర్వదించి పంపేరు.

అక్కడ నుండి స్వామి ఆదోని వచ్చారు. అక్కడ బాబా ఖాళీ గుహవద్ద కొందరు సాధువులతో కొన్ని రోజులు గడిపేరు. వారికి భ్రాంతి నశించడానికి సాధనాలైన భూత పంచీకరణమును తెల్పి, పిదప ఆత్మను వివరించి, అనుభవానికి వచ్చేటట్లు చేశారు. వారిని రోజూచూస్తూ, వారి బోధలు వింటూన్న ఒక కుష్టురోగి సిద్ధులు మహాత్ములని తెలుసుకొని వారి పాదాలమీదపడి, తన వ్యాధిని పరిహరింపవలసిందిగా ప్రార్థించాడు. సిద్ధులు కరుణతో వానికి తమ పాద తీర్థంతో స్నానము చేయించి, పంచాక్షరీ మంత్రము ఉపదేశించారు. తక్షణమే అతని వ్యాధినయమై, ఆరోగ్యమైన శరీరమొచ్చింది. ఈ మహిమ విన్న ఊరి జనులంతా వచ్చి స్వామి దర్శనం చేసుకొన్నారు. వారికి ఆశీర్వాదమిచ్చి అక్కడనుండి బయలుదేరి వెళ్లిపోయారు శ్రీ గురుసిద్ధారూఢులు.

భక్తుల పాలిట శివస్వరూపమై వెలుగొందిన శ్రీ స్వామి సమాధి హుబ్లీలో కలదు. భక్తులు సమాధిని దర్శించి, స్పర్శించి పునీతులు కావచ్చును. శ్రీ వైశాఖ శుద్ధ నవమి మంగళవారం (తిథి ప్రకారం మే 10వ తేదీ) శ్రీ స్వామి వారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ.

సేకరణ : **శ్రీమతి ఆర్. సాయి సృజన,** బెంగుళూరు



# పూర్ణ అంతరంగాలు

సత్ సంగమము – ఒక మంచి కలయిక, సత్ అనగా శుద్ధమయినది, నిర్వికారము, నిరంజనము అని కూడ ఒక అర్థముకలదు. సత్ సంగమము అనగా ఏదయితే సత్యమయ్యి, నిత్యమయ్యి ఈ సృష్టి అంతటా వెలుగొందుతున్నదో దానిని గుర్తించి జీవించటము. సత్ అనగా పరబ్రహ్మము – దానిలో ఐక్యమవ్వటమే సంగమము.

"సత్సంగత్వే, నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం, నిర్మోహత్వే నిశ్చలతత్వం, నిశ్చలతత్వే జీవన్ముక్తి" అని ఆది శంకరాచార్యులచే విరచితమైన "భజగోవిందం" లోని తొమ్మిదో శ్లోకం. సత్పురుషుల సాంగత్యం వలన ఈ ప్రాపంచిక విషయాల పట్ల అసంగభావము ఏర్పడి, తద్వారా మనలో ఉన్న భ్రమ, మోహం తొలగిపోతుంది. మోహం తొలగిన మనస్సు భగవంతునిపై నిశ్చలంగా నిలుస్తుంది. అట్లా నిశ్చలత్వం పొందటం ద్వారా కర్మబంధాల నుంచి ముక్తి లభిస్తుంది అని" జగద్గురు శ్రీ శంకరాచార్యుల బోధ.

"శ్రీసాయి సంప్రదాయంలో సత్సంగ విధానానికి ఒక మహత్తరమైన శక్తి ఉందని" ఆచార్య శ్రీ భరద్వాజగారు తెలియజేసేవారు. మాష్టారుగారు ఆంధ్రరాష్ట్రంలో సత్సంగాలు నిర్వహించిన చోటల్లా సాయి మందిరాలు రూపుదిద్దుకున్నాయి. తన చివరి శ్వాసవరకూ సత్సంగాలు నిర్వహించారు. రాగ, ద్వేష, అసూయ, ప్రేమ, ప్రీతి, గౌరవం ఇలా అనేక భావాలు, మనః ప్రవృత్తులు కల వ్యక్తులందరితో కలిసి చేసే సాధనకు వేదికే సత్సంగమము. ఇది ఒక వర్క్‌షాపు లాంటిది. మనలోగల బలహీనతలను తెలుసుకుంటూ, సరిచేసుకోవటానికి అద్దం వంటిది సత్సంగం. సత్సంగానికి అధిపతియైన శ్రీసాయినాధుని దివ్య సన్నిధి ప్రభావం వలన మనలో అన్యభావాలు తలెత్తకుండా, మనలోని శక్తిని వివేకించుకొనే అద్భుతవేదిక సత్సంగ నిలయం.

"మనకు ఆకలి లేదు ఎదురుగా స్వీటు ఉంది, "తింటే బాగుంటుంది" అని జిహ్వాచాపల్యం వలన అనిపిస్తుంది. అదే జిహ్వాచాలవ్యం లేకుంటే ''ఇప్పుడు ఎందుకు తినటం ఆకలివేసినప్పుడు తిందాము'' అని అనుకోవటం 'రుచి'ని జయించటము, ఇది తినే వస్తువులమీద ఉండే భావం, అదే విధముగా అవతల వ్యక్తులమీద మనకు కలిగే భావాలను, ఇక్కడకు వచ్చినవారిపై ఇప్పుడు మనం ఏర్పరచుకోవటం ఎందుకు, సాయి సన్నిధిని అనుభవిద్దాము అనుకుంటూ మనలో అనవసరంగా అన్యులపై ఏర్పడే భావాలను తొలగించుకుంటూ, శ్రీసాయిని ఆలంబనగా తీసుకుని, వాటిని నిర్మూలించుకోవచ్చు కూడ, ఇది మన హృదయ పరిశుద్ధతకు దారితీస్తుంది. "పరిశుద్ధమయిన హృదయంలో, శ్రద్ధ, ఓరిమిలు నిలదొక్కుకుంటాయి" అని అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. "ఒకతనిపై గల వైరభావముతో అతనిచ్చే ప్రసాదాన్ని తీసుకోవటానికి ఒకభక్తుడు నిరాకరించినప్పుడు, ఇస్తున్న వ్యక్తిపై భావనతో ప్రసాదం నిరాకరించటము వలన, భగవంతుడి అనుగ్రహాన్ని తిరస్కరించిన వాడివై, కర్మవలయాలలో చిక్కుబడి పోతున్నావు" అని భక్తుడికి

శ్రీసాయి చేసిన హెచ్చరిక ఇక్కడ గమనార్హం.

జీవన్ముక్తిని ప్రసాదించే సత్సంగానికి అంతటి మహోన్నత ప్రభావం ఉంది కనుకనే, అది గుర్తించిన మహనీయులు, మహాత్ములందరూ తాము సత్సంగాలు నెరపటమే కాకుండా, తమ శిష్యులను కూడ ప్రోత్సహించేవారు.

అంతేగాక, రెండవ దత్తావతారమైన శ్రీగురుడిగా ప్రసిద్ధికెక్కిన శ్రీ నృసింహసరస్వతీస్వామి, "నలుగురు ఒక్కచోట చేరి, నా చరిత్ర పారాయణ చేసేవారు. నాగురించి చింతన చేసేవారు, నామస్మరణ చేసేవారు, నా లీలలుగానం చేసేవారు ఇహపరాల గురించి ఆలోచించాల్సిన అవసరంలేదు, వారి కర్మ నశిస్తుంది, వారే నేనుగా మారిపోతారు" అని వాగ్దానం చేశారు.

"ఎవరైతే ఎప్పుడూ నన్నే చూస్తూ, నాగురించే వింటూ, ఎప్పుడు సాయి, సాయి అని స్మరిస్తూ, నాయందు మనస్సు నిలుపుతారో వారు నిశ్చయంగా దైవాన్ని చేరుతారు, వారు ఇహపరాల గురించి భయపడనవసరము లేదు" అని శ్రీసాయి అభయమిచ్చారు. సత్సంగానికి అంతటి అద్భుతమైన శక్తి ఉంది కనుకనే, "మీరు ఎక్కడ ఉంటే అక్కడ సత్సంగం చేయండి, అదే నాకు అక్షరలక్షలు ఇచ్చినట్లు" అంటారు 'సత్సంగ సోమయాజిగా' కీర్తించబడిన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు.

సత్సంగ మహిమ ఎంతటిదో, దానివలన చాలా సంవత్సరాలక్రితం మేము పొందిన అనుభూతి, అనుభవాన్ని ఒకటి మీతో పంచుకుంటాను. సత్సంగాలలో నిరంతరం శ్రీసాయి లీలామృతం, శ్రీగురుచరిత్రలు పారాయణ ద్వారా, ఆ యా క్షేత్రముల, పుణ్య తీర్థములపట్ల ఆసక్తి కలిగి, సత్సంగ సభ్యులందరిలో, ఆ యా క్షేత్రములను ప్రత్యక్షంగా దర్శించాలనే తపన తీవ్రమవ్వటంతో శ్రీసాయిమాస్టర్ కృపానుగ్రహముతో అది కార్యరూపం దాల్చి, ప్రతి సంవత్సరము వేసవి శెలవులలో, పిల్లలతో కలిసి సకుటుంబ సపరివారముగా, ఒక్కోసారి కొన్ని పుణ్యక్షేత్రాలు, తీర్థక్షేత్రాలతో పాటు, శ్రీ దత్తావతారులు నడయాడిన ప్రదేశాలు దర్శనం చేసుకునే వారలము. దాదాపు 90 శాతం దేశంలోని దత్తక్షేత్రాలు, యాత్రాస్థలాలతోపాటు, కాశ్మీరు, నేపాల్ మొదలైన వాటిని కూడ చూడటమైనది. మా సత్సంగ సభ్యులకొరకు శ్రీ శిరిడీయాత్రా స్పెషల్ (ఒంగోలు) ఆర్గనైజర్ శ్రీ కోసూరి శ్రీనివాసరావు ప్రత్యేకంగా యాత్రలు నిర్వహించేవాడు. అయితే ఏ యాత్ర చేసినా, వాటిలో ఒకటి రెండు దత్తక్షేత్రాలు ఉండేటట్లు, యాత్రమార్గం ఏర్పాటుచేసుకుని వెళ్ళేవారలము. అదే విధముగా ఒక సంవత్సరము దత్తక్షేత్రాల యాత్రలో భాగముగా నర్సోబావాడి దర్శించుకొని, అక్కడి నుండి దివ్య క్షేత్రమైన పండరిపురంలోని పాండురంగడి దర్శనార్థమై రెండు బస్సులలో బయలుదేరేము. సాయంత్రంలోపల ఎంత తొందరగా, పండరీపురము చేరుదామన్నా, మార్గమధ్యములోని రోడ్లు, తదితర పరిస్థితుల వలన పండరీపురం చేరేసరికి రాత్రి 9 గంటలు కావచ్చింది, చంద్రబాగా నదిఒడ్డునగల వసతిగృహం వద్ద బస్సు ఆపి, 9 గంటలవరకు ఆలయం తెరచిఉంటుంది, త్వర త్వరగా వెళ్ళి దర్శనం చేసుకుని తిరిగి రండి, ఈలోపల అల్పాహారం సిద్ధంచేస్తానన్న ఆర్గనైజర్ మాటలతో అందరము త్వర త్వరగా బస్సు దిగి, అంతకు ముందు అనేకసార్లు పండరిపురం వచ్చిఉన్న కారణంగా పిన్న, పెద్ద, పిల్లలు, స్త్రీలతో కలసి ఉరుకులు, పరుగులతో మందిరానికి బయలుదేరేము, ప్రయాణంలో అలసిన పెద్దవారు, అంతకుముందు చూశాములే అని అనుకున్న వారు, అంతదూరం ఇప్పుడేమి పరుగులెత్తుతాము అనుకున్నవారు వసతిగృహంలో ఉండిపోయారు. దాదాపు 45 మందిమి ఒకటిన్నర కిలోమీటర్ల దూరములోని మందిరం వద్దకు వీలయినంత త్వరితగతిని చేరుకున్నాము. క్యూ కాంప్లెక్సు దగ్గరకు చేరేసరికి అది మూసివేయబడి ఉండి, అక్కడ దుకాణదారులను అడిగితే ఎదురుగా ఉన్న ద్వారం నుంచి నేరుగా దర్శనానికి వెళ్ళిపోవటమే, చెప్పులు ఇక్కడ పెట్టి వెళ్ళండి, అనగా అందరిని ఒకచోట చెప్పులు విడిచిరమ్మని త్వరత్వరగా పాండురంగడి మందిర ప్రాంగణములోనికి అడుగు పెట్టేము. లోపల క్యూలైన్లు ఉన్నాయి వాటిలో 2, 3 లైన్లు దర్శనార్థులతో నిండిఉన్నాయి. వారు నెమ్మదిగా కదులుతూ దర్శనానికి వెళుతున్నారు. హమ్మయ్య! క్యూలైను చాలా తక్కువ ఉంది మనము త్వరగా దర్శనం చేసుకోవచ్చు అంటూ అక్కడికి వెళ్ళేము. కాని లైనులోనికి ప్రవేశించే మార్గములోని గేటు తాళంవేసి ఉంది, అక్కడ ఉన్న భద్రతా సిబ్బందిని అడిగేము దర్శనానికి ఎటువెళ్ళాలి అని, ఆయన చెప్పిన సమాధానం విని అందరమూ నిరుత్సాహ పడిపోయినాము. "మందిరము రాత్రి 9 గంటల వరకు భక్తుల దర్శనం కొరకు తెరచి ఉంటుంది, కాని క్యూలైన్లు రాత్రి 8.30 ని॥లకే మూసివేస్తాము, అప్పటివరకు క్యూలైన్‌లో ఉన్నవారిని దర్శనానికి అనుమతిచ్చి, తరువాత పూర్తిగా మూసివేస్తాము" అన్నాడు. మేము చాలాదూరం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నుంచి వచ్చాము అక్కడి ఆలైనులో ఉన్నవారితో కలసి దర్శనం చేసుకుంటాము అని అడిగేము. ఇప్పుడు రాత్రి 9.15 ని॥లు అయింది కనుక గేటు తెరవటానికి కూడ ఎట్టి పరిస్థితులలో వీలవదు, తిరిగి రేపు ఉదయం 5 గంటలకే, అది కూడ ప్రధాన క్యూలైన్ ద్వారా (ఆ క్యూలైన్‌లో దాదాపు కిలోమీటరు నడవాలి వేరే మార్గము ద్వారా లోనికి వస్తారు. ముఖ ద్వార ప్రవేశముండదు) అన్నాడు అక్కడి భద్రతా సిబ్బంది. కొంచెంసేపు అక్కడే నిలబడిపోయాము. ఇంతకుముందు పండరిపురం ఎప్పుడు వచ్చినా పాండురంగడి దర్శనం చేసుకొని, పద్మవ్యూహం కూడ చూసుకుని వెళ్ళేవాళ్ళము, ఈసారి పాండురంగడి దర్శనమే కాలేదు. రాత్రికి ఉండిపోయి, ఉదయం దర్శనం చేసుకొని ప్రయాణం కొనసాగిద్దాము అంటే, ఉదయం దర్శించాల్సిన దత్తక్షేత్రము తప్పిపోతుంది, ఇక్కడ ఉండిపోవటము వలన ప్రయాణము ఆలస్యం అయ్యి, మిగిలిన క్షేత్రాలలో కూడ దర్శనం సకాలంలో అవుతుందో లేదో కూడ చెప్పలేము, కనుక ఒక దర్శనం తప్పిపోయినా మిగిలిన యాత్ర సక్రమంగా కొనసాగాలంటే ఈ రాత్రికి ప్రయాణం తప్పదు,

కనుక ప్రత్యేక దర్శనం ఏదయినా ఉంటే డబ్బులు చెల్లించి అయినా ఇప్పుడే దర్శనం చేసుకోవటం ఉత్తమమని, అందుకు అందరము సంసిద్ధమై, సెక్యూరిటీతో మాట్లాడి రమ్మని హిందీ బాగా మాట్లాడటం తెలిసిన ఒకతనిని పంపించాము. మీరు ఎంత ఇస్తానన్నా ఇప్పుడు అవకాశంలేదు, అయితే మనిషికి ఒక వెయ్యి రూపాయలు కనుక ఇస్తే తెల్లవారుజామున 4 గంటల తరువాత మిమ్ములను ముందుగా లైనులోనికి పంపి, మిగిలిన వారికి ప్రవేశం కల్పిస్తాము మీరు గంటలోపల దర్శనం చేసుకుని వెళ్ళవచ్చు లేదంటే ఇప్పుడు వెళ్ళిపోయి ఉదయం దర్శనం లైన్‌లో రండి అప్పుడు భక్తులతోపాటు మీ అదృష్టం బట్టి 7.30 నుండి 8 గంటల లోపల దర్శనం కావచ్చు అన్నాడు అతను. ఇప్పుడు దర్శనానికి అంత ఖర్చుపెట్టి వెళ్ళలేము, ఉదయం వెళ్ళటం సాధ్యం కాదు, అనుకుంటూ ఇక దర్శనం మీద ఆశ వదలివేసుకుని, ఎటూ ఇంతదూరం ఉరుకులు, పరుగులతో వచ్చాము కనుక, ఇక్కడే కొంతసేపు కూర్చొని వెళదాము, వంటవాళ్ళు అల్పాహారము తయారుచేయటానికి ఒక గంట పైన సమయం పడుతుంది కనుక నెమ్మదిగా వెళదాము అనుకుంటూ అందరమూ చెక్కలతో నిర్మించిన ఆ సౌధంలో కూర్చొని, దాని నిర్మాణ కౌశల్యాన్ని తిలకిస్తూ, ఆనందించాము. ఎప్పుడు వచ్చినా క్యూలైను ద్వారా మందిరంలోకి వెళ్ళి దర్శనం చేసుకొని, రుక్మిణి అమ్మవారిని దర్శనం చేసుకొని మందిరం వెనుక నుంచి, బయటకు వచ్చి వెళ్ళి పోవడమే గాని, ఈ ముఖమండపం లోనికి నేరుగా రాలేదు. ఈ రకంగా స్వామి ముఖమండపం దర్శనమై స్వామివారికి ఎదురుగానైనా కూర్చోగలిగేము అనుకుంటూ, "ఖాళీగా కూర్చోవటమెందుకు కొంతసేపు సత్సంగము నిర్వహించుకుందాము" అన్నాను అందరూ అంగీకరించారు. భక్త పరాధీనుడు, భక్తసులభుడు, భక్త జనవల్లభుడు, భక్తప్రియుడు, భక్తజనబాంధుడు అయిన పండరీనాథుని సన్నిధిలో పాండురంగడి భక్తుడై, సాయినాథుని సన్నిధిలో తన జీవితాన్ని సార్ధకత చెందించుకున్న దాసగణుగా వినుతికెక్కిన శ్రీ గణపతిరావ్ దత్తాత్రేయ సహస్రబుద్దే గురించి తెలియజేయటం ప్రారంభించాను, ఎందుకంటే ఆంగ్లేయుల పాలనలో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ, విరామ సమయాలలో ఒక ప్రక్క పండరీనాథుడిపై కీర్తనలు, చేస్తూ, హరికథలు చెబుతూనే మరొక ప్రక్క ప్రజల మన్ననలు, తప్పట్లకోసం ద్వంద్వార్థాల సంభాషణలతో కూడిన తమషాలనే నాటకాలలో నటిస్తూ, పూర్తిగా దేనిపైన మనస్సు నిలపని దాసగణు, తన అధికారి అయిన నానాసాహెబ్‌కు అంగరక్షకుడిగా శిరిడీ వచ్చింది భక్తితో కాదు, లౌకికమైన ప్రయోజనాలు ఆశించే, అయితే సర్వవ్యాపకుడైన శ్రీసాయి అతనిని అనేక సందర్భాలలో కాపాడుతూ రాగా, తన ఇష్టదైవమైన పాండురంగడి దర్శనమివ్వమని అడిగిన దాసగణుతో, అడగటం కాదు అర్హత సంపాదించమని బాబాచెప్పగా, తగురీతిన అతను తన జీవన, జీవిత సరళిని మార్చుకుని, శ్రీసాయికి అంకితభక్తుడై, అంతకుముందు తాను చెప్పే హరికథలతోపాటు శ్రీసాయి గురించి వాడవాడలా ప్రచారం చేస్తూ, వేలాదిమంది శ్రీసాయిని దర్శించుకొని, తమ లౌకిక పారలౌకిక కోరికలు తీర్చుకోవటానికి కారణభూతుడై తన జీవితమే కాకుండా, ఇతరులు తమ జీవితాన్ని ధన్యత చెందించుకునే మార్గాన్ని తెలియజేస్తూ, అడిగే స్థితి నుండి అర్హత పొందే స్థితికి ఎదిగిన గణపతిరావ్ దత్తాత్రేయ సహస్రబుద్దే శ్రీసాయిచే దాసగణుగా పిలువబడి, చివరకు శ్రీసాయి మహాసమాధి అనంతరం శ్రీ శిరిడీసాయి సంస్థాన్‌కి అధ్యక్షుడిగా వ్యవహరించే స్థాయికి వచ్చిన శ్రీ దాసగణు జీవితంలోని సంఘటనలు ఉన్న స్థితినుండి ఉన్నత స్థితికి ఎట్లా చేరుకోవాలో తెలియజేస్తాయి. "శిరిడీ మాఝే పండరిపుర, సాయిబాబా రమావర" అని హారతులలో దాసగణు కీర్తించినట్లుగా పండరినాథుని సన్నిధిలో శ్రీసాయి సన్నిధిని అనుభవిస్తూ సత్సంగము చేసుకొని మనము ఆ రమావరుని కృపకు పాత్రులవుదాము అనుకుంటూ అందరమూ ఒక్కచోట చేరి సత్సంగం ప్రారంభించుకొన్నాము. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు అందించిన "సాయిసన్నిధి"లోని దాసగణు గురించి నాకు తెలిసిన విషయాలు వివరించుకోవటమైనది. ఇంతకు ముందు తనతో మాట్లాడిన సత్సంగ సభ్యుడిని అక్కడ సెక్యూరిటీ పిలవటం ఏదో అడగటం, అతను ఏదో చెప్పటం జరుగుతున్నది. అంతసేపు అక్కడ కూర్చోకూడదేమో, అయినా అటువైపు ఎందుకు చూడటం అని భావించి సత్సంగం కొనసాగించుకున్నాము. అనంతరం, అందరమూ శ్రీ దత్తసాయి భరద్వాజ సహిత, పాండురంగడికి నమస్కరించుకుని, "జై"నాథము చేసి వెనుకకు మరలేము. ముఖమండపము నుంచి బయట ద్వారమువైపు వెళుతుండగా కుడిప్రక్కగా అక్కడ ఒక చిన్న మందిరం కనిపించింది, దగ్గరకు వెళ్ళిచూస్తే అది దత్త మందిరము. అప్పుడు గుర్తుకువచ్చింది. మేము ఎప్పుడు పండరిపురం వచ్చినా చంద్రబాగా నదిలో స్నానంచేసి, ఒడ్డునగల అతి పురాతనమైన రావిచెట్టు క్రింద ప్రతిష్ఠితుడైన శ్రీదత్తాత్రేయుల వారిని దర్శించుకొని, వారికి ధూప, దీప, నైవేద్యములు సమర్పించి, అప్పుడు పాండురంగడి దర్శనానికి వచ్చి, తనివితీరా స్వామిని దర్శించుకొని వెళ్ళేవారము. ఈసారి, ప్రయాణం ఆలస్యంకావటం వలన, అది మరచి పాండురంగడి దర్శనార్థమై త్వరితగతిన ఆలయానికి రావటమైనది. శ్రీ దత్తుడిని చూడగానే ఆ విషయం జ్ఞప్తికి రాగా, "స్వామీ మా అపరాధము మన్నించుమని మనసులో అనుకొని, మందిరము లోనికి అడుగిడినప్పుడు కనిపించని ఈ మందిరము మా దృష్టికి గోచరించటం శ్రీ దత్తాత్రేయుని అనుగ్రహంగా" భావిస్తూ, "ఎక్కడ సత్సంగం చేస్తే అక్కడ దత్తావతారుడైన శ్రీసాయినాథుడు కొలువై ఉంటాడు" అని మాష్టారుగారు చెప్పినట్లు, ఇంతసేపు ఇక్కడ కూర్చొని సత్సంగము నిర్వహించుకోవటం ద్వారా, సాక్షాత్తు శ్రీ దత్తాత్రేయుడే పాండురంగడి సన్నిధిలో దర్శనమివ్వటంతో పొంగిపోయి, అగరుబత్తి వెలిగించి, అక్కడ పెట్టి, మా దగ్గర సంచిలో ఉన్న పటికబెల్లం నైవేద్యముగా స్వామివారి ముందు ఉంచి

నమస్కరించాను. వరుసగా, సత్సంగ సభ్యులందరూ ఒకరి తరువాత ఒకరు నమస్కరించుకుంటున్నారు. ఇంతలో సెక్యూరిటీ సిబ్బంది, మహరాజ్, మహరాజ్ అంటూ పిలుస్తూ సంప్రదాయ దుస్తులతో ఉన్న ఒక పెద్దాయనతో నా దగ్గరకు వచ్చాడు. నుదుట నిలువునామం పెట్టుకొని, మహారాష్ట్ర సంప్రదాయ దుస్తులతో ఉన్న ఆ పెద్దాయన మహరాజ్ మీరు, మీతో వచ్చిన వారందరూ ఆలయ ప్రధాన ద్వారమునకు తిన్నగా గల క్యూ మార్గము నుండి నిశ్శబ్దముగా లోపలికి వెళ్ళి స్వామిని దర్శనం చేసుకోండి, ఏకాంతసేవ అనంతరం ముఖ్య అతిథుల దర్శనం అనంతరం ఆలయం పూర్తిగా మూసివేస్తాము కనుక త్వరితగతిన మీరందరూ లోపలికి వెళ్ళి దర్శనం చేసుకోండి" అని చెప్పగా, మా ఆనందానికి అవధులులేవు. మన సత్సంగసభ్యుడితో ఆ సెక్యూరిటీ అతను మీరు ఇక్కడే ఉండి మీవాళ్ళను మాత్రం అందరినీ లైన్‌లో పంపి, చివరగా మీరు వెళ్ళండి, అంతవరకు నేను ఉంటాను అని చెప్పేడు. పరమానందంతో లోపలికి వెళ్ళి, గర్భగుడిలో చిరునవ్వులు చిందిస్తున్న ఆ పాండురంగడిని వెండిద్వారము దగ్గరనుండే తనివితీరా దర్శించుకొని వచ్చాము. "సత్సంగము చేసిన చోట శ్రీసాయి కొలువై ఉంటారు" అన్న శ్రీ భరద్వాజగారి బోధకు ప్రత్యక్ష నిదర్శనం ఈ సంఘటన. శ్రీ దత్త స్వరూపుడైన శ్రీసాయి, రమావరుడై మాకు దర్శనమిచ్చారు. అందరూ దర్శనం చేసుకొని వచ్చిన తరువాత చివరగా వచ్చిన సత్సంగ సభ్యుడు, మార్గమధ్యంలో సెక్యూరిటీ మాట్లాడిన విషయాలు చెప్పసాగేడు. "అందరూ కూర్చొని ఏమి చెప్పుకుంటున్నారు" అని అడిగేడు ఆయన, "సత్సంగం చేసుకుంటున్నాము, దత్తక్షేత్రాల యాత్రలో భాగంగా ఇక్కడకు వచ్చాము, ఎటువంటి పరిస్థితులలోనైనా ఈ రాత్రికి మేము బయలుదేరాలి. ఎటూ దర్శనం కాలేదు, కనుక ఈ పవిత్రమైన ప్రదేశములో కూర్చొని కొద్దిసేపు సత్సంగం చేసుకుందామని దాసగణు మహరాజ్ గురించి మా సత్సంగ నిర్వాహకులు చెబుతున్నారు" అని అన్నాను. అతను కొద్దిసేపు ఆలకించాడు ఏమి అర్థమైందోగాని ఆ తరువాత అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. సత్సంగం మధ్యలో అంతరాయం కాకుండా అతను ఏమన్నా అడిగితే చెబుదామని నేను అక్కడే ఉండిపోయాను. సత్సంగం పూర్తి అయ్యి బయలుదేరిన తరువాత విషయాలు మీకు తెలిసిందే" అన్నాడు అతను. "మీరు ఎక్కడ ఉంటే అక్కడ సత్సంగాలు చేయండి, అదే మిమ్ములను సాయికృపకు పాత్రులను చేస్తుంది" అన్న ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి బోధ అద్భుతమైన అనుభవాన్ని ప్రసాదించింది. వేలకు వేలు ఖర్చుపెట్టి ప్రయాసపడే పనిలేకుండా అత్యంత సులభంగా స్వామిదర్శనం పొందే అదృష్టం కలుగజేసిన మాస్టారుగారికి మరొక్కసారి మనస్సులో సహస్ర వందనాలు అర్పించుకుంటూ, అందరమూ ఆ అద్భుత అనుభవాన్ని అస్వాదిస్తూ, వసతి గృహం చెంతకు చేరేము. మార్గమధ్యంలో చంద్రబాగా నది ఒడ్డునగల శ్రీదత్తమందిరము వద్దకు వెళ్ళేము. మూసివేసి ఉంది. బయట గోడమీద దర్శన వేళలు రాత్రి 8గంటల వరకు అని వ్రాయబడి ఉంది. అంటే మేము బస్సుదిగే సమయానికి మందిరము మూయబడి ఉంది, అయినా, అటువైపు చూడకుండా దర్శనార్థమై, పరుగెత్తిన మాకు ఆయాసముతోపాటు, ఆలోచన కలిగించి, సత్సంగం ద్వారా మా తప్పిదాలను మన్నించి పాండురంగడి చెంతనే తనుదర్శన మిచ్చి అనుగ్రహించిన శ్రీదత్త సాయి భరద్వాజుల కృపను ఏమని వర్ణించను.

దర్శనానికి రాలేని వారు కొంచెం సేపు బాధపడి, అది వారి తప్పే కనుక, మౌనం వహించారు. పండరినాథుని దర్శనం చేయించలేదు అన్న నెపం తప్పినందుకు ఆర్గనైజర్ కోసూరి శ్రీనివాసరావు సంతోషించాడు. అల్పాహారము ఆరగించి, శ్రీదత్తసాయి భరద్వాజుల అనుగ్రహాన్ని తలచుకుంటూ మాప్రయాణం కొనసాగించేము. ఎప్పుడైనా, ఎక్కడైనా యాత్రలో విరామ సమయంలో వారి వారి పనులలో ఉండటమో, వంటలు సిద్ధమయ్యేవరకు విశ్రాంతి తీసుకోవటమో చేసేవారందరూ, అప్పటినుంచి విరామ సమయాలలో నిర్వహించుకునే సత్సంగాలలో ప్రతిఒక్కరూ పాల్గొనేవారు.

డబ్బులిచ్చాము, యాత్రకు వచ్చాము, ఆ యా ప్రదేశాలు చూశాము, అంతేకాని, నిరంతరము వాటి గురించేనా, వేరే పిచ్చాపాటి ఏమీ లేకుండా అంటూ, దూరం దూరంగా తిరిగే కొత్తవారు కూడ, బస్సులో కూడ వెళ్ళే ప్రదేశం గురించిగాని, మహాత్ముల గురించిగాని, తెలియజేయమని అడిగేవారు. అప్పటినుంచి బస్సులో మైకు ఏర్పాటు చేసుకొని, దానిని కదిలే సత్సంగ మందిరముగా మార్చేసుకునేవారము. శ్రీదత్తానుగ్రహముతో ఆ యా యాత్రలలో ఎన్నో అనుభవాలు, వీలువెంట సమయానుసారముగా మీతో పంచుకోవటానికి ప్రయత్నిస్తాను. "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషిగా శిరిడీకి మాత్రమే పరిమితమైలేరు, సర్వత్రా వ్యాపించి ఉన్న చైతన్యమే శ్రీసాయి. సకల దేవత, సాధు, జీవులలోను ఆయనే ఉండి అనుగ్రహిస్తున్నారు. ఏమహాత్ములను దూషించినా, దర్శించిన అది వారికే చెందుతుంది" అని శ్రీసాయి విశ్వచైతన్యాన్ని తాను అనుభవైకవేద్యం చేసుకొని, శిరిడీవెళ్ళి సాయిని దర్శించుకొని, సాయి ఆరూపంలోనే అక్కడే ఉన్నాడు అనే భ్రమనుండి మమ్ములను బయటకు లాగి, అందరిలో శ్రీసాయిని దర్శింపచేస్తూ, వారి అనుగ్రహాన్ని పొందేలా తీర్చిదిద్దుతున్న సాయిమాస్టర్ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి పాదపద్మములకు శతకోటి కృతజ్ఞత పూర్వక పాదాభివందనాలు అర్పిస్తూ, ఏప్రిల్ 12వ తేదీ వారి ఆరాధనోత్సవ సందర్భముగా ఈ "వ్యాస" పుష్పాన్ని వారి పాదాలకు సమర్పించుకుంటూ...

**మీ... వి.వి. పూర్ణచంద్రరావు**

"అనంతాచార్య తనూజాతం సాయినాథ సమప్రభం
భరద్వాజ మహంవందే సర్వశిష్య ఫలప్రదం"

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం

## (2022 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)

శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు (పవర్‌సిటీ) మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా 2022 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలో అనేక ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించటమైనది.

విశ్వవ్యాపకుడు, విశ్వస్వరూపుడు అయిన శ్రీ శిరిడీసాయి అనేక రూపాలలో అందిస్తున్న విశ్వతత్త్వాన్ని, బోధామృతాన్ని మహాత్ముల ముద్దుబిడ్డడుగా వినుతికెక్కిన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి అనుగ్రహ ఆశీర్వాద పూర్వక మార్గనిర్దేశకత్వంలో, వారు చూపిన నిర్దుష్టమైన శ్రీ దత్త సాయి విశ్వస్వరూపాన్ని, వారి స్వరూపాలైన అవధూతల, మహాత్ముల బోధనలను ఒక్కచోట చేర్చి, "శ్రీ భరద్వాజ సద్గురువాణి" ఆధ్యాత్మిక పత్రిక ద్వారా చేసే "అక్షర సత్సంగ యజ్ఞం" ప్రారంభించి ఇరవై ఒక్క వసంతాలు నిండి, 22వ వసంతంలోనికి అడుగిడుతున్న శుభ సందర్భములో "శ్రీ భరద్వాజ సద్గురువాణి'' జన్మదిన ప్రత్యేక సంచికను శ్రీసద్గురుపాదుకాక్షేత్రంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమములో శ్రీభరద్వాజ పబ్లికేషన్స్ అధినేత్రి శ్రీమతి వి.యస్. లక్ష్మీపూర్ణచంద్రరావు ఆవిష్కరించి ఆహుతులకు అందజేయగా, ట్రస్టు నూతన సంవత్సర కేలండరును ట్రస్టుఛైర్మన్ ఆవిష్కరించారు. ట్రస్టు నూతన సంవత్సర ప్రణాళిక ఫోల్డర్‌ను సత్సంగ సభ్యులు శ్రీ శ్రీనివాసరావు ఆవిష్కరించగా, ప్యాకెట్ పుస్తకాన్ని ట్రస్టు సభ్యులు శ్రీ కె.వి. శ్రీహరి ఆవిష్కరించారు. సామూహిక సమారాధన, అనంతరం 2021 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ 2022 ఆంగ్ల నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ప్రత్యేక సత్సంగము ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు నిర్వహించారు. అనంతరం అందరికి శుభాకాంక్షలతో పాటుగా కేలండరు, బాబా చిత్ర పటము, పాకెట్టు పుస్తకము మరియు స్వీట్ మొదలైనవి అందరికీ అందజేయటమైనది.

జనవరి 1వ తేదీ శనివారము ఆంగ్లనూతన సంవత్సరమును పురస్కరించుకొని శ్రీసద్గురుపాదుకాక్షేత్రంలో సత్సంగము నిర్వహించి, భక్త సమారాధన ఏర్పాటు చేయటమైనది.

జనవరి 13వ తేదీ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని, శ్రీసద్గురుపాదుకాక్షేత్రంలో జరిగిన ఒక కార్యక్రమములో "శ్రీసాయిభరద్వాజ అపన్నహస్తం'' పేరిట అతినిరుపేద, దివ్యాంగుల, వితంతు స్త్రీలు 65 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు మరియు వస్త్రములు బహుకరించటమైనది. ఈ కార్యక్రమములో శ్రీభరద్వాజ పబ్లికేషన్స్ అధినేత్రి శ్రీమతి వి.యస్. లక్ష్మీపూర్ణచంద్రరావుతో పాటుగా ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి 14వ తేదీ భోగిపండుగ సందర్భముగా స్థానిక చిన్నారులకు శ్రీ శిరిడీసాయిసేవాట్రస్టు ప్రాంగణంలో భోగి పండ్లు కార్యక్రమాన్ని నిర్వహించి, అందరికీ అల్పాహారము ఏర్పాటుచేసి, స్త్రీలకు బహుమతులు అందజేయటమైనది.

జనవరి 15వ తేదీ సంక్రాంతి పండుగ మరియు ఉత్తరాయణ పుణ్యకాలమును పురస్కరించుకొని స్థానికులతో సత్సంగము నిర్వహించటమైనది.

జనవరి 16వ తేదీ అవధూత శ్రీ రామిరెడ్డితాత ఆరాధనోత్సవము సందర్భముగా శ్రీసద్గురుపాదుకాక్షేత్రంలో అవధూత శ్రీ రామిరెడ్డితాత పాదుకలకు విశేష పూజలు నిర్వహించి, అనంతరం సామూహిక "అవధూత శ్రీరామిరెడ్డితాత వ్రతము" నిర్వహించటమైనది. అనంతరం విశేష అన్నదాన కార్యక్రమము జరుపబడినది.

శ్రీరామిరెడ్డితాత ఆరాధనోత్సవము సందర్భముగా శ్రీకాకుళంలోని నిత్యాన్నదానసమితి వారికి నిత్యావసర వస్తువులు, వయోవృద్ధులకు, నిరుపేదలకు నిత్యాన్నదానము చేసేవారికి అన్నదాన నిమిత్తము కూరగాయలు, సరుకులు అందజేయటమైనది.

ఫిబ్రవరి 2 మరియు 3 తేదీలలో శ్రీశిరిడీసాయి సేవాట్రస్టు 29వ వార్షికోత్సవము ట్రస్టు ఆవరణలో అత్యంత వైభవముగా నిర్వహించటమైనది.

ఫిబ్రవరి 2వ తేదీ బుధవారం ఉదయం శ్రీ దత్త సాయి భరద్వాజులకు పంచామృతాభిషేకము చేసి, అనంతరం శ్రీ దత్త సాయి భరాద్వజుల సహిత అవధూత, మహాత్ముల పాదుకలకు షోడశోపచారపూజ నిర్వహించటమైనది. అనంతరం "శ్రీగురుచరిత్ర" గ్రంథపూజ నిర్వహించి, సామూహిక "శ్రీగురుచరిత్ర" ఏకాహపారాయణ చేయటమైనది. సాయంత్రం గాయిత్రి శ్రీరామమూర్తిగారి ఆధ్వర్యములో స్థానిక దేశపాత్రుని పాలెమునకు చెందిన భజన బృందము "భక్తి గానలహరి" నిర్వహించారు. అనంతరము వారందరిని తగిన రీతిన ట్రస్టు ఛైర్మన్ సత్కరించటమైనది. "మన సమస్యలకు పరిష్కారం శ్రీగురుచరిత్ర" అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనము అనంతరం, అన్నప్రసాద వితరణ చేయటమైనది.

ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం శ్రీదత్త సాయి భరద్వాజులకు పంచామృతాభిషేకం నిర్వహించి, అనంతరం శ్రీ దత్తావతార, అవధూత, మహాత్ముల పాదుకలకు విశేష పూజ నిర్వహించి అనంతరం సామూహిక "శ్రీ సాయిసత్యవ్రతములు" చేయటమైనది. భక్త సమారాధన అనంతరం మధ్యాహ్నం "సేవా-సాయిమార్గం"

అనే అంశముపై ఆధ్యాత్మికగోష్ఠి నిర్వహించి, "శ్రీసాయి భరద్వాజ అపన్నహస్తం" పేరిట నిత్యావసర వస్తువులు పంపిణీ చేయటమైనది. ఆ కార్యక్రమములో స్థానిక అగనంపూడి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ శ్రీ బలిరెడ్డి సత్యన్నారాయణ మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. సాయంత్రం "శ్రీసాయిమార్గము" అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనము అనంతరం భక్తసమారాధన ఏర్పాటు చేయటమైనది. ఆ యా కార్యమాలలో స్థానికులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. రెండురోజులు దూరప్రాంతాల నుండి వచ్చిన వారికి వసతి ఏర్పాటుతోపాటు, కార్యక్రమములో పాల్గొన్న వారందరికీ అల్పాహార, భోజనాదులు ఏర్పాటు చేయటమైనది. వార్షికోత్సవ సందర్భముగా శ్రీ దత్తావతారుల, అవధూత, మహాత్ముల పాదుకా సహితముగా, వారు ఉపయోగించిన వస్తు, వస్త్ర సముదాయమును అనధికార ప్రముఖులతోపాటు భక్తులు విశేషముగా దర్శించుకున్నారు.

ఫిబ్రవరి 7,8,9 తేదీలలో గుంటూరుజిల్లా తాడేపల్లి కరకట్ట వద్దగల శ్రీ గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమములో జరిగిన 23వ అఖిల భారత సాయిమాస్టర్ భక్త సమ్మేళనములో ట్రస్టు ఛైర్మన్ దంపతులతోపాటు ట్రస్టు అనుబంధ సంస్థలనుంచి దాదాపు 25 మంది ఆ కార్యక్రమములో పాల్గొన్నారు. ఆ సందర్భముగా, ట్రస్టు ఆధ్వర్యంలో "శ్రీసద్గురు పాదుకా దర్శనం" పేరిట శ్రీ దత్తావతార, అవధూత, మహాత్ముల పాదుకల సహిత, వస్తు, వస్త్ర సముదాయ దర్శనము ఏర్పాటు చేయటమైనది. కృష్ణాతీరాన, స్వామీజీ ఆశ్రమంలో అంతమంది అవధూత, మహాత్ముల పాదుకలు దర్శించకోవటం శ్రీ దత్త కృపకు నిదర్శనం అని స్థానికులు పలువురు మా ప్రతినిధితో తమ అభిప్రాయము తెలియజేయటమైనది. సమ్మేళనలోని భాగంగా "వ్యక్తిప్రాధాన్యత లేని ఆధ్యాత్మికత" అనే అంశముపై శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు ప్రవచనం చేయటమైనది.

ఫిబ్రవరి 13వ తేదీ మాఘ ఆదివారము (మాఘమాసములో ఆది (రవి) వారము చాలా విశేషమైనది) పురస్కరించుకొని శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో తృచ,సౌర,అరుణ, ప్రయుక్త సూర్యనమస్కార కార్యక్రమము ఉభయస్మార్త కోట రామశాస్త్రి బృందముచే నిర్వహించటమైనది. అత్యంత శాస్త్రోక్తముగా జరిగిన ఆ కార్యక్రమములో సామూహికంగా అర్ఘ్యప్రదానము చేయించటమైనది. ఆ సందర్భముగా అందరికి అరసవిల్లి సూర్యనారాయణస్వామి "రాగిరూపు" అందజేయటమైనది. అనంతరం విశేష అన్నదాన కార్యక్రమము జరిగింది.

ఫిబ్రవరి 18వ తేదీ శ్రీకాకుళంలోని కొత్తూరు జిల్లాలోని అతినిరుపేద కుటుంబానికి వైద్యఖర్చుల నిమిత్తము ఆర్థిక సహాయం అందజేయటమైనది.

ఫిబ్రవరి 28వతేదీ శివరాత్రిని పురస్కరించుకొని శ్రీకాకుళంలోని దివ్యాంగులు, వృద్ధులు మరియు వితంతువులకు జరిపే అన్నదాన నిమిత్తం స్థానిక సంస్థవారికి నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

మార్చి 1వ తేదీ మహాశివరాత్రి సందర్భముగా శ్రీసద్గురుపాదుకాక్షేత్రంలో, "శివోహం" పేరిట విశేష కార్యక్రమము నిర్వహించటమైనది. ఆ సందర్భముగా శివసహస్ర నామావళితో శ్రీ దత్త సాయి భరద్వాజ, శ్రీ పాకలపాటి గురువుగారి సహిత, ఈశ్వరుడికి సామూహిక బిల్వ, పుష్పార్చన చేయటమైనది. రాత్రి లింగోద్భవ సమయంలో సామూహిక మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము నిర్వహించి, పూజ అనంతరం ప్రసాద వితరణ చేయటమైనది.

మార్చి 2వ తేదీ బుధవారం శ్రీ పాకలపాటి గురువుగారి ఆరాధనోత్సవములో భాగంగా, నర్సీపట్నం బాబుగారి ఆశ్రమములో జరిగే విశేష అన్నదాన కార్యక్రమములో ట్రస్టు ఛైర్మన్ దంపతులతో పాటు ట్రస్టు సభ్యులు పాల్గొని, అక్కడ వేలాదిమందికి జరిగే విశేష అన్నదాన కార్యక్రమములో తమవంతు సేవ నందించారు. ఆ సందర్భముగా ట్రస్టు ఛైర్మన్ దంపతులు శ్రీ పాకలపాటి గురువుగారికి, ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు.

మార్చి 4వ తేదీ సమర్థ రామదాసస్వామి పాదుకలు శ్రీసద్గురుపాదుకాక్షేత్రమునకు విచ్చేయుగా. విశేషపూజ నిర్వహించటమైనది. ఆ పాదుకలు శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో భక్తుల దర్శనార్థమై ఉంచటమైనది.

మార్చి 17వ తేదీ హోళీపండుగ సందర్భముగా "శ్రీసాయి భరద్వాజ అపన్నహస్తం" పేరిట 65 అతినిరుపేద, దివ్యాంగుల కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది. సాయంత్రం జరిగిన ప్రత్యేక సత్సంగములో శ్రీసాయి చిత్రపటము రూపములో హేమాద్రిపంత్ ఇంటికి వెళ్ళిన సంఘటనపై సత్సంగము నిర్వహించి, సమారాధన ఏర్పాటు చేయటమైనది. ఆ కార్యక్రమములో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మార్చి 20వ తేదీ ఆదివారము ట్రస్టు ఆవరణలో ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి. పూర్ణ చంద్రరావు ఆధ్వర్యంలో "ఆత్మీయ సమ్మేళనము" జరిగింది. గత 2 సంవత్సరాలుగా కరోనా నేపథ్యములో అత్యవసరమైన సామూహిక కార్యక్రమాలలో మాత్రమే పాల్గొంటూ, దాదాపు ఇంటికే పరిమితమవుతూ వచ్చిన సత్సంగ, ట్రస్టు సభ్యులందరూ కరోనా తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో దాటిపోతున్న "ప్లవ"నామ సంవత్సరములో తాము పొందిన అనుభవాలను, అనుభూతులను ఒకరికొకరు ప్రత్యక్షముగా పంచుకుంటూ, "శుభకృత్" నామ సంవత్సరంలో మరింతగా మాస్టారు చూపిన సాయిమార్గంలో పయనం చేస్తూ జీవితం సుఖమయం చేసుకోవటానికి ప్రణాళికలు సిద్ధంచేసుకోవటానికి, ఒకే కుటుంబముగా కలసికట్టుగా, ఒకరికోసం అందరూ, అందరిలో నేను అనే భావన పెంచుకోవటానికి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమములో సత్సంగసభ్యులు అందరూ సకుటుంబ సమేతంగా పాల్గొని, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ

సాధకబాధకాలు మాట్లాడుకున్నారు. చాలా కాలం తరువాత జరిగిన ఆ గురుబంధువుల కలయిక అందరిలో ఆనందోత్సాహాలు నింపింది.

ఉదయం నుంచి, సాయంత్రం వరకు సాగిన ఈ కార్యక్రమములో అల్పాహార, విందు భోజన ఏర్పాట్లు చేయటమైనది.

మార్చి 24వ తేదీ బుధవారం కర్ణాటకలోని, హంపి-విజయనగరం జిల్లా నుండి 200 సంవత్సరాల చరిత్ర గలిగిన సద్గురు శ్రీగాడీతాత పాదుకలు శ్రీసద్గురుపాదుకాక్షేత్రమునకు విచ్చేయటమైనది. ఆ సందర్భముగా విశేషపూజలు నిర్వహించి, భక్తుల దర్శనార్థమై పాదుకలను పాదుకాక్షేత్రములో శాశ్వతముగా ఉంచటమైనది.

ఆ యా కార్యక్రమ విషయ విశేషాలు సంక్షిప్తముగా తెలియజేయటమైనది.

సమీక్ష : **శ్రీమతి వి. జ్యోతిర్మయి**, విశాఖపట్నం

# మేము సహితం

ఆధ్యాత్మిక సామాజిక సేవలో భాగముగా 2022 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలో శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా అనేక ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించటమైనది. వాటిలో ప్రధానముగా "శ్రీ సాయిభరద్వాజ అపన్నహస్తం" పేరిట అతి నిరుపేద, వితంతు, దివ్యాంగుల 65 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు ప్రతినెల అందజేయటముతో పాటుగా, అర్హులైన వారికి వస్త్రాలు, బహుకరించటము, అతి నిరుపేదలై, దీర్ఘకాల రోగగ్రస్తులైన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయము, శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలోని రోగులకు అన్నదాన నిమిత్తము 400 మందికి కూరగాయలు, ప్రతివారము అందజేయటము, శ్రీకాకుళం పరిసరప్రాంతాలలోని అతి నిరుపేదలకు ఇంటివద్దనే ఆహారమందించే సమితి వారికి అవసరమైన నిత్యావసర వస్తువులు మొదలైన వాటితో పాటు ఆ యా సందర్భాలను అనుసరించి, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించటమైనది. పూర్తి వివరాలకు పేజీ నెం. 21లో చూడగలరు.

మేము చేసే సామాజిక సేవా కార్యక్రమాలకు సహృదయముతో సహకారము అందిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతాభివందనాలు. హృదయపూర్వకంగా మీరందించే ప్రతి సహాయము, పదింతలుగా భావిస్తూ, ప్రతి రూపాయి తగురీతిన అర్హులైన వారికి అందే విధముగా మావంతు కృషి నిరంతరము కొనసాగించగలమని తెలియజేస్తూ

సహాయ సహకారము అందిస్తున్న ప్రతి ఒక్కరూ శ్రీ దత్తసాయి భరద్వాజుల కృపానుగ్రహముతో దినదినాభివృద్ధి చెందుతూ, మరింతగా ఆధ్యాత్మిక, సామాజిక సేవాకార్యక్రమాలలో పాల్గొనే శక్తిని ప్రసాదించమని జగద్గురువును ప్రార్థిస్తూ, చేయూతనిచ్చిన వారి వివరాలు ఈ క్రింద పొందుపరుస్తున్నాము.

## సహాయ సహకారములు అందించిన సహృదయులు

| | |
|---|---|
| కుమారి సిహెచ్. యామిని, కూర్మన్నపాలెం, వైజాగ్ | 5000/- |
| శ్రీ ఓలేటికుమార్, జంగారెడ్డి గూడెం | 4000/- |
| శ్రీ కె. రమేష్‌బాబు, శ్రీనగర్, వైజాగ్ | 3000/- |
| శ్రీ & శ్రీమతి హైమ అప్పలరాజు, ఎన్.టి.పి.సి. పరవాడ | 3000/- |
| శ్రీ పట్టాభిరామారావు, న్యూఢిల్లీ | 2500/- |
| శ్రీ పార్థసారధి, అనకాపల్లి | 2500/- |
| శ్రీ డి. శంకరరావు, జమదాల, విజయనగరంజిల్లా | 1500/- |
| కుమారి కె. ప్రమీల | 1212/- |
| శ్రీ శరత్‌చంద్రబాబు, పవర్‌సిటీ, వైజాగ్ | 1116/- |
| శ్రీమతి పి. గిరిజాకుమారి, ఇసుకతోట, వైజాగ్ | 1111/- |
| శ్రీ సాయిరాము, ఇసుకతోట, వైజాగ్ | 1111/- |
| చి॥ సాయి సుజన, ఇసుకతోట, వైజాగ్ | 1111/- |
| కుమారి యన్. హారిక | 900/- |
| శ్రీ జి. భిక్షపతి, హైదరాబాదు | 772/- |
| శ్రీ వి.వెంకటేశ్వరరావు, భీమడోలు | 516/- |
| శ్రీ యన్. సుబ్రమణ్యశ్రీ | 500/- |
| శ్రీ జనపాటి సుబ్రహ్మణ్యశర్మ, ఒంగోలు | 500/- |
| శ్రీ యస్. నరసింహం, వైజాగ్ | 400/- |
| శ్రీ బి. కృష్ణారావు, అక్కయ్యపాలెం, వైజాగ్ | 306/- |
| శ్రీ యస్.వి. రమణయ్య, నల్లపాడు, గుంటూరుజిల్లా | 300/- |
| శ్రీ జె. సాయి | 208/- |
| శ్రీమతి బి. వెంకటలక్ష్మి, వైజాగ్ | 204/- |
| శ్రీ జి. బాలకృష్ణ, ఉక్కునగరం, వైజాగ్ | 116/- |
| శ్రీ యు. వి. బాలయోగి, ఉక్కునగరం, వైజాగ్ | 116/- |
| శ్రీ యల్ అప్పలరాజు, ఆర్.ఆర్.వి.పురం, వైజాగ్ | 100/- |

**మేము సహితమునకు విరాళములు పంపుటకు చిరునామా మరియు బ్యాంక్ అక్కౌంటు**

**SRI SHIRIDI SAI SEVA TRUST®**
Online A/C No. 09551001106492
IFSC Code: UBIN0809551
Union Bank, Ukkunagaram
(Used for RTGS and NEFT Transactions)

**శ్రీ భరద్వాజ సద్గురువాణి సభ్యత్వము కొరకు విరాళములు పంపుటకు చిరునామా మరియు బ్యాంక్ అక్కౌంటు**

**SRI BHARADWAJA PUBLICATIONS**
Online A/C No. 09551001106491
IFSC Code: UBIN0809551
Union Bank, Ukkunagaram
(Used for RTGS and NEFT Transactions)

## అక్షర యజ్ఞానికి చేయూత

"శ్రీభరద్వాజ సద్గురువాణి" ముద్రణకై తమవంతు సహాయసహకారము అందించినవారు

1. శ్రీ కె. కరుణారెడ్డి యు.యస్.ఎ. 23,176/-
2. శ్రీ భార్గవికుమార్, విజయవాడ 1000/-

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం

## (2022 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)






























పూర్తి వివరములకు 21 పేజీ చూడగలరు.







ఉగాది మరియు శ్రీరామ నవమి శుభాకాంక్షలతో ఈ పేజీ సమర్పించిన వారు : **శ్రీమతి & శ్రీ పి. కృతియ కళ్యాణ్**








# 23వ అఖిల భారత శ్రీసాయిమాస్టర్ భక్తసమ్మేళనము - సమీక్ష

"గురువు", "గురుతత్వం", "గురుమార్గం" అనే పదాలకే అర్థం మారిపోతూ, భక్తి అనేది నలుగురిలో హుందాతనం పెంచే ఫ్యాషన్‌గా రూపుదిద్దుకుంటూ మహాత్ముల చిత్రపటాలు ఇంటిగోడలకు తగిలించుకునే అలంకారణాలుగా మారి, వైజ్ఞానికత పేరుతో మనిషి మేధస్సు వెర్రి తలలు వేస్తున్న సమయంలో, షరతులు లేని దివ్య ప్రేమకూ, అపరిమిత త్యాగానికీ, అవాజ్యమైన క్షమకూ ప్రతీకగా నిలచి, తాను పొందిన తృప్తి, శాంతి, ఆనందాలు ప్రతి ఒక్కరూ పొందాలని తపిస్తూ, కట్ట కడపటి సాధకుడు సైతం తరించేంత వరకూ తాను చెక్కవంతెనగా ఉపయోగపడతానని, తాను సమాధి చెంది 33 సంవత్సరాలు అవుతున్నా, నేటికీ లక్షలాది మందిని నిర్దుష్టమైన శ్రీసాయి మార్గంలో వెంటనుండి నడిపిస్తున్న పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి పైగల అవాజ్యమైన ప్రేమతో వారికి చంద్రుడికి ఒక నూలుపోగు చందాన కృతజ్ఞత పూర్వక దక్షిణ రూపంగా, శ్రీ భరద్వాజగారితో అత్యంత సన్నిహితం కలవారు, సహచరులు, విద్యార్థులు, అనుసరణీయులు, సర్వులు ఒక్కచోట చేరి, మాస్టారుగారు అందించిన సాధన మార్గాన్ని పటిష్టం చేసుకుంటూ, నలుగురిలో సరిచూసుకుంటూ, సరిచేసుకుంటూ కలసి పయనిస్తూ, పదిమందికి మాస్టారు చూపిన సాయిమార్గాన్ని అందిస్తూ, కలసి సాగటానికి వేదికగా, శిరిడీలో మాస్టారుగారు విశ్వచైతన్యానుభూతి పొందిన ఫిబ్రవరి 8,9 తేదీలను స్మరించుకుంటూ, 2000 సంవత్సరములో శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు సారధ్యంలో, విశాఖపట్నంలో ప్రారంభమయిన మొట్టమొదటి అఖిలాంధ్ర శ్రీసాయిమాస్టర్ భక్తసమ్మేళనము, పుడమితల్లి వడినుంచి వచ్చిన అంకురం, మొక్కై, మానై, ఫలపుష్పాలు అందిస్తూ, తన దరిచేరిన వారి తాపాన్ని తొలగిస్తూ సేదతీర్చే తీరున, వసంతాలు గడుస్తున్న కొద్దీ సమ్మేళనం దినదిన ప్రవర్ధమానమయ్యి, నేడు అఖిల భారత సాయిమాస్టర్ భక్త సమ్మేళనముగా రూపుదిద్దుకుని, 23వ సమ్మేళనం కృష్ణాతీరములోని శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమములో 2022 ఫిబ్రవరి 7,8,9 తేదీలలో శ్రీ కె.వి. సూర్యనారాయణ సారధ్యంలో శ్రీసాయిమాస్టర్ భక్త బృందం విజయవాడ వారి సహకారముతో అత్యంత వైభవోపేతముగా జరిగింది.

**సమ్మేళన విషయ విశేషాలు - సంక్షిప్తముగా :**

1. ఒకప్రక్క కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతూ, తన గల గలలతో చల్లని పవనాలతో ఆహ్వానం పలుకుతుండగా, ఆధ్యాత్మిక వీచికలకు ఆనవాలమైన విశాల ప్రాంగణమైన శ్రీ గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమములో ఎటువంటి హంగులు, ఆర్భాటాలు లేకుండా, పచ్చటి, ప్రశాంత వాతావరణములో, 7వ తేదీ సాయంత్రం శ్రీదత్తాత్రేయ, సాయి, భరద్వాజుల ఊరేగింపు అనంతరం, వారిని వేదికపై ఆశీనులను చేసి షోడశోపచారపూజ చేయటముతో సమ్మేళనానికి నాంది పలకటమైనది.

2. ఫిబ్రవరి 8వ తేదీ ఉదయం 5.30 ని..లకు శ్రీసాయి హారతి, శ్రీదత్త సాయి భరద్వాజులకు షోడశోపచారపూజతో ప్రారంభమయ్యి, ఉదయం 9 గంటలకు పూజ్య అవధూత మునిరామయ్య స్వామి (గట్టుస్వామి) మరియు శ్రీ శ్రీపాద కామేశ్వరేంద్రతీర్థస్వామి (కోనస్వామి) వారు జ్యోతి ప్రకాశనము చేయటముతో సమ్మేళన కార్యక్రమాలు ప్రారంభమయినాయి.

3. ఉదయం 9 గంటల నుండి (మధ్యాహ్నం భోజన విరామ సమయం మినహాయించి) సాయంత్రం 4.30 ని॥ల వరకు వివిధ అంశాలపై వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వక్తల ప్రవచనాలు కొనసాగినయ్యి.

4. మొట్టమొదటిసారిగా, పాదుకల సహిత శ్రీ దత్త సాయి భరద్వాజులకు కృష్ణానదిలో జలవిహారము ఏర్పాటుచేయటమైనది, తమ గురుదేవుల జలవిహారాన్ని వీక్షించి, పులకించిపోయింది భక్తజన సందోహం. కృష్ణాతీరం శ్రీ దత్త సాయి భరద్వాజుల నామంతో మారుమ్రోగింది.

5. సాయంత్రం 6.30 ని॥ల నుండి 8.30 ని॥ల వరకు వివిధ అంశాలపై వక్తలు ప్రవచనం చేశారు.

6. ఫిబ్రవరి 9వ తేదీ ఉదయం 5.30 ని॥లకు శ్రీ దత్త సాయి భరద్వాజుల షోడశోపచారపూజతో రెండవరోజు కార్యక్రమం ప్రారంభముకాగా, ఉదయం 8.30 ని॥లకు సామూహిక గురుపూజలు, అనంతరం 10.30 ని॥ల నుండి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన వక్తలచే వివిధ అంశాలపై ప్రవచనాలు సాయంత్రం 5 గంటల వరకు కొనసాగాయి. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు శ్రీ కె.వి. సూర్యనారాయణ, సమ్మేళనాన్ని సమీక్షిస్తూ, తన మనోభావాలు తెలుపుతూ సహకరించిన వారికి సన్మానం చేయగా, అనంతరం కుమారి కె. రష్మిత వందన సమర్పణతో కార్యక్రమాలు పరిపూర్ణమయినాయి.

7. సమ్మేళనానికి ఫిబ్రవరి 7వ తేదీ సాయం కాలానికే సుదూర ప్రాంతాలనుంచి, అధికసంఖ్యలో ప్రతి నిధులు రాసాగేరు. వచ్చిన వారందరికి తగురీతిన, భోజన వసతులు ఏర్పాటుచేయటములో నిర్వాహకులు కృతకృత్యులైనారు.

8. ఫిబ్రవరి 8వ తేదీ కార్యక్రమాలను ఆద్యంతం సమయపాలనతో డా॥ ఇ. చెన్నయ్యగారు సమన్వయ కర్తగా వ్యవహరిస్తూ, నిర్వహించిన తీరు, ప్రత్యేకించి వక్తలను, వారు ప్రవచించే అంశాల గురించి పరిచయంచేస్తూ, ప్రవచనం అనంతరం అందలి సారం తెలియజేయటం, వారి నిబద్ధతను మరియు ఆ యా అంశాలపై వారు చేసిన పరిశ్రమకు, అద్దం పట్టింది. కార్యక్రమము మొత్తము ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా సాగింది.

9. వక్తలను-వారి అంశాలను ఎంపిక చేయటములో నిర్వాహకులు కనబరచిన ప్రత్యేక శ్రద్ధ, ఎంపిక చేసిన అంశాలలో ప్రస్ఫుటమై, ప్రతిఒక్కరిని ఆలోచింప చేసేవిగా ఉన్నాయి, వక్తలు కూడ తమకు ఇచ్చిన సమయంలో ఆ యా అంశాలను తమదైన శైలిలో చక్కగా వివరించటము జరిగింది.

10. పూజ్య భరద్వాజగారు విశ్వచైత్యానుభూతి పొందిన ప్రధానమైన ఫిబ్రవరి 9వ తేదీ ఉదయం 8.30 ని..లకు ప్రారంభమైన పూజ కార్యక్రమాలు,10.30 ని.ల వరకు సాగగా, చివరిక్షణం వరకు వచ్చిన ప్రతి ఒక్కరికీ, నిర్వాహకులు పూజాసామాగ్రి అందజేయటమైనది.అనంతరం శ్రీ సోమిన శివప్రసాదు సమన్వయకర్తగా వ్యవహరించగా, వక్తల ప్రవచనాల కార్యక్రమాలు ప్రారంభమైనాయి. స్థానికుల రాక పెరగటంతో ప్రాంగణమంతా నిండిపోయి నాటి కార్యక్రమాలు కోలాహలంగా సాగినయ్యి.

11. "స్మర్తృగామి" అనే సమ్మేళన ప్రత్యేక సంచికను శ్రీ కోనస్వామి, శ్రీ గట్టుస్వామి వారలు ఆవిష్కరించటమైనది. అదే సందర్భములో శ్రీ భరద్వాజ మాస్టారిగారి అనుగ్రహానికి పాత్రులైన శ్రీ మల్లాది సీతారామయ్య శ్రీమతి సుబ్బలక్ష్మిగారిచే విరచితమైన "మాస్టారిగారితో అనుబంధం" మరియు శ్రీ జి. సాయిచంద్ర సేకరించి కూర్చిన జగద్గురు చంద్రశేఖర సరస్వతీస్వామి లీలలు "పరమాచార్య వైభవము" ఆవిష్కరించబడి, ఆ ప్రతులు ప్రతి ఒక్కరికీ అందజేయటమైనది.

12. సమ్మేళన సమయంలో వివిధ సంస్థలవారు వారికి సంబంధించిన కరపత్రాలు, పుస్తకాలు ఉచితముగా ప్రతినిధులకు అందజేయటమైనది.

13. సమ్మేళన సందర్భముగా వివిధ ఆధ్యాత్మిక సంస్థలకు చెందిన పుస్తక, విక్రయాలు ఏర్పాటు చేయటమైనది. ఆసందర్భముగా శ్రీసాయిమాస్టర్ భక్తబృందం ఒంగోలువారి ఆధ్యర్యములో శ్రీ భరద్వాజమాస్టారి రచనలు 35శాతం తగ్గింపుతో అందజేయటముతో విశేష స్పందన కనిపించింది.

14. శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు - పవర్‌సిటీ, విశాఖపట్నం వారి ఆధ్యర్యంలో శ్రీ దత్తావతారుల, అవధూత, మహాత్ముల పాదుకలు, వస్తు, వస్త్ర సముదాయమును "శ్రీ సద్గురు పాదుకా దర్శనం" పేరిట ఏర్పాటు చేయటమైనది. విశేషముగా భక్తులు వాటిని దర్శించుకున్నారు.

15. 9వ తేదీ మధ్యాహ్నం భోజన విరామ అనంతరం సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన ప్రతినిధులు ఒక్కొక్కరుగా తిరుగు ప్రయాణమైనారు. వారందరికీ నిర్వాహకులు ఆహార ప్యాకెట్లు అందజేయటమైనది.

16. వివిధ ప్రాంతాల నుండి సమ్మేళనానికి, బృందములుగా విచ్చేసిన వారిలో చాలామంది కార్యక్రమ నిర్వహణలో తమవంతు సహకారము అందించటము కలసి పనిచేసే సంస్కృతికి నిదర్శనంగా నిలిచింది.

17. కార్యక్రమ నిర్వహణకు సమయాను కూలముగా సహాయ సహకారము లందించిన వారందరికీ సమ్మేళన వివరాలు ముద్రించిన శాలువా మరియు జ్ఞాపికలతో నిర్వాహకులు సన్మానించటము ముదావహం.

18. కరోనా మహమ్మారి భయంతో జనవరి నెల చివరివరకు సమ్మేళనముపై, వ్యక్తమయిన అనుమానాలు పటాపంచలు చేస్తూ, కృష్ణా నదీ తీరాన విశాలమైన ఆశ్రమప్రాంగణములో వివిధ ప్రాంతాలవారి మేలు కలయికతో 23వ సమ్మేళనం దిగ్విజయముగా పరిపూర్ణమయింది

**మా ప్రతినిధితో కొందరు ఆహుతులు వెల్లడిచేసిన అభిప్రాయాలలో కొన్ని**

19. మాస్టారు దర్శించిన మహాత్ముల సన్నిధిలో మరియు ఇంతవరకు జరగని ప్రాంతాలలో సమ్మేళనాలు, జరపటం ద్వారా, నిర్దుష్టమైన సాయి మార్గంలో మరింత ఎక్కువగా కలసి భక్తులు పయనించటానికి సహకరించిన వారలము అవుతాము.

20. సమ్మేళనం 7,8,9 తేదీలలో కాకుండా, 8,9,10 తేదీలలో నిర్వహించటం ద్వారా, మాస్టారుగారు విశ్వచైతన్యానుభూతి పొందిన రోజును ప్రశాంతముగా, సంపూర్ణముగా వినియోగించుకొన్న వారలము అవుతాము.


21. మాస్టారుగారు విశ్వచైతన్యానుభూతి పొందిన సమయాన్ని కనీసం ఆ అనుభూతిని గుర్తుచేసుకునేలా నిర్వాహకులు కార్యక్రమము రూపుదిద్దితే బాగుంటుంది.

22. మాస్టారిగారికి ప్రీతికరమైన విధముగా, సమ్మేళనలో విద్యార్థులను కూడ తగురీతిన భాగస్వాములను చేయటం ద్వారా, భావితరానికి మాస్టారు చూపిన సాయిమార్గాన్ని అందించిన వారలమవుతాము.

సమీక్ష : **శ్రీమతి వి. జ్యోతిర్మయి**, విశాఖపట్నం

# అవధూత శ్రీ చివటం అమ్మ

ఆంధ్రదేశంలో అవధూత సాంప్రదాయంలో విలసిల్లిన ముగ్గురు స్త్రీమూర్తులను అవధూత ప్రపంచానికి సామ్రాట్టులుగా చెప్పవచ్చు. వారు పరమాత్మ సాక్షాత్కారం పొందిన పుణ్యశీలురు. వారే 1. కురుమద్దాళి మాలపిచ్చెమ్మ 2. మావుళూరు బుచ్చెమ్మ 3. చివటం అచ్చెమ్మలు. పూజ్యశ్రీ భరద్వాజ మాస్టారుగారు దర్శించిన పుణ్యమూర్తి అవధూత సాధుమాతశ్రీ చివటం అమ్మ.




అమ్మ తపస్సు చేశారు. నామజపం చేశారు. రామనామం చాలా ప్రీతిగా చేసేవారు. సామాన్య గృహిణిగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ నిరంతర నామస్మరణ చేసి అవధూతగా మారేరు. తాను చేసిన సాధననే, ఇతరులను చెయ్యమన్నారు. "ఈ రోజు మరలా రాదే! రామ, రామ అనుకో అదే సాధన" అన్నారు.

పూజ్య ఆచార్యశ్రీ ఎక్కిరాల భరద్వాజగారు అమ్మను దర్శించిన సన్నివేశం చాలా గొప్పది. ఆచార్యుల వారికి ఎదురువచ్చి అమ్మ స్వాగతం చెప్పారు. ఆచార్యులవారు రాకముందే వారు చివటం వస్తున్నారని చెప్పి అన్ని సౌకర్యాలు చూచేవారు అమ్మ. ఆచార్యులవారు వచ్చినప్పుడు శ్రీసాయినాధులవారు వచ్చినంతగా ఆనందించేవారు. ఆచార్యుల వారిని పెదబాబు అని సంభోదించేవారు చివటం అమ్మ. వారు పెద్దగా మాట్లాడుకొన్న సన్నివేశాలు చాలా తక్కువ. మౌనమే వారి సంభాషణ. ఆచార్యులవారు వచ్చిన ప్రతిసారి రామాలయంలో సత్సంగం చేసేవారు. అమ్మ ఎంతటి గొప్ప వ్యక్తో వివరించేవారు.

పూజ్యశ్రీ ఆచార్యులవారు ఒకసారి రామాలయంలో సాయిని, అమ్మను పూజించుకోవాలని సంకల్పించారు. కృష్ణ అనే భక్తుడిని అమ్మను ఆహ్వానించి ఆలయానికి తీసుకొని రావలసినదిగా చెప్పారు. ఎన్నిసార్లు బ్రతిమిలాడినా అమ్మరాలేదు. ఆ విషయం కృష్ణగారు ఆచార్యుల వారితో చెప్పగానే, "ఓహో అలాగా" అని ధ్యానస్థులైనారు. ఆశ్చర్యంగా 10 నిముషములలో ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ అమ్మ రామాలయానికి వచ్చారు. అమ్మను సాయిపటం ప్రక్కన ఆశ్శీనురాలును చేసి, పూలతో అమ్మను పూజించారు ఆచార్యులవారు. తమపై పడిన పూలను అమ్మ సాయిపటం మీద వేసి నవ్వుకోసాగారు. ధ్యాత-ధ్యేయ-ధ్యానముల ఏకరూపతకు ఇది ప్రత్యక్ష నిదర్శనం.

ఆచార్యులవారి భక్తులు ఎవ్వరు వచ్చినా అమ్మ 'సాయిలీలామృతం' చదివించేవారు. సాయిభక్తులు ఎవరువచ్చినా మౌనము విడనాడి సాయిబాబా, సాయిబాబా అనేవారు. సాయిబాబాను నమ్ముకోమని ఆ మార్గాన్ని అనుసరించమని బోధించేవారు. తృప్తిగా భోజనం పెట్టి పంపించేవారు. ఒకరోజు ఉదయం అమ్మ కుటీరంలో స్టూలు వేసి శ్రీకొత్తలంక బాబాగారి ఫోటో పెట్టి పూలతో అలంకరించారు. కొంతసేపటికి కొందరు భక్తులు వచ్చారు. వారు కొత్తలంక బాబాగారి శిష్యులు. తమ గురువుగారి ఫోటో అక్కడ చూచిన ఆ భక్తుల ఆనందానికి అవధులు లేవు. అమ్మ సర్వజ్ఞత అట్టిది.

ఆచార్యుల వారు అమ్మ భౌతిక దేహంతో ఇంక ఎక్కువకాలముఉండరని తెలిసికొని త్వరగా అమ్మను దర్శించుకోమని సాయిభక్తులకు చెప్పేవారు. ఒక భక్తురాలి ద్వారా అమ్మ వివరాలు సేకరించి "సద్గురు దర్శనం" అనే సావనీర్‌లో అమ్మను గురించి ప్రచురించారు. అది చదివి చాలామంది అమ్మను దర్శించుకొని ధన్యత చెందేరు.

ఒకసారి మాష్టరుగారు చివటంలో వున్నప్పుడు మాష్టరుగారిని భోజనానికి రమ్మనమని అమ్మ కబురు చేశారు. మాష్టరుగారు రామాలయం వద్దకురాగానే అమ్మ కూడా వచ్చారు. మాష్టరుగారి చేతివేళ్ళను తన చేతివేళ్ళతో పట్టుకొని నడిచారు అమ్మ. అలా వెళ్తున్న సమయంలో మాష్టరుగారు అమ్మపొట్టను నొక్కేరు. వెంటనే అమ్మ రెండుచేతులు చూపించి నవ్వేరు. మాష్టరుగారు ఇంకొంచెం అమ్మపొట్టను గట్టిగా నొక్కారు. అమ్మ రెండు చేతులు దూరంగా జరిపి నవ్వేరు. మాష్టరుగారు ఎంత అన్నట్లుగా చూశారు. అమ్మ చేతులు ఇంకా జరిపి "ఇంత" అన్నట్లుగా నవ్వేరు. తర్వాత కొంతకాలానికి గాని ఈ వింత చర్య మాకు అర్థంకాలేదు. అమ్మ తన పార్థివ దేహాన్ని వీడి, అనంత చైతన్యంలో విలీనమవుతున్నానని ఆచార్యుల వారికి సూచించారన్నమాట.

ఒకసారి ఒక భక్తుడు అమ్మవద్దకు వచ్చి నేను పెద్దల వద్ద రామమంత్రం. శివమంత్రం, మేధాదక్షిణామూర్తి మంత్రం ఉపదేశం పొందాను. అవి చేస్తున్నాను. వాటితో కలిపి సాయి మంత్రం కూడా జపించవచ్చా? అని అడిగారు. అమ్మ అన్నారు. **"సాయి వద్దకు వచ్చిన తర్వాత ఏ మంత్రంతో పనిలేదు. ఆ మార్గంలో సాగిపొండి"** అన్నారు.

నిజమైన మహాత్ములు ఎలా వుంటారో, వారి సన్నిధి ప్రభావం ఎలాంటిదో తెలియచెయ్యటానికి అమ్మ జీవిత విశేషాలను సేకరించి గ్రంధరూపంలో అమ్మ జీవిత సంగ్రహాన్ని సాయిభక్త లోకానికి అందించారు ఆచార్యులవారు.

ఆచార్యులవారిని గురించి అమ్మ ఒకసారి ఇలా అన్నారు. "భరద్వాజ అంటే ఏమిటి? త్యాగం" అన్నారు. అదే ఆచార్యులవారి స్థితి.

అమ్మ సిద్ధి పొందిన తరువాత ఆచార్యులవారు గ్రామ పెద్దలతో అమ్మ అంతటి అవధూత అరుదు. వారు మీకు లభించటం ఎంతో అదృష్టం. వారిని ఊరి బయటనో, శ్వశానంలోనో సమాధి చెయ్యకండి, ఇక్కడే సమాధి చెయ్యండని చెప్పారు. భక్తులు మనస్ఫూర్తిగా ఆచార్యులవారి ఆదేశాన్ని అమ్మ సిద్ధి పొందినప్పుడు ఆచరించారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణం నుండి 7 కి.మీ.ల దూరంలోని చివటం గ్రామంలో అమ్మ సమాధి మందిరం కలదు.

(జూన్ 6వతేదీ జ్యేష్ఠ శుద్ధ సప్తమి సోమవారము శ్రీ చివటం అమ్మ ఆరాధనోత్సవం సందర్భముగా ప్రత్యేక వ్యాసం)

రచన : **కె.వి. రంగారావు**, ఒంగోలు

# యోగిరాజు శ్రీ పాకలపాటి గురువుగారు

ఆంధ్ర దేశములో పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరునకు సమీపమున గల ముందూరు గ్రామములో శ్రీవత్సస గోత్రానికి చెందిన శ్రీ దామరాజు గంగరాజు, శ్రీమతి వెంకమ్మగారు అను బ్రాహ్మణ దంపతులు ఉండేవారు. వేద పండితులు. అన్నదాన, విద్యాదాన విషయములలో వారి వంశము పునీతమైనది. ఆ పుణ్య దంపతులకు స్వస్తిశ్రీ చాంద్రమాన విరోధికృత నామ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమ ఆదివారము (తేది 11-06-1911) జ్యేష్ఠ నక్షత్రయుత శుభ లగ్నంలో 3వ సంతానముగా ఒక కుమారుడు ఉదయించెను. ఆ శిశువునకు ''వేంకట రామయ్య'' అని నామకరణము చేసిరి.



శ్రీ బాబు ముందూరులో ప్రాథమిక విద్యను అభ్యసిస్తుండగా వీరి తండ్రిగారు కాలము చేసిరి. మేనత్త శ్రీ రామయ్యమ్మ ప్రాపకంలో ఏలూరులో 8వ తరగతి వరకు చదువును కొనసాగించి చదువుకు స్వస్తి పలికేరు శ్రీబాబు.

శ్రీ బాబుగారు ఆజన్మ బ్రహ్మచారి. దీపము క్రింద క్రీనీడ ఉన్నట్లు వారి ఇంటిలోనివారు వీరిని అవగాహన చేసుకోలేకపోయారు. పైగా అవమానించేవారు కూడ. ఇటువంటి స్థితిలో అక్కడ ఉండటము సరికాదు అని తలచి తనను అభిమానించే శ్రీ గారపాటి పుల్లయ్య చౌదరిగారి ఇంట కొన్నాళ్ళు ఉండిరి. ఒకనాటి నడిరేయి తన వారిని, తన వూరును, పుల్లయ్యగారిని విడచి రైలులో ప్రయాణించి నర్సీపట్నం ప్రాంతానికి చేరిరి. అప్పటికి ఆ ప్రాంతము అటవీ సంపదతో అలరారుచుండేది. బాబుకు పచ్చని ప్రకృతి అన్న నిష్కల్మషమైన గిరిజనులన్న ఎంతో ఇష్టము. కాలినడకన ఆ ప్రాంత పర్వతారణ్యాలన్నీ తిరిగి చూశారు. 'తన కన్నా ఈ ప్రపంచం వేరుకాదు' అనే భావము నిరంతరము ఉండుటచే ఆయన ఏనాడు దేనికీ భయపడలేదు. అప్రయత్నంగా లభించే వస్తువులతో అహింసాయుతంగా జీవించేవారు. ఏ కొండ శిఖరాన్నో ఏ సెలయేటి తీరాన్నో కూర్చొని తపస్సు చేసుకొనేవారు. వారు నడయాడే పరిసరాల్లో క్రూర జంతువులు సహితం సాధువులై మసలుకునేవి.

ఆ సేతు హిమాచలము శ్రీ బాబు పలుమార్లు పర్యటించారు. వారు ఎక్కువగా తమశక్తిని సమర్థతను నిష్కల్మషమైన గిరిజనుల సేవకు వినియోగించేవారు. నర్సీపట్నానికి సమీపములో గల 'పాకలపాడు' లో వారు ఆశ్రమాన్ని నిర్మింపజేసుకొని కొన్నాళ్ళు ఉండుటచే వారిని అందరు 'శ్రీ పాకలపాటి గురుదేవులు'గా పిలువనారంభించారు. దండకారణ్య అటవీ ప్రాంతములో వారు అనేక సంవత్సరాలు పర్యటించి, అచ్చటి గిరిజనులకు వ్యవసాయము, గృహనిర్మాణము, మానవ ధర్మములు నేర్పి అనేక వ్యసనముల బారి నుండి, మూఢ నమ్మకముల నుండి వారిని రక్షించారు. అనేక ఆపదల నుండి చివరకు మృత్యువు నుండి కూడా కొందరిని రక్షించుటచే బాబుగారిని వారంతా తమపాలిట దైవముగా ఆరాధించుచున్నారు. శ్రీ బాబుగారి మాట వారికి వేదవాక్కు. ఆయన ఇచ్చిన సూచనల మేరకు అనేక చోట్ల వందలకొలది గిరిజన గ్రామములు నిర్మాణమైనాయి. నేడు విశాఖ అటవీ ప్రాంతములో కనిపించే అనేక గ్రామములు శ్రీ బాబుగారు స్వయంగా శంఖుస్థాపన చేసినవే. భారత, రామాయణ గాథలను చక్కని గేయాలలో కూర్చి వారికి నేర్పించేవారు. బాబుగారు ఉండే గిరిజన ఆశ్రమములలో నిత్యము అన్నసమారాధన జరిగేది. శ్రీ బాబుగారే స్వయంగా చాలా సంవత్సరముల పాటు వండి అందరికి వడ్డించేవారు. తరువాత కాలంలో కొంతమంది శిష్యుల చేత ఆకార్యక్రమమును నిర్వర్తింప చేసేవారు.

బాబుగారి ఆశ్రమము అత్యంత నిరాడంబరముగా తాటి ఆకులతోగాని, రెల్లు గడ్డితోగాని నేయబడి ఉండేది. చుట్టూ గోడలు, గోమయంతో అలకబడి ఎంతో పవిత్రంగా పూర్వఋషులు యజ్ఞవాటిక లాగ ఉండేది. కేవలము కొన్ని వంటపాత్రలు కొన్ని పుస్తకాలు, ఒక మంచము బాబుగారి వస్త్రాలు పెట్టుకునేందుకు ఒక పెట్టె మాత్రమే ఆశ్రమములో ఉండేవి. బహు చిత్రమైన విషయము ఏమనగా బాబుగారిని దర్శించటానికి వచ్చే భక్తులు ఏ వేళలో ఎంతమంది వచ్చినా బాబుగారు వారందరికి అప్పటికప్పుడు షడ్రశోపేతమైన భోజనమును పెడుతూ ఉండేవారు. అగ్గిపెట్టెకి కూడా ఆరుమైళ్ళ దూరం వెళ్ళవలసిన అరణ్యాలలో వారి ఆశ్రమాలు ఉండేవి. అయినా అన్నపూర్ణాదేవి వలె ఆయన అక్షయంగా అందరికి అన్న సమారాధన చేస్తూ ఉండేవారు. ఒక ప్రక్క వచ్చిన వారితో కులాసా కబుర్లు చెబుతూనే వారు ఈ ఏర్పాట్లు అన్ని చేస్తూ ఉండేవారు. గాయత్రీ మంత్రసిద్ధి పొందిన బాబుగారికి ఇది ఒక అతి సామాన్యమైన విషయం.

శ్రీ బాబుగారు మహోన్నత సిద్ధ పురుషులు. ఆయన పైకి మాత్రము అతి సామాన్యులుగా కనిపించేవారు. ఉతికి ఇస్త్రీ చేసిన లాల్చి, చక్కని గ్లాస్కో పంచె, కాళ్ళకు బూట్లు, రిస్టు వాచీ, శుభ్రంగా షేవింగ్ చేసుకొని హుందాగా ఒక సంపన్నుని వలె, ఒక నాయకుని

వలె చూపరులకు కనిపించేవారు. సాధారణంగా తపశక్తి సంపన్నులు అనేసరికి మన మనస్సులో గెడ్డాలు, మీసాలు, రుద్రాక్షలు, విభూతిరేఖలు, కాషాయ వస్త్రాలు గోచరిస్తాయి. కాని ఇవన్నియు అవసరం లేకుండానే అతి సామాన్యంగా ఒక సిద్ధ పురుషుడు, ఒక తపస్సంపన్నుడు, ఒక యోగి జీవించవచ్చునని శ్రీ బాబుగారు తన ప్రవర్తన ద్వారా తెలిపారు.

సంకల్ప మాత్రము చేతనే వెళ్ళాల్సిన చోటునకు బాబుగారు కొన్ని ప్రత్యేక సందర్భములలో వెళ్ళుతుండేవారు. ఎంతటి ఆపదైనా 'పర్వాలేదులే' 'ఏం కాదు' అని వారు అన్నట్లయితే ఆ విపత్కర పరిస్థితి తొలగిపోయేది. వారి ఆశీర్వచనమునకు తిరుగులేదు. అత్యంత కరువు కాలంలో భాగవత సప్తాహమను యజ్ఞము పేర వేలాది మందికి వారముల తరబడి సమృద్ధిగా అన్న సమారాధన జరిపించిరి. నాటి బ్రిటీష్ అధికారులు వారిని పరీక్షించి చేయునది లేక వారి మహత్యమునకు నమస్కరించి వెనుదిరిగిరి.

శ్రీ సౌమ్య నామ సంవత్సర మాఘ బహుళ చతుర్ధశి శుక్రవారం శివరాత్రి పర్వదినాన (అనగా తేది 6-3-1970) నర్సీపట్నం సమీపమున గల సుబ్బారాయుడుపాలెం నందు సరిగ్గా అర్ధరాత్రి లింగోద్భవ సమయము నందు శ్రీ బాబుగారు గోవిందనామ స్మరణ చేయుచూ దేహ త్యాగమును చేసిరి. వారి అంత్యక్రియలు నర్సీపట్నంనకు సమీపమున గలఉత్తరవాహినీ తీరములో జరిగినవి. నేడచ్చట వారి సన్నిధిని ప్రసాదించుచు ఒక ఆశ్రమము నిర్వహింపబడుచున్నది. భౌతికంగా శ్రీ బాబుగారు అదృశ్యులు అయినప్పటికిని అంతర్యామిగా స్మరణ మాత్రము చేతనే భక్తులకు ప్రసన్నులగుచున్నారు. వారు ఆశ్రితుల కల్ప వృక్షము. వారి ఆశ్రమములు మనశ్శాంతిని ప్రసాదించే దివ్య క్షేత్రములు. వారి నామస్మరణ భక్తుల పాలిట శ్రీరామ రక్ష.

ప్రస్తుతము నిత్య ధూపదీప నైవేద్యములతో, నిరంతర నామ సంకీర్తనలతో, ప్రతి పౌర్ణమి రోజున సమారాధనలతో ప్రవర్ధమానము నొందుచున్నది శ్రీ బాబుగారి ఆశ్రమము.

నర్సీపట్నం ఫైర్‌స్టేషన్ దగ్గరలో ఉత్తరవాహిని ఒడ్డున, శ్రీ బాబుగారి సమాధి మందిరము కలదు. ప్రతి పౌర్ణిమ రోజున హోమము, భజనలు, సమారాధన, శ్రావణ పౌర్ణిమి రోజున శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు (పవర్‌సిటీ, వైజాగ్)వారి ఆధ్వర్యములో పాదుకామహోత్సవము జరుగును. ప్రతి సంవత్సరము డిసెంబరు 25,26,27 తేదీలలో శ్రీ యు.వి.ఏ.యన్. రాజుగారిచే సహజీవన యోగా తరగతులు నిర్వహించబడును.

శ్రీ పాకలపాటి గురువుగారి ఆరాధనోత్సవము సందర్భముగా మహాశివరాత్రికి పెద్ద జాతర జరుగుతుంది. మూడు రోజులపాటు జరిగే ఆ కార్యక్రమాలకు స్థానికులే కాక, సుదూర ప్రాంతాలనుండి వేలాదిగా భక్తులు విచ్చేసి, జాగరణ చేసి, ఉత్తరవాహినిలో స్నానం ఆచరించి, బాబుగారిని దర్శించుకొని ప్రసాదం స్వీకరించి వెళతారు. ఆనాడు వేలాదిమందికి విశేష అన్నదానం జరుగుతుంది. అదేవిధముగా బాబుగారి జయంతి అయిన జ్యేష్ఠ పౌర్ణమి నాడు కూడ అత్యంత వైభవోపేతంగా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నవి.

శ్రీ పాకలపాటి గురువుగారి ఆశ్రమము నర్సీపట్నం – తుని రోడ్డు మార్గములోగల, ఫైర్‌స్టేషన్ దగ్గరనుండి అర కిలోమీటరు దూరములో కలదు.

(జ్యేష్ఠ పౌర్ణమి జూన్ 14వ తేదీ మంగళవారము శ్రీ బాబుగారి నూటపదకొండవ (111) జయంతి సందర్భముగా సమర్పణ)

రచన : **శ్రీ యు.వి.ఏ.ఎన్. రాజు**, విజయనగరం

మరిన్ని వివరములకు : **శ్రీ శాంభవి భక్తసమాజము**

**శ్రీ పాకలపాటి గురువు గారి ఆశ్రమము (ఉత్తరవాహిణి),**

ఫైర్ స్టేషన్ దగ్గర, నర్సీపట్నం.

**శ్రీ వై. వి. రమణ మాష్టారు** : 9849431758

**STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF SRI BHARADWAJA SADGURUVANI**

**(Quarterly)**
**Form IV**
**(See Rule 8)**

| | | |
|---|---|---|
| 1. | Name of the Publication | : **SRI BHARADWAJA SADGURUVANI** |
| 2. | Periodicity of its publication | : **QUARTERLY** |
| 3. | Printer's Name | : **V.S. LAKSHMI BRAMARAMBA** |
| | Nationality | : **INDIAN** |
| | Address | : **SRI BHARADWAJA PUBLICATIONS** Plot No. 13, Power City, Parawada Visakhapatnam-531 021. |
| 4. | Publisher's Name | : **V.S. LAKSHMI BRAMARAMBA** For Sri Bharadwaja Publications |
| | Nationality | : **INDIAN** |
| | Address | : **Plot No. 13, Power City, Parawada Visakhapatnam-531 021.** |
| 5. | Editor's Name | : **V.V. POORNACHANDRA RAO** |
| | Nationality | : **INDIAN** |
| | Address | : **SRI SHIRDI SAI SEVA TRUST, Power City, Parawada, Visakha-21.** |
| 6. | Name and address of Individuals : Who own the News Paper and Partners and share holders holding more than one Percent of the total capital. | **SRI BHARADWAJA PUBLICATIONS Power City, Parawada, Visakha-21.** |

I.V.S. Lakshmi Bramaramba, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belife.

VISAKHAPATNAM
Date : 01-04-2022

# బాల వికాసం - చెఱుకుముక్క

శ్రీ శిరిడీసాయిబాబా ప్రతిరోజూ లెండితోటకు వెళ్ళి వచ్చేవారు, ఆ సమయంలో శ్రీసాయి దారి మధ్యలో ఒక్కొక్క దిక్కువైపు తిరిగి వివిధ భంగిమలు చేసేవారు. ఆదారిలో భక్తుడైన ఫిలాజీ గురవే ఇల్లు కూడ ఉండేది. అక్కడ నుండి లెండీతోట కనిపించేది. ఒకరోజు బాబా ఫిలాజీగురవే ఇంటి దగ్గర ఉన్నప్పుడు లెండీవనంలోని ఒక చెట్టును ప్రభుత్వ కూలీలు నరుకుతున్నారు. అది చూసి ఫిలాజీగురవే కుమారునితో సాయి "ఆ చెట్టును నరకవద్దని చెప్పు, దానికికూడ ప్రాణము ఉంటుంది" అన్నారు. అందుకు ఆ కుర్రవాడు "వారు మనం చెబితే వింటారా? పెడతారా వృథా" అన్నాడు, వెంటనే సాయి కోపంతో "వెధవా తెలివి బాగా పెరిగింది'' అంటూ అతణ్ణి తన చేతిలోని సటకాతో కొట్టేరు, అంతేకాదు ప్రక్కనే నిలబడి చూస్తూ ఉన్న కోటీశ్వరుడైన బూటీని, మాధవఫస్లేను, బాబూసాహెబ్ జోగ్‌నూ కూడ సటకాతో కొట్టేరు శ్రీసాయి. వారు మౌనంగా సాయికి నమస్కరిస్తూ వినమ్రంగా ప్రక్కకు ఒదిగి నుంచున్నారు. కొంత సమయానికి శ్రీసాయి శాంతించారు. "ఒక జీవికి ప్రాణహాని కలుగుతున్నదని చెప్పినప్పుడు కనీసం ప్రయత్నం కూడ చేయకపోవడమే కాకుండా, పెద్దల మాటను గౌరవించకపోవటం సంస్కారంకాదు" అది తెలియజేయటానికే శ్రీసాయి ఆ బాలుని దండించింది. ఆ నెప్పి ఏమిటో తమకు తెలియాలనే బాబా తమను కొట్టారని శ్రీమాన్ బూటీ, జోగ్, ఫస్లేలుకూడ భావించారు.



నిజానికి శ్రీసాయికి వారిపై కోపంలేదు. తమతోకూడి సర్వ జీవకోటిలో సమభావాన్ని, ప్రాణశక్తిని గమనిస్తూ, సర్వత్రా నిండిన చైతన్నాన్ని గమనించే విధముగా వారిని సంస్కరించటమే శ్రీసాయి చర్యలోని అంతర్యం. మనపట్ల ఎవరైన, పెద్దలుగాని, సాటివారుగాని అనుచితముగా ప్రవర్తించారు అని మనం భావించినప్పుడు వారి అంతర్యాన్ని గమనించటానికి ప్రయత్నించాలి, లేకుంటే "పదిమాటలకు ఒకమాట సమాధానమివ్వాలి" అనే శ్రీసాయిసూక్తిని గుర్తుచేసుకొని ఉండిపోవాలి. సాధారణంగా మనలోని దోషాలను ఎత్తిచూపే వారిని మన శత్రువులుగాను, ప్రశంసించే వారిని ఆప్తులుగా భావిస్తాము, కాని నిజానికి సద్విమర్శలు చేసేవారే నిజంగా మన ప్రగతికి, పురోభివృద్ధికి తోడ్పడేవారు. తమ అవసరార్థమై పక్కన చేరి, అయిన దానికి కాని దానికి ప్రశంసిస్తూ పొగడ్తలతో ముంచెత్తే వారే మనకు నిజమైన శత్రువులు.

పొగడ్త చెఱుకు ముక్కలాంటిది. దాన్ని ఆస్వాదించాలి. అంతేగాని ఆసాంతం మింగేయాలనుకొంటే ప్రమాదం. తొలి గెలుపు అంతిమ విజయానికి సోపానం కావాలి. ముఖస్తుతికి లొంగిపోతే కళ్లు బైర్లు కమ్మి, పైకి చేర్చే నిచ్చెన కనిపించదు. "నిరంతరం నిన్ను పొగుడుతూ ఉండేవాడు లోలోపల నిన్ను ద్వేషించే శత్రువైనా అయిఉండాలి, లేదా నీ నాశనం కోరే కపటి అయినా అయి ఉండాలి" అంటాడు విదురుడు మహాభారతంలో. మాయాజూదంలో దుర్యోధనుడిని, గెలిపించిన శకుని ముఖస్తుతి మాటలతో, కపట ప్రేమతో కౌరవుల నాశనానికి కారకుడయ్యాడు. నిజానికి మహాభారత యుద్ధానికి పరోక్షంగా శ్రీకృష్ణుడికి సహాయపడింది. శకునే! ''పశ్చాత్తాపాలకు తావులేని శాశ్వతమైన విజయాలు, విమర్శలను స్వీకరించే వారికే లభిస్తాయి" అని అనుభవజ్ఞులు అంటారు. ఎందుకంటే తప్పొప్పులు బేరీజు వేసుకోవడం విమర్శల వలనే అలవడుతుంది. మనల్ని మరింత ఎదగాలని మనసారా కోరేవారు పొగడ్తల కన్నా సద్విమర్శలతో స్ఫూర్తినిస్తారు.

కొడుకు విజయాన్ని కోరే తండ్రి అతిగా పొగడడు. పొగడ్తలు మనం ఇతరులతో వెర్రిగా పోటీపడటానికి మాత్రమే ప్రోత్సహిస్తాయి. ఎదుటివాడి బలాన్ని గుర్తించలేం. విమర్శలు మనతో మనమే పోటీ పడేలా చేస్తాయి. దీంతో ఎదగడం సులువవుతుంది. స్వతంత్ర నిర్ణయాలు తీసుకునేంత వివేకం లభిస్తుంది. అప్పుడు మనల్ని పొగిడేవారిని ఇష్టపడకపోవడమే కాక, మనల్ని ఇష్టపడని వారిని సైతం మనం ప్రశంసించగలిగే స్థాయికి ఎదుగుతాము.

పొగడ్తల వలన దురభిమానం పెరిగి, వినమ్రత తగ్గే ప్రమాదం ఉంది. ప్రమాదము ఎందుకవుతుందంటే మన బలహీనతల్ని మనం గమనించటము మరచిపోతాం కనుక, మన ఎదుగుదలకు తోడ్పడేవారు మన విజయంలో జరిగిన చిన్న పొరపాట్లను సైతం ఎత్తి చూపి "అట్లా చేయకుండా ఉంటే గెలుపు సంపూర్ణమయ్యే"దని చెబుతారు కనుక. మనలోని లోపాల్ని తెలుసుకుంటే నిజమేమిటో, భ్రమలేమిటో ఎరుకలోకి వస్తాయి. పర్యవసానంగా జ్ఞానం పెరుగుతుంది. అప్పుడు కానీ తెలియదు, మనం ఇంకా ఎంత ఎదగాల్సి ఉందో!

"సద్విమర్శలు మనం ఇంకా చేయాల్సిన పనుల గురించి చెబుతాయి". "జీవితంలో ఎదుగుతున్నవాణ్ని, ఎదిగే అవకాశాలు ఉన్న వ్యక్తిని పొగడ్తలతో ముంచెత్తరాదని" పెద్దలు అంటారు. **"ఒక గొప్ప విమర్శ మనలను ఉన్నత మార్గంవైపు నడిపిస్తుంది, అవసరంలేని పొగడ్త మనలను విజయాలకు క్రమేపీ దూరం చేస్తుంది".** మనకు ఉన్నది ఒక్కటే జీవితం దానిని పొగడ్తలకు, అసూయపరుల అసత్య ప్రచారాలకు లొంగిపోయేటట్లు చేసుకుంటే,

విజయవంతమైన జీవితాన్ని వ్యర్థం చేసుకున్నవారలము అవుతాము.

**"అభినందన మెరుగుపరచుకోవడానికి తోడ్పడుతుంది, ముఖస్తుతి అభివృద్ధికి అడ్డంకి అవుతుంది".** కుటిలురు, మూర్ఖుల్ని పొగుడుతుంటారు. మూర్ఖులు ఆత్మస్తుతి, పరనిందలో మునిగి ఉంటారు. అనుచిత పొగడ్త సాలెగూడు లాంటిది. దానికి లొంగిపోతే వెలుపలికి రావడం కష్టం, పొగడ్తలు వింటూ వినాశనానికి దారులు వేసుకొంటూ సాగితే– విమర్శల్ని స్వీకరించి, బాగుపడే అవకాశాలను కోల్పోతాం. వివేకవంతులు ఆత్మవిమర్శ, పరుల అభినందనలతో ఎదుగుతూ, నిత్యవికాసాన్ని పొందుతూ ఉంటారు. "ఈ లోకంలో సద్విమర్శ చేస్తూ, నిజాన్ని చెప్పడంకంటే కష్టమైన పనిలేదు, కుటిలత్వంతో ముఖస్తుతి చేయడంకంటే సులువైంది లేదని" కౌటిల్యుడి వ్యాఖ్య. నిరంతరం పక్కనే ఉంటూ పొగిడేవాడు, ఆ పొగడ్తలు వినేవాడు, ఇద్దరినీ ముఖస్తుతి నాశనం చేస్తుంది.

**"ఎవరైనా ఏదయినా సాధించి నప్పుడు అభినందించాలి గాని, ముఖస్తుతి చేయరాదు"**

మన శ్రేయస్సును కోరే, పాఠశాలలో ఉపాధ్యాయుడు మనలను మందలించేది, మరింత ఉన్నతంగా ఎదిగి, ఉన్నత స్థితిని అందుకోవాలనే తపన వారిది, అందుకనే, మనం అత్తెసరు మార్కులతో తృప్తి పడదామన్నా, అంతిమ విజయం అందుకునేలా శిక్షణ చేస్తారు, మన ఉన్నతికి బాటలు వేస్తారు. నాకెందుకులే అనుకునేవారు వదిలి వేస్తారు.

తండ్రికి కూడ తనయుడు తనను మించినవాడు కావాలనే తపన తీవ్రంగా ఉంటుంది, అందుకే బాహ్యంగా కఠినంగా వ్యవహరిస్తూనే, మనస్సులో అనంతమైన ప్రేమ కలిగి ఉంటారు. తనయుడు అది గుర్తించి, ఆ హితవాక్యాలను ఆలకించి, తగురీతిన నడవడి సరిచేసుకున్ననాడు ఎక్కడ ఉన్నా అంతర్లీనముగా పెద్దల ఆశీస్సులు తోడయ్యి లక్ష్యాన్ని సాధించుకోగలుగుతారు. ఏమంటారు బాలలు అందుకే మన పూర్వీకులు "పెద్దలమాట బంగారుబాట – చద్దిఅన్నం మూట" అన్నారు. అది మన ఆకలి తీరుస్తుంది, శరీరానికి చలువచేస్తుంది, కర్తవ్యాన్ని నిర్వహింపచేసి, లక్ష్యంవైపు నడిపిస్తుంది.

సర్వులపై జగద్గురువైన శ్రీసాయి ఆశీస్సులు వర్షించాలని కోరుకుంటూ

**శ్రీమతి కె. సాయిప్రత్యూష**, గోవా

## తెలుసుకో ఈ జీవితసత్యం

విత్తనాన్ని తినాలని చీమలు చూస్తాయ్, మొలకలు తినాలని పక్షులు చూస్తాయ్, మొక్కని తినాలని పశువులు చూస్తాయ్ అన్ని తప్పించుకుని ఆ విత్తనం వృక్షమైనపుడు చీమలు, పక్షులు, పశువులు ఆచెట్టుకిందకే నీడకోసం వస్తాయి.

జీవితం కూడా అంతే! సమయం వచ్చేవరకు వేచి ఉండాల్సిందే, దానికి కావాల్సింది ఓపిక మాత్రమే. జీవితంలో వదిలివెళ్ళిన వాళ్ళ గురించి ఆలోచించకు జీవితంలో ఉన్న వాళ్ళు శాశ్వతం అని భావించకు, ఎవరో వచ్చి నీ బాధను అర్థంచేసుకుంటారని ఊహించకు, నీకు నీవే ధైర్యం కావాలి. నీకు నువ్వే తోడుగా నిలబడాలి. లోకులు కాకులు, మనషిని చూడరు, మనస్సును చూడరు, వ్యక్తిత్వాన్ని చూడరు, కనిపించింది, వినిపించింది నమ్మేస్తారు, మాట అనేస్తారు. ఒక్కోసారి మన కళ్ళే మనల్ని మోసం చేస్తాయి. మరొకసారి చెప్పుడు మాటలు జీవితాలను తలకిందులు చేస్తాయి. అబద్ధాలతో, మోసాలతో కీర్తి, ప్రతిష్ఠలను ఎంత గొప్పగా నిర్మించుకొన్నా, అవి కుప్పకూలిపోవడానికి ఒక్క "నిజం" చాలు. అందుకే కష్టమైనా సరే నీతిగా బ్రతకడమే మనిషికి ఉత్తమ మార్గం. ఒక చిన్న మొక్కనాటి ప్రతిరోజూ వచ్చి కాయకాసిందా అని చూడకూడదు. ఎందుకంటే అది ఎదగాలి, మొక్క వృక్షం కావాలి, పుష్పించాలి, పిందెలు రావాలి, అవి కాయలై, పండితే తినగలం. అలాగే నేను ఇది కావాలి అనే కోరిక కూడా మొలకై వృక్షమై ఫలవంతం ఔతుందని తెలిసి మసలుకోండి.

జీవితంలో కష్టము, కన్నీళ్ళు, సంతోషము, బాధ ఏవి శాశ్వతంగా ఉండవు. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండిపోదు. ఆనందం, ఆవేదన కూడా అంతే. నవ్వులూ కన్నీళ్ళూ కలగలసినదే జీవితం. కష్టమూ శాశ్వతం కాదు, సంతోషమూ శాశ్వతం కాదు.

ఓడిపోతే గెలవడం నేర్చుకోవాలి, మోసపోతే జాగ్రత్తగా ఉండడం నేర్చుకోవాలి, చెడిపోతే ఎలా బాగుపడాలో నేర్చుకోవాలి. గెలుపును ఎలా పట్టుకోవాలో తెలిసిన వాడికంటే ఓటమిని ఎలా తట్టుకోవాలో తెలిసినవారే గొప్ప. దెబ్బలు తిన్న రాయి విగ్రహంగా మారుతుంది, కానీ దెబ్బలు కొట్టిన సుత్తి మాత్రం ఎప్పటికీ సుత్తిగానే మిగిలిపోతుంది. ఎదురుదెబ్బలు తిన్నవాడు, నొప్పి తెలిసిన వాడు మహనీయుడు అవుతాడు. ఇతరులను ఇబ్బంది పెట్టేవాడు ఎప్పటికీ ఉన్న దగ్గరే ఉండిపోతాడు.

డబ్బుతో ఏమైనా కొనగలమనుకుంటున్నారా అయితే కొనలేనివి ఇవిగో

మంచం పరుపు కొనవచ్చు, కానీ నిద్రను కాదు
గడియారం కొనవచ్చు, కానీ కాలం కాదు
మందులు కొనవచ్చు, కానీ ఆరోగ్యం కాదు
భవంతులు కొనవచ్చు, కానీ ఆత్మీయత కాదు
పుస్తకాలు కొనవచ్చు, కానీ జ్ఞానం కాదు
పంచభక్ష్యపరమాన్నాలు కొనవచ్చు, కానీ జీర్ణశక్తిని కాదు

ఆకులు తింటేనే బ్రహ్మజ్ఞానం వస్తే, అందరికన్నా ముందు మేకలే జ్ఞానులుకావాలి.

స్నానాలతో పాపాలు పోతే ముందు చేపలే విముక్తులు కావాలి

తలక్రిందులుగా తపస్సు చేస్తేనే పరమాత్మ ప్రత్యక్షమైతే ముందు గబ్బిలాలకే ఆ వరం దక్కాలి.

ఈ విశ్వమంతా ఆత్మలో ఉంది, నీలో ఉన్న ఆత్మను వదిలి, పరమాత్మ అంటూ పరుగులు పెడితే ప్రయోజనమే లేదు, నీలో లేనిది బయటేమీ లేదు, బయటఉన్నదంతా నీలోనూ ఉంది.


తెలిసి మసులుకో, కలిసి జీవించు....

సర్వేజనా సుఖినోభవంతు

ఎవరు రాశారో తెలియదు కాని, అంతర్జాలములో కనిపించి, చదివించిన ఈ సత్యాలు మీతో పంచుకోవాలని మీముందు ఉంచుతున్నాము.

# మొగిలిచర్ల శ్రీ దత్తాత్రేయస్వామి

మొగిలిచర్ల శ్రీ దత్తాత్రేయ స్వామిగా ప్రసిద్ధికెక్కిన స్వామి అసలు పేరు వేణుగోపాలస్వామి. జన్మస్థలం సిద్ధవటం తాలూకాలోని ఇసుకపల్లె. తండ్రి తుమ్మల వెంకటనాయుడు. తల్లి వెంకటసుబ్బమ్మ. స్వామికి చిన్నతనం నుంచీ భక్తి మార్గంపైనే ఆసక్తి. సెకండ్ ఫారం చదువుతుండగా స్వామికి పాఠ్యపుస్తకాలు చదువబోతే దృష్టి మందగించేది. భగవద్గీత, వేదాంత గ్రంధాలు చదివేటప్పుడు కనిపించే కళ్ళు పాఠాలు చదివేటప్పుడు ఎందుకు కనుపించవని సోదరులు మందలించేవారు. ఇటు సేద్యానికీ, అటు చదువుకూ పనికిరాకుండా పోతున్న స్వామిని చూచి తిరిగి మెట్రిక్ పరీక్షకు తప్పని సరిగా కట్టించారు సోదరులు. అయితే మరలా కళ్ళు కనిపించడం లేదని పుస్తకాలు మూలపారేశారు స్వామి.



ఆయన లోపల దావానలంలా రగులు కొంటున్న "మోక్షసాధనం" అన్న కోర్కె అతనిని నిలువనివ్వలేదు. ఏర్పేడులోని వ్యాసాశ్రమం అతని మనసు నాకర్షించింది. స్వామి అక్కడ ఒకటిన్నర సంవత్సరమున్నారు. ఆ కాలంలో ఆయన అక్కడవున్న వేదాంత గ్రంధాలన్నీ చదివేశారు. ఒక్కసారి చదివితే చాలు ఆ పుస్తకంలోని సారాంశమంతా తిరిగి అప్పచెప్పగల అసాధారణ "ధారణ"తో యోగాన్నిగురించీ, యోగాభ్యాసాలగురించీ తన మానసిక అనుభూతుల గురించీ అమూల్యమైన ఉపన్యాసాలు వ్యాసాశ్రమ విద్యార్థులకు యివ్వడం ప్రారంభించారు స్వామి. ఆయన ఉచ్చారణ, వాక్పటిమ, సాధన, దివ్యతేజస్సు చూచి ఈ యువయోగి ఆశ్రమంలోనే వుండిపోయి యిలాగే గురుబోధ చేస్తుంటే బాగుండునన్న ఆలోచన ఆశ్రమ నిర్వాహకులకు వచ్చి అర్హమైన పదవి యివ్వ చూశారు. "ఈ గురుపీఠాలు, గురుబోధలు, బాధ్యతలూ నాకు వద్దు. నాకు కావలసింది ముక్తి ఒక్కటే! అది ఈ జన్మలోనే సాధించాలి. ఈ జన్మలోనే తరించాలి. అదే నా ధ్యేయం, అదే నా లక్ష్యం. అదే మానవ జీవితానికి పరమార్థం!" అని తనకుతాను కఠినంగా శాసించుకొని తిరిగి యింటికి వచ్చేశారు స్వామి.

తరువాత రెండు మూడు మాసాలు మాలకొండవద్ద సత్రంలో వుండి, పగటివేళ మల్యాద్రి పైకి వెళ్ళి ధ్యానాభ్యాసం కొనసాగించారు. అప్పుడే ఆయనకు "బాల బ్రహ్మస్వామి" గురువుగా సాక్షాత్కరించారు. గురువువల్ల గుహ్యమైన ఎన్నో వేదాంత విషయాలు, యోగాలు ప్రత్యక్షానుభవాలుగా తెలుసుకున్నారు. గురు కటాక్షంతో ప్రకృతిని జయించే శక్తి సంపాదించుకున్నారు. గురువిచ్చిన ఉపదేశం తీసుకొని, ఆయన బోధించిన మార్గాన్ని స్థిరం చేరుకున్నారు. తరువాత స్వామిని సిద్దనకొండూరులోని బంధువులు ఆహ్వానించి అతిధ్యమిచ్చారు. దురదృష్టవశాత్తు ఆయింటి యజమాని హఠాత్మరణం పొందడంతో ఈ యోగిరాకవల్ల ఈయన పూజవల్ల యిలాంటి దారుణం జరిగిందని స్వామిని నిందించారు.

భగవానుడు తనకు పెట్టిన పరీక్షకు అతని హృదయం తల్లడిల్లిపోయింది. ఆ సంఘటన స్వామి జీవితంలో ఓ పెద్ద మలుపుగా నిలచిపోయింది. మనుష్యులకు అతి సన్నిహితంగా వుంటే ధూషణ భూషణలు తప్పవు. తిరిగి మాల్యాద్రికి వెళ్ళి పార్వతీదేవి మఠంలో ఆ జగన్మాత తల్లిగా, శివాలయంలోని పరమేశ్వరుడే తండ్రిగా, మాల్యాద్రి లక్ష్మీనరసింహుడు తన రక్షకుడుగా భావించి తీవ్ర తపస్సు మొదలు పెట్టాడు. త్వరలోనే ఆ జగన్మాతకు కరుణ కలిగి, షోడశ కళలతో దర్శనమిచ్చి, మరికొంతకాలం ధ్యానం అభ్యసించాలనీ, అందుకు అనువైన ప్రదేశం త్వరలోనే లభిస్తుందనీ, అక్కడికి వెళ్ళి ధ్యానాన్ని కొనసాగించమనీ చెప్పింది.

స్వామివారికి ఏమహిమలూ చూపటం యిష్టంలేదు. మహిమలు, గారడీలవల్ల మోక్షగామి అయినవాడు ప్రగతి సాధించలేడనీ, ప్రలోభాలలో చిక్కుకుని పతనమౌతాడనీ చెప్పేవారు. స్వామి కులమతాలను గురించి పట్టించుకునేవారు కాదు. ఎక్కడ పరిశుభ్రత పరోపకారము, దయ, దైవభక్తి, సత్యవాక్కు, సత్ప్రవర్తన వుందో అదే అగ్రకులమనీ, ఆ వ్యక్తే పూజనీయుడనీ, అవేవీ లేనివారు ఏ కులములో పుట్టినా ఏ మతం తీసుకున్నా నీచులని చెబుతుండేవారు. ఏ మనిషికైనా 'తపస్సు'తో మాత్రమే బ్రాహ్మణత్వం వస్తుందేగాని జన్మవల్ల రాదని బోధించేవారు.

6-5-76వ తేదీ వైశాఖ శుద్ధ సప్తమి తెల్లవారు ఝామున స్వామివారు శివైక్యం చెందారు. ఆ సమయంలో బ్రహ్మాండమైన దివ్యతేజస్సు, నీలిరంగు కాంతి మందిరమూ, మందిర పై భాగము ఆ పరిసర ప్రాంతాలు అంతటా ఆవరించగా చాలామంది గ్రామస్తులు చూశారు. స్వామివారు శివైక్యం చెందుతారనగా తమ యిష్టదైవం అయిన శ్రీ దత్తాత్రేయస్వామిని ప్రత్యక్ష్యం చేసుకున్నామనీ, తాము వారిలా మారుతున్నామనీ, ఇక ముందు తనను "దత్తాత్రేయస్వామి" అని పిలువ వలసిందనీ, శనివారం తప్ప మిగతా అన్ని రోజులూ మందిరం వద్దకు రావచ్చునీ, పూజలు జరుప వచ్చుని వ్రాసిపెట్టారు. స్వామివారు జీవించి వుండగా ఆదేశించిన ప్రకారమే స్వామిని సమాధి చేయడం జరిగింది. స్వామివారి సమాధి మందిరము మొగిలిచర్ల గ్రామంలో కలదు.

**మార్గము :** ప్రకాశంజిల్లా ఒంగోలు నుంచి 40 కి.మీ. దూరములో కందుకూరు, అక్కడి నుండి 40 కి.మీ. దూరములో మొగిలిచర్ల గ్రామము కలదు. కందుకూరు నుండి బస్సు సౌకర్యము కలదు.

మరిన్ని వివరములకు : వ్యవస్థాపక ధర్మకర్త,


**శ్రీ దత్తాత్రేయస్వామి మందిరం**

చరవాణి : 94402 66380, 94419 16557

(మే 8వ తేదీ వైశాఖ శుద్ధ సప్తమి, ఆదివారము (తిథిప్రకారం) మొగలిచర్ల శ్రీ దత్తాత్రేయస్వామి వారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **శ్రీ మొగిలిచర్ల దత్తాత్రేయస్వామి చరిత్ర**

రచన : **శ్రీమతి పవని నిర్మల ప్రభావతి**




## కాశీకి వెళ్ళాను రామాహరి!

కాశీకి వెళితే కాయో, పండో వదిలెయ్యాలి అని పెద్దలు అంటారు? అందులో మర్మమేమిటి ?

అసలు శాస్త్రంలో ఎక్కడ కూడా.. కాశీకి వెళితే కాయో, పండో వదిలేయాలి అని చెప్పలేదు.. శాస్త్రం చెప్పిన విషయాన్ని కొందరు తెలిసి తెలియని పరిజ్ఞానంతో కొంచెం వాళ్ళకు అనుకూలంగా మార్చుకున్నారు. కాశీ క్షేత్రం విషయంలో శాస్త్రము చెప్తున్నది ఏమిటి అంటే “కాశీ వెళ్లి గంగలో స్నానంచేసి “కాయాపేక్ష మరియు ఫలాపేక్ష” ను గంగలో వదిలి, ఆ విశ్వనాథ దర్శనం చేసుకొని ఎవరి ఇళ్ళకు వాళ్ళు తిరిగి వెళ్ళాలి” అని.

ఇక్కడ కాయాపేక్షా-ఫలాపేక్ష అంటే - ఈ కాయముపై (శరీరముపై ఆపేక్ష) ఫలాపేక్ష (కర్మఫలముపై అపేక్షను) పూర్తిగా వదులుకొని, కేవలం నిజమైన భక్తితో ఆ ఈశ్వర చింతన కలిగి ఉండమని పెద్దలు చెప్పారు.

కాలక్రమేణా అది కాస్తా కాయ, పండుగా మారిపోయింది. అంతే కానీ కాశీ వెళ్ళి, ఆ నెపంతో ఇష్టమైన కాయగూరలు, తిను బండారాలు గంగలో వదిలి వేయడం వలన మనకు పెరిగే పుణ్యంగాని తరిగే పాపంగాని ఏమి ఉండదు. కనుక శాస్త్రం నిజంగా ఎలా చెప్తుందో అర్థం చేసుకొని ఆ క్షేత్ర దర్శనము, ఆ సంప్రదాయం పాటిస్తే నిజమైన ఆధ్యాత్మిక చైతన్యం వస్తుంది. అంతే కాని మామిడి పండుని, వంకాయని గంగలో వదిలేస్తే వచ్చే ఉపయోగం ఏమీ ఉండదు. కనుక ఈసారి కాశీ వెళితే మనకి శత్రువులు అయిన ఈ శరీరంపై గల ఎక్కువ ప్రేమని, మనం చేసే పనులమీద, లేనిపోని కర్మఫలం అపేక్షని మాత్రమే వదులుకొని, మాత అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వరుడి దర్శనం చేసి, అసలైన ఆధ్యాత్మిక జ్ఞానం కలిగించమని ప్రార్థిదాము.

**పంచమహాయజ్ఞాలు :** బ్రహ్మయజ్ఞం, దేవయజ్ఞం, పితృయజ్ఞం, భూతయజ్ఞం, మనుష్యయజ్ఞం.

**బ్రహ్మయజ్ఞం :** వేదాధ్యయనము, సద్గ్రంథ పారాయణ వలన విషయ పరిజ్ఞానము తాను పెంచుకుంటూ ఇతరులకు పంచటము

**దేవయజ్ఞం :** యజ్ఞయాగాదులు, నిత్యాగ్నిహోత్రము ద్వారా భగవంతుడికి హవిస్సులు అందజేయటం

**పితృయజ్ఞం :** గతించిన పితృ దేవుల కొరకు చేసే శ్రాద్ధము, తర్పణము మొదలైన వాటిద్వారా పితృదేవతలను సంతృప్తి పరచటానికి చేసే కార్యక్రమము పితృయజ్ఞము.

**భూతయజ్ఞం :** భూమిపై సకల జీవుల పట్ల దయగలిగి వాటిని పరిరక్షిస్తూ వాటికి ఆహారము సమకూర్చటము భూతయజ్ఞము.

**మనుష్యయజ్ఞం :** గృహస్తు తనపై ఆధారపడి జీవించే (బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాస) మూడు ఆశ్రమములవారిని, అతిథి అభ్యాగతులను ఆదరించటము మనుష్య యజ్ఞం లేక స్వయజ్ఞమందురు. ఈ ఐదు యజ్ఞములు నియమంగా భక్తి శ్రద్ధలతో ఆచరించే వారికి పరమేశ్వర అనుగ్రహం లభించగలదని శాస్త్ర వాఖ్యం)

## మనకోసం :

1. ఫోన్ మాట్లాడేటప్పుడు ఎడమచెవి వైపునే ఫోన్ ఉంచండి.
2. మందులు చల్లని నీటితో వేసుకోవద్దు.
3. రోజూ 5 బాదం పప్పులు తింటే కేన్సర్ రాదు.
4. ప్రతిరోజు కొద్దిగా నిమ్మరసం తాగితే కొవ్వురాదు.
5. రోజు ఒకగ్లాసుపాలు తాగితే వెన్ను నొప్పులు రావు.
6. ప్రతిరోజు 2 ఖర్జూరం తింటే నీరసం రాదు.
7. ఫోన్‌చార్జింగ్ తక్కువ ఉంటే కాల్ చేయకండి, తీయకండి రేడియేషన్ వెయ్యిరెట్లు ఎక్కువ.
8. రోజూ ఒక ఏపిల్ తింటే వైద్యుడే వద్దు.

## గురువు

1. సూచిక గురువు - చదువు చెప్పేవారు
2. వాచిక గురువు - కులధర్మాలు, ఆశ్రమ ధర్మాలు చెప్పేవారు
3. బోధక గురువు - మహామంత్రాలు ఉపదేశించేవారు
4. నిషిద్ధ గురువు - వశీకరణ, మారణ ప్రయోగాలు చెప్పేవారు
5. విహిత గురువు - విషయభోగాల మీద విరక్తి కలిగించేవారు
6. కారణ గురువు - జీవ బ్రహ్మైక్యాన్ని బోధించేవారు
7. పరమ గురువు - జీవాత్మ, పరమాత్మ ఒక్కటే అని ప్రత్యక్ష అనుభవం కలిగించేవారు.

**అతిపురాతన వస్తువు :** ఈనాటికి ప్రతి రోజు మనం అతి పురాతనమైన వస్తువు ఒకటి మన నిత్యావసరానికి వాడుతున్నామని. అదే పిన్నీసు. దీనిని 1849వ సంవత్సరములో న్యూయార్కుకు చెందిన “వాల్టర్‌హంట్” కనుగొన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఎట్టిమార్పులు చెందకుండా ఉన్న వస్తువులలో ఇది ఒకటి.

**అజ్ఞానం :** పూజలు చేసేటప్పుడు దేవుడు వింటాడు అని నమ్మే మనం ఇతరులకు హాని చేసేటప్పుడు మాత్రం ఆ దేవుడు చూస్తాడని తెలుసుకోలేక పోవటం అజ్ఞానం.

# నాకు తెలిసిన నిజం

మాస్టరుగారు (ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు) నానావల్లీ గురించి చెబుతూ "పది మంది సాయిని పూజిస్తుండగా నానావల్లీ రావటం బాబాను ఆసనం మీద నుంచి లెమ్మని కసరటం – తను కూర్చోవటం బాబా వైఖరిలో ఎలాంటి మార్పు లేకపోవటం, బాబా పాదాలమీద పడి నమస్కారం చేసుకొని వెళ్ళిపోవటం, బాబాసమాధి చెందిన నెలలోపే తానూ శరీర త్యాగం చేయటం ఇవన్నీ చెబుతూ, నానావల్లీ బాబాకు పరీక్ష పెట్టాడు. బాగానే ఉంది. నెగ్గితే ఏమిచ్చాడు? తన ప్రాణాలనే పణంగా పెట్టాడు, ప్రాణాలను అర్పించాడు. లోకంలో ఒకటే చూస్తాము గానీ మరొకటి చూడము. అదీ పరీక్ష పెట్టడమంటే. పరీక్ష ప్రతివాడూ పెడతానంటాడు, అవతలవారు పరీక్షలో నెగ్గిన తర్వాత కూడ పూర్వం లాగే తానుఉంటాడు, అందుకు కారణం ఇచ్చేందుకు వాడి దగ్గర ఏమీ ఉండదు కనుక. శ్రద్ధ, భక్తి, నిష్టలు ఉండవు కనుక" అన్నారు. అందుకు మనమే ఒక ఉదాహరణ.



కాని మాస్టరుగారు అట్లా లేదు. బాబా అనుగ్రహాన్ని చవిచూచాక తన జీవిత పగ్గాలను ఆయనకు అప్పగించేసారు. ఎంతలా అంటే ఓ లేఖలో వ్రాసారు," free గా ఏ encumberances లేకుండా చక్కగా సాధన చేస్తున్న నన్ను family లోకి లాగి, wife ను chronic illness తో invalid ను చేసి, responsibilities తో నన్ను tie down చేసి, management తో dead lock తెచ్చి, without job 4 years నుంచి hold down చేసి, తన work ను మాత్రం demand చేస్తూ, associates psychological complex తో దూరమయ్యేలా చేస్తూ, harass చేస్తున్నా Sai నిర్ణయంను happy గా తీసుకుంటున్నాను". ఈ ఒక్క సంఘటన చాలు మాస్టరుగారు అంటే ఏమిటో/ఎవరో తెలుసుకోవడానికి. జీవిత సమస్యలు అగ్నిపరీక్షలై నిలిచినప్పుడు వాటిని, బాబా పట్ల తనకు గల విశ్వాసానికి ఏర్పడిన ఒక సవాలుగా స్వీకరించారు. ఆయన మహిమకు నేను బానిసనయ్యానని చెప్పింది అందుకే. అల్లా(హ్)యే మాలిక్ అని , ఆయన బానిసగా మాత్రమే మాస్టరుగారు జీవించారు. సర్వస్య శరణాగతి అది. అట్లా శరణుజొచ్చిన వానికి 'భగవంతుడు తనను తానైనా ఇస్తాడని' విష్ణుసహస్ర నామావళి చెప్పింది. బాబా కూడా అట్లే హామీ ఇచ్చారు, "వారే నేనుగా మారిపోతారు" అని. ఆ హామీ మాస్టరుగారి విషయంలో "నిజం" అయింది. అది గుర్తిస్తే సాధనలో మనం ఒక మెట్టు ఎక్కినట్లే.

అవి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారు భౌతికంగా ఉన్న రోజులు. మాస్టరుగారు, "స్వామివారు మన మధ్య ఉండగానే వారి దివ్యచరిత్ర ప్రచురించండి" అని అక్కడి వారికి ఎంతో చెప్పేరు, స్వామివారిని గురించి కరపత్రాలు వేయించి నెల్లూరు, చుట్టుప్రక్కల గ్రామాలలోను, స్వామి వారు సంచరించే గ్రామాలలోనూ ప్రతి ఇంటికి ఆ కరపత్రాన్ని చేర్చమని చెప్పేవారు. అయితే వాళ్ళు, "స్వామి వారు చాలా గుప్తంగా ఉంటారు. తన మహిమను వెల్లడి చేయటం వారికి ఇష్టం ఉండదు. వెల్లడి చేసినవారు స్వామివారి ఆగ్రహానికి గురికావలసి ఉంటుంది, కనుక మేము ఆ పని చేయలేము" అన్నారు. అందుకు మాస్టరుగారు, "ఆ కరపత్రాలు నేను పంచినట్లు నా పేరు వేయండి, ఏమౌతుంది! ఎంతో మంది బాగుపడుతుంటే నేనొక్కడిని నాలుగు జన్మలు వెనక్కుపోయి వస్తాను. నష్టమేముంది?!" అన్నారు. మన ఉన్నతి కోసం ఆయనెంతగా ఆరాటపడుతున్నారో కదా! విద్యానగర్ మందిరం ప్రారంభమప్పుడు విడుదల చేసిన ''సద్గురు దర్శనం'' సావనీర్‌లో శ్రీ వెంకయ్యస్వామివారి ఫోటో, వ్యాసం మొట్ట మొదటిసారిగా ప్రచురించి, తద్వారా స్వామివారిని వేలాదిమంది దర్శించుకునే భాగ్యం కల్గించారు. "బాబాను సశరీరులుగా దర్శించలేకపోయాను, పూర్ణపురుషుల రూపంలో బాబావారిని దర్శించాల"ని ఎంతగానో పరితపించాను, "మహాత్ముల ఆశీస్సులు లేకుంటే నేను బ్రతకలేను" అని ఒక సందర్భంలో అన్నారు. "మీ సాధనా విధానం ఏమిటి?" అని అడిగితే, "అందరికీ సాయి దొరకాలి, అదే నా సాధనా విధానం" అన్నారు తాను పొందినటువంటి – దర్శించినటువంటి సత్యాన్ని తన వరకే గిరిగీసుకోలేదు. అందరూ పొందాలని ఆరాటపడ్డారు. సాటివారూ మహాత్ములను ఆశ్రయించి తరించడానికి విశ్వమనే ఈ ద్వారకామాయి ద్వారాలు తానే స్వయంగా తెరిచి నిలబడ్డారు.

సంసారంలో ఎలా ఉండాలో శ్రీరామకృష్ణులు చెప్పేవారు, "ఈ ప్రపంచంలో నిత్య అనిత్యాలు (ఇసుక, చక్కెరలా) కలగలసి ఉన్నాయి. చీమలా చక్కెరను మాత్రం ఏరుకో, సచ్చిదానంద రసము, విషయ సుఖాల రసమూ (పాలు, నీరులా) కలిసి ఉన్నాయి. హంసలా కేవలం పాలు స్వీకరించి నీటిని వదిలివేయి. బాతులా ఉండు, నీరు దాని వంటిమీద పడుతుంది. వెంటనే అది నీటిని విదిలించి వేస్తుంది. బురదచేపలా ఉండు, బురదలో అది నివసిస్తుంది. కాని దాని దేహం శుద్ధంగా, ప్రకాశవంతంగా ఉంటుంది". అంత ఆదర్శంగా గృహస్థ జీవితాన్ని ఎలా నడపాలో మాస్టరుగారు మనకు ఆచరించి చూపించారు. సంసారంలో ధనం అవసరమే. ధనం విషయంలో "యదృచ్ఛా లాభ" అని భగవద్గీతలో చెప్పినట్లు దొరికిన దానితో సంతుష్టి పొందేరు. "యత్ర ఆయ–తత్ర వ్యయ" అంటే ఎలా సంపాదిస్తారో అలాగే ఖర్చుపెట్టేశారు.

కూడబెట్టుకోలేదు. "నా పేరు మీద పది రూపాయల బ్యాంకు బాలెన్స్ గాని, ఈ భూమి మీద జానెడు స్థలం గాని లేవని" వెల్లడి చేశారు. అయినా గాలిలో దీపాన్ని పెట్టి జీవించే ధైర్యాన్ని కూడ బాబా నాకు ఇచ్చాడన్నారు మాష్టారుగారు.

వారి జీవితాన్ని రేఖామాత్రంగా స్పృశించడానికి సాహసిస్తేనే వాక్కుకూ, మనస్సుకూ అందని ఇలాంటి విషయాలెన్నో!

1963, ఫిబ్రవరి 9న సాయి అనుగ్రహాన్ని చవిచూచాక (ఆ స్థితిని 'సమాధి' అంటారని శ్రీరామకృష్ణ పరమహంస చెప్పారు) బాబా తోటిదే లోకం అయ్యింది. ఇక బాబాను తాను దర్శించిన రీతిని లోకానికి పరిచయం చేసే మహాయజ్ఞాన్ని ఆరంభించారు. ఆ యజ్ఞ ఫలాలుగా 'శ్రీ సాయిలీలామృతము', 'శ్రీగురుచరిత్ర' రూపంలో ఆవిర్భవించిన అమృతాన్ని లోకానికి పంచిపెట్టారు. మనమున్న చోటును 'సాయిసన్నిధి'గా మార్చారు. ముముక్షువులు సద్గురుని ఆశ్రయించి తీరాలన్నటువంటి సనాతనము, వైదికము అయిన విధానానికి ప్రాణం పోశారు. నిర్దుష్టమైన శుద్ధ ఆధ్యాత్మిక సాయి సంప్రదాయాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సద్గురు తత్త్వమే దత్తస్వామిగా మహనీయుల రూపంలో భూమిపై ఎల్లప్పుడు ఉంటుందని, అటువంటి మహాత్ములను, అవధూతలను సేవించగల సంస్కారాన్ని అందరిలో మేల్కొలిపి, వారి కృపను పొందే మార్గాన్ని అందించిన మార్గదర్శి మాస్టరుగారు.

అదే సమయంలో 'దేవుడు నాస్తి(లేడు)' అన్న వాదం అసలు నిలబడదని, అందుకు కావలసిన ఆధారం కించిత్తు కూడా లేదని, హేతువాదానికి నాస్తిక వాదానికి నిలబడేలా, ఆధునిక విజ్ఞానశాస్త్రాలతో సమన్వయ మయ్యేలా 'ఏది నిజం?', 'మతం ఎందుకు?', 'విజ్ఞాన వీచికలు' ద్వారా నిగ్గుతేల్చారు. ఇట్టి వైజ్ఞానిక సమన్వయం ఈ కాలంలో అత్యంత అవసరమని, ఎంత శ్రమపడైనా హేతుబద్ధము–వైదికము, ధార్మికము–శాస్త్రీయము అయినటువంటి సంపూర్ణమైన అవగాహనను సంపాదించడ మొక్కటే మన నిజమైన కర్తవ్యం అని మాస్టరుగారు అంటారు.

"అన్ని జీవుల రూపాల్లోనూ ఆ సద్గురువే ఉన్నాడన్న అవగాహనతో జీవించడమొక్కటే ధర్మాచరణకు మూలం" అని చెప్పి, "ధర్మాచరణ యావత్తూ ఆ భగవంతుని పట్ల కృతజ్ఞతే" అంటారు. "ధర్మసూత్రాన్ని విస్మరిస్తే మతము, ఆధ్యాత్మికత సమాజాన్ని మోసం చేసే కపట నాటకమవుతుందని" హెచ్చరించారు. కనుక ప్రస్తుత పరిస్థితుల్లో నిర్దుష్టమైన సాయిభక్తి, ధర్మప్రబోధం వీటి ద్వారా ప్రజలను Educate చేయడమే ప్రధాన కర్తవ్యం అంటారు మాస్టరుగారు. ఇంతకు మించి నేటి మానవాళికి నైతిక పునరుజ్జీవనం కల్గించే మార్గం ఇంకొకటి లేదు అన్నారు. వారి జీవితం యావత్తూ అట్లానే అంకితం చేశారు.

"నేను చెప్పే ప్రతి ఒక్క మాటకి వేదంలో వాక్కు (ప్రమాణం) ఉన్నదన్నారు". "బాబా అనుజ్ఞ లేక నేనేదీ చెప్పలేదు, వ్రాయలేదు" అన్నారు. అంత నిర్దుష్టంగా సాయి బోధను అందిస్తున్నారు. అందుకే కాబోలు, పాకలపాటి గురువుగారు, మాస్టరుగారితో, "నీవు వెళుతున్న మార్గం రాజబాట" అన్నారు.

"వేద ఋషులు ఏమి పొందాలో, మనల్ని ఏమి చేసి, ఏమి పొందాలని చెప్పారో అది మీరు పొందేరా?" అని మాస్టరుగారిని అడిగినప్పుడు, "పొందేను" అని గుండెలపై చేయివేసుకొని నిక్కచ్చిగా చెప్పారు. అయితే గృహస్థాశ్రమ ధర్మం ననుసరించి తన పిడికిలి విప్పలేదు. తన దివ్యత్వాన్ని మరుగులోనే ఉంచారు మాష్టారుగారు.

శ్రీసుధీంద్రబాబుగారు మాస్టరుగారిని ఉద్దేశించి, "ఆయన పెద్ద దొంగ! తన దంతా దాచి పెట్టుకొని మాది బయటవేస్తుంటాడు" అన్నారు. వారు, వీరు అన్న తేడా లేకుండా మహాత్ములందరూ మాస్టరుగారిని తమంతటి వాడని, తమ కంటే అధికుడనీ అక్కున చేర్చుకుంటే, మనలాంటి పామరుల కోసం, సమస్త మానవాళి తరింపు కోసం చెక్క వంతెనగా ఉపయోగపడడానికే నడుం బిగించిన నిష్కాముడు, అట్టి స్థితిని ప్రసాదించిన సాయినాథునికి తననే దక్షిణగా సమర్పించుకున్న కృతజ్ఞతామూర్తి మన మాస్టరుగారు.

సరళమైన హృదయం, సాటివారి శ్రేయస్సుకై పడే తపన మాస్టరుగారిలో శ్రీరామకృష్ణుల్ని, గుడ్డిగా ఏ సిద్ధాంతానికి తల తాకట్టు పెట్టని నైజం, తాను అన్వేషించి తెలుసుకోవాలన్న 'ఇజం', అట్లా నేరుగా 'నేను'ను (సత్యాన్ని) దర్శించిన రమణ భగవానులను మాస్టరుగారిలో సంపూర్ణంగా ఆవిష్కరిస్తోంది. ఆకాశానికి ఆకాశమే సమానం, సముద్రానికి సముద్రమే సమానం. అట్లాగే, "భరద్వాజకు సమానం భరద్వాజనే" అని శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వాముల వారి ప్రత్యక్ష శిష్యులు శ్రీ నానూ మహరాజ్ అన్నారు. సిహెచ్. శ్రీనివాసులురెడ్డి (విద్యానగర్) గారు అన్నట్లు, మన కోసం మాస్టరుగారు "నిజానికి" 'ఎక్కిరాలా', 'నిచ్చెనలు' "దిగివచ్చారు".

"ప్రపంచమనే ముసుగు వేసుకొని ఈశ్వరుడు కూడా ఓ బాటసారిలా మనతో నడుస్తుంటాడు. అతన్ని గుర్తిస్తే మన ప్రయాణం సులభమౌతుంది" అని ఆప్తవాక్యం. అంత మర్మంగా మాస్టరుగారు మనతో నడుస్తున్నారు. మార్గం ఉంది–మార్గదర్శీ ఉన్నారు. " నన్ను అనుసరిస్తావా?" అని బాబా అడుగుతూనే ఉన్నారు. 'నేనెవరినీ మధ్యలో విడువను' అన్న హామీ ఇచ్చే ఉన్నారు. కిం. కర్తవ్యం!? "గుర్తెరిగి 'ఆయన' చేతిని పట్టుకోవడమే!"

కనుక మాస్టరుగారికి నిజంగా మనం ఏదయినా సమర్పించ దలచుకుంటే, అది "ఆయనకు తగ్గ బిడ్డలం కావటమే" మనం చేయవలసింది.

(ఏప్రిల్ 12వ తేదీ మంగళవారం పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **"నాకు తెలిసిన ఏదినిజం"**

రచన : **శ్రీ వై.వి. పూర్ణేంద్రకుమార్**, తిరుపతి

# మహాత్ముల ముద్దుబిడ్డడుకి 25 వసంతాలు

మనమధ్య మనలాగే జన్మించి, కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసి, జీవితంలో ఎదురయిన సంఘటన ద్వారా తీవ్ర అన్వేషకుడయ్యి శ్రీశిరిడీసాయిబాబా సమాధి దర్శనంతో సాయి విశ్వచైతన్యానుభూతిని పొంది, మహాత్ములు, అవధూతలు, రూపంలో శ్రీసాయి అందించే బోధను లక్షలాది మందికి చేరువచేసి, ఆ యా మహాత్ముల అనుగ్రహానికి పాత్రులయ్యేలా తీర్చిదిద్ది, మహాత్ములచే తమకంటే అధికుడని “మహాత్ముల ముద్దుబిడ్డ”అని కీర్తించబడి, కళాశాలలో సామాన్య లెక్చరర్ స్థాయి నుండే అసమాన్యమైన స్థితికి ఎదిగి, ఎందరికో ఆచార్యులై ''సాయిమాస్టర్''గా వినుతికెక్కిన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జీవితంపై, సమగ్ర పరిశోధనాత్మకమైన గ్రంథం ''మహాత్ముల ముద్దుబిడ్డడు”.




నెల్లూరుజిల్లా విద్యానగరులోని యన్.బి.కె.ఆర్. సైన్సు అండ్ ఆర్ట్సు కళాశాలలో (1971) శ్రీ భరద్వాజగారు ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేసే రోజులలో విద్యార్థి అయిన చప్పిడి థామస్‌రెడ్డి 4-9-1971లో మొదటిసారి మాష్టారుగారిని కలిసినప్పుడు, “సంఘంలో శక్తిమంతులుగా మారాలంటే కాలాన్ని సద్వినియోగపరుస్తూ, మన విధిని మనం నిర్వహించాలి, విరామ సమయాల్లో శ్రీ శిరిడీ సాయినాధుడి లాంటి మహాత్ముల జీవిత చరిత్రలు చదువుతుంటే బాగుంటుంది” అన్న మాష్టారుగారి మాటతో, క్రీస్తును ఆరాధించే థామస్‌రెడ్డి, మహాత్ముల జీవితచరిత్రలు చదివి, క్రీస్తులాంటి శ్రీశిరిడీసాయి విశ్వతత్త్వాన్ని, వారిస్వరూపులైన మహాత్ముల జీవితాల్ని పరిశీలించి, అంతటివారు ప్రత్యక్షంగా మాష్టారుగారే నని గుర్తించి, వారిపై పూజ్యభావం పెరిగి, వారి సాంగత్యాన్ని అనుభవిస్తూ విద్యానగరులో బి.ఏ పూర్తిచేసి, అటుపిమ్మట - శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయములో ఎం.ఏ.లో చేరినా, తరచు మాష్టారుగారిని కలుసుకుంటూ, వారి బోధలతో, శ్రీసాయిపట్ల పూజ్యభావం పెరిగి, పారాయణ, పూజలు మొదలైనవి ఇంటిల్లిపాది కూడ చేయటం ప్రారంభించారు. 1989లో మాష్టారుగారు సమాధి చెందిన తరువాత, తన సందేహాలకు మాష్టారుగారు ఉత్తరాలద్వారా తెలిపిన సమాధానాలను ఆచార్య లేఖావళిగా, ప్రచురించాలని భావించినప్పటికి, మాష్టారిగారి స్వప్న దర్శనంతో వారి చరిత్ర వ్రాయాలని భావించి, 1995లో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటిలో “ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారి రచనలు ఒక పరిశీలన” అన్న సిద్ధాంత వ్యాసాన్ని మాష్టారుగారి ధర్మపత్ని శ్రీ అలివేలు మంగతాయారుగారి అపారమైన అనుగ్రహ ఆశీస్సుల సహిత, వాత్సల్యపూర్వక సహకారంతో ఎమ్. ఫిల్ డిగ్రీ కొరకు సమర్పించి, డిగ్రీ పొందిన ధన్యజీవి శ్రీ చప్పిడి థామస్‌రెడ్డి,ఎమ్.ఏ.ఎమ్.ఫిల్. అటుపిమ్మట, అమ్మగారి ఆశీస్సులతో, మాష్టారుగారితో ప్రత్యక్ష స్నేహబాంధవ్యాలు ఉన్న (అప్పటి పరిస్థితులలోనే) దాదాపు 120 మందినివరకు కలసి వారందరూ తెలియజేసిన విషయాలు పొందుపరుస్తూ, రూపొందించబడి, 1997లో మొట్టమొదటగా ప్రచురితమయిన “మహాత్ముల ముద్దుబిడ్డడు” (ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మహరాజ్ జీవితచరిత్ర) అనే గ్రంథం వెలువడి నేటికి 25 వసంతాలుఅయ్యింది.

ఆ సందర్భముగా గ్రంథకర్త శ్రీ సిహెచ్. థామస్‌రెడ్డి మదిలోని మాట

“నేను 1995 జనవరిలో శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీలో “ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారి రచనలు ఒక పరిశీలన” అన్న సిద్ధాంతవ్యాసాన్ని ఎమ్.ఫిల్. డిగ్రీ కొరకు సమర్పించగా, డిగ్రీ అవార్డు చేశారు. ఈ విషయంలో అమ్మగారు (మాష్టారుగారి ధర్మపత్ని) ఎన్నో విషయాలు వాత్సల్యంతో అందించారు. మరికొందరిని కూడా కలిశాను. వ్రాతప్రతిని శిరిడీకి తీసుకెళ్ళి శ్రీసాయి ఆశీస్సులకై ప్రార్థించాను. శ్రీ శివనేశన్ స్వామివారు వ్రాతప్రతిని చూచి ఆశీస్సులిచ్చారు. ముఖ్యంగా అమ్మగారు స్వయంగా చెప్పిన విషయాలు, చిరంజీవులు వేదవతి, ద్వారక బాబులు చెప్పిన విషయాలు ప్రత్యేక ఆశీస్సులుగా భావిస్తున్నాను. ఈ గ్రంథ రచనలో అడుగడుగునా ఆశీస్సులందిస్తూ గ్రంథనామాన్ని కూడా దత్తస్వరూపులు, సాయిస్వరూపులు, యోగస్వరూపులు, నిత్యసత్యులగు శ్రీసాయిమాష్టరు (స్వప్నం ద్వారా) సూచించారని తెల్పుటకు ఆనందిస్తున్నాను.

ఒకసారి 1986 శ్రీ మాష్టారు గారితో ఒంగోలు సమీపంలోని కొత్తపట్నం దగ్గర బీచ్‌కి వెళ్ళినపుడు శ్రీమాష్టర్, చి॥ వేదవతి, ద్వారకబాబు నేను బోటులో కూర్చున్నాము. బోటు సముద్రంలో వెళ్తున్నది. మాష్టరుగారు నావైపు చూస్తూ, చేత్తో సముద్రం వైపు చూపిస్తూ “థామస్! ఈ సముద్రమంతా దత్తాత్రేయ తత్త్వమైతే, ఈ బోటు నీటిని ఎంత టచ్ చేస్తుందో అంత మాత్రమే మనం తెలుసుకున్నది” అని అన్నారు ఆరోజు. ఈరోజు నేను శ్రీమాష్టర్‌గారి జీవితం గురించి వ్రాసింది అంతే! వారి జీవితం సాగరం. అందులో నేను టచ్ చేసేది, బోటు నీటిని టచ్ చేసేంత మాత్రమే అని సవినయంగా తెల్పుకుంటున్నాను.

"సబ్ ధరతి కాగజ్ కరూం సబ్ లేఖని బనరాయ్
సాత్ సముందర్ కీ మసి కరూం గురుగుణ లిఖా న జాయ్"

"గురు మహిమ అపారం. ఈ భూమి నంతటిని కాగితంగా చేసుకొని, ఈ విశ్వంలోని వృక్షాలన్నింటిని లేఖినిగా చేసుకొని, సప్తసముద్రాల్లోని నీటిని సిరాగా ఉపయోగించి, గురుమహిమను వ్రాయటం ప్రారంభిస్తే ఈ కాగితం అంతా అయిపోయింది. లేఖిని అరిగిపోయింది. సిరా కూడా అయిపోయింది, కానీ గురుమహిమ గూర్చి వ్రాయటం పూర్తికాలేదు. ఇంకా మిగిలేవుంది" – అంటారు భక్త కబీరు దాసు.

శ్రీగురుసాయిమాష్టారు, మరియు అమ్మగారి దివ్య పాదపద్మములకు నమస్కరిస్తూ".. థామస్‌రెడ్డి.

లక్షలాది మందిని నిర్దుష్టమైన శ్రీసాయి మార్గంలో పయనింపచేస్తున్న నిత్యసత్యులు సాయిస్వరూపులయిన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిపై మొట్టమొదటి సమగ్ర జీవిత చరిత్ర "మహాత్ముల ముద్దుబిడ్డడు" ఆవిష్కరించబడి నేటికి 25 (రజతోత్సవము) సంవత్సరాలు అయిన సందర్భముగా పుస్తక పరిచయం ద్వారా అందిస్తున్న ప్రత్యేక వ్యాసం.


మహాత్ముల ముద్దుబిడ్డడు రచయిత :
**శ్రీ సిహెచ్. థామస్‌రెడ్డి**, ఎమ్.ఏ. ఎమ్. ఫిల్

వెల : రూ. 120/– పేజీలు : 272

ప్రతులకు :
**శ్రీ మంగభరద్వాజ ట్రస్టు**, #12-1-170/46 పి,
భక్తనివాస్, జైపురికాలనీ, నాగోల్, హైదరాబాదు – 500 068
ఫోన్ : 040 – 65741550

**శ్రీ మంగభరద్వాజ ట్రస్టు**
కొండయ్య బంక్‌స్ట్రీట్, కొత్తపేట, ఒంగోలు – 523 002,
ప్రకాశం జిల్లా. ఫోన్ : 08593 233271

## పుస్తక పరిచయం - నాకు తెలిసిన 'ఏది నిజం?



శ్రీమాస్టరుగారు రచించిన 'ఏది నిజం?' గ్రంథాన్ని అనేక కోణాల్లో తరచిచూసే ప్రయత్నంలో సాగిన ఆలోచనలు, సమన్వయమైన సమాధానాల సమాహారమే ఈ గ్రంథం. అందుకే ఇది "నాకు తెలిసిన 'ఏది నిజం?' అయింది.

అనేక మంది మహనీయుల ఆప్తవాక్యాలతో, బోధనలతో సమన్వయం చేసుకుంటూ, ఎన్నో మహాగ్రంథాలను ప్రామాణికంగా తీసుకుంటూ, 'ఏది నిజం?' యొక్క అంతరార్థాన్ని "నాకు తెలిసిన 'ఏది నిజం?"గా మన ముందుంచిన గ్రంథకర్త అభినందనీయులు.

అటు ఆధ్యాత్మిక లోతుల నుంచి, నేటి వైజ్ఞానిక శాస్త్రాల దాకా 'ఏది నిజాన్ని?' అర్థం చేసుకోవటంలోను, అట్టి నిజాన్ని అన్వేషించటంలోను విభిన్న కోణాలకు ఈ గ్రంథం సమన్వయాత్మకమైన సావకాశాన్నిస్తుంది. ఫలితంగా 'ఏది నిజం?' వరంగా తలెత్తే సంశయాలకు ఆధ్యాత్మిక–వైజ్ఞానిక శాస్త్రాల రెండు వైపుల నుంచి సమాధానం ఇందులో కనబడుతుంది.

అలాగే, సాయిలీలలను 'ఏది నిజం?' రీత్యా ఈ గ్రంథం అవలోకిస్తుంది.

నాకు తెలిసిన 'ఏది నిజం?' రచయిత : **శ్రీ వై.వి. పూర్ణేంద్రకుమార్**

వెల : రూ. 100/– పేజీలు : 207

ప్రతులకు : **శ్రీ శిరిడిసాయి సత్సంగము**
శ్రీకాళహస్తి రోడ్., సత్యవేడు – 517 588 చిత్తూరు జిల్లా,
ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 7981640162

## సాంగత్యం

బ్రహ్మదేవుడు ''పంచభూతాలను'' పిలిచి ఒక్కోవరం కోరుకోమన్నాడు. వరం కోసం తొందరపడిన "ఆకాశం" అందరికంటే పైన ఉండాలని కోరింది. ఎవరికీ అందనంత ఎత్తులో నిలిపాడు బ్రహ్మ. ఆకాశం మీద కూర్చునే వరాన్ని "సూర్యుడు" కోరడంతో నేటికీ ఆకాశం మీద విహరిస్తున్నాడు. వారిద్దరిమీద ఆధిపత్యం చేసే వరమడిగిన "జలం" మేఘాల రూపంలో మారి... ఆకాశం మీద పెత్తనం చలాయిస్తూనే కొన్నిసార్లు సూర్యుడిని కప్పేస్తుంది.

పై ముగ్గురినీ జయించే శక్తిని ''వాయువు'' కోరడంతో పెనుగాలులు వీచినప్పుడు రేగే దుమ్ము ధూళికి మేఘాలు పటాపంచలవడం..... సూర్యుడు, ఆకాశం కనుమరుగవడం జరుగుతాయి. చివరకు సహనంగా వేచి ఉన్న భూదేవి పైనలుగురూ నాకు సేవచేయాలని కోరడంతో బ్రహ్మ అనుగ్రహించాడు.


అప్పటినుండి ఆకాశం భూదేవికి గొడుగు పడుతోంది. వేడి, వెలుగు ఇస్తున్నాడు సూర్యుడు, వర్షం కురిపించి చల్లబరుస్తోంది జలం, సమస్త జీవకోటికి ప్రాణవాయువు అందిస్తున్నాడు వాయువు.

సహనంతో మెలిగి వరం కోరిన భూదేవికి మిగతా భూతాలు సేవకులయ్యాయి. సహనవంతులు అద్భుత ఫలితాలు పొందగలరని నిరూపించడానికి ఈ కథ చాలు. సహనానికి ప్రతిరూపం స్త్రీ. అందుకే భూదేవిని ఓర్పు, సహనాలకు ప్రతిరూపంగా చెప్పారు పెద్దలు. సహనం అంటే నిగ్రహం పాటించడం.. కష్టాల్లో ఉన్నప్పుడు ఉద్వేగాన్ని దాటవేయడం లేదా వాయిదా వేయడం. బాధను అధిగమించడమే సహనం. సహనంగా ఆలోచించే వారికి సమస్యలు దూరమవుతాయి. కొన్ని సార్లు ఏదైనా పెద్ద సమస్య ఎదురైతే చావు వైపు నడిచే బదులు సహనంగా ఆలోచిస్తే పరిష్కారం కనిపిస్తుంది. సరైన ఆలోచన కలగనప్పుడు అనుభవజ్ఞుల్ని ఆశ్రయిస్తే పరిష్కారం దొరుకుతుంది.

సేకరణ : **శ్రీమతి వై. సాయిశిరీష**, బెంగుళూరు

# స్ఫూర్తిప్రదాత 'శ్రీ బి.వి. నరసింహస్వామి'

1939వ సంవత్సరములో శ్రీ బి.వి. నరసింహస్వామీజీ సాయి గురించి రచించిన మొట్టమొదటి గ్రంథం 'హూ ఈజ్ సాయిబాబా?' వెల 1 అణా చొప్పున నిర్ణయించిన ఆ పుస్తకం ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. దానిని తమిళంలోకి అనువదించగా, అది మరింత మంది భక్తులకు చేరువయ్యింది. 1940లో 'వండ్రస్ సెయింట్' అనే పుస్తకం 6 అణాల ధరతో వెలువడింది. ఈ పుస్తకంలో ఆయన బాబా గురించి మరిన్ని, ఎక్కువ ఆసక్తికరమైన విషయాలు అందించారు. "ఇతర అవతారాలలో భగవంతుడు అందించే సహాయం ఎంతో పరిమితంగా ఉండేదని, కాని ఈ సాయి అవతారంలో భగవంతుని అనుగ్రహం ప్రతీ ఒక్కరికీ వ్యక్తిగతంగా అనుభవమౌతుందని'' నరసింహస్వామి ఈ పుస్తకంలో వివరించారు. భక్తులకు వివిధ స్థాయిలలో ఏ విధంగా తన సహాయాన్ని, కృపను అనుభవింప చేస్తారో స్వామిజీ దీనిలో తెలియ చేసారు. ఈ 'వండ్రస్ సెయింట్' అనే పుస్తకం తెలుగు, హిందీ, బెంగాలీ, గుజరాతీ భాషలలోకి కూడా అనువదించబడింది.



తరువాత నరసింహస్వామి శ్రీ శిరిడీసాయి గురించి రచించిన 'ద ఛార్టర్స్ అండ్ సేయింగ్స్' అనే పేరుతో ప్రజల ముందుకు వచ్చింది. శ్రీసాయి బాబాను ప్రత్యక్షంగా సేవించుకున్న జస్టిస్ శ్రీ ఎమ్.బి. రేగే గారు ఈ పుస్తకానికి ముందు మాటను అందించారు. ఇది ఒక ఉత్తేజ పూర్వక గ్రంథం. సాయిబాబా తన భక్తులకు అనుగ్రహించిన తీరు, బాబా బోధలు, జీవిత చరిత్ర గురించి ఈ గ్రంథంలో వివరించబడ్డాయి. అనేక శీర్షికలతో, చిన్న చిన్న పేరాలలో విషయాలు వివరంగా అందించారు. అది ఒక పురాణ శైలిలో వ్రాయబడింది. రచయిత వివిధ అధ్యాయాలను విభజించిన రీతి కారణంగా ఆ పుస్తకాన్ని ఏ పేజీ వద్దనైనా తెరచి పాఠకులు అక్కడి వివరాలు చదివి ఆనందించే తీరులో ఉంటుంది. విషయ సూచిక పాఠకులకు నిర్ణీత అధ్యాయం లేక విషయాన్ని ఎంచుకునే వీలు కల్పిస్తుంది. ఇది బహిరంగ ఉపన్యాసం చేసే వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పుస్తకం అనేకసార్లు పునర్ముద్రింప బడింది. ఇప్పుడు 'గాస్పెల్ ఆఫ్ సాయిబాబా' అనే పేరుతోను, తమిళం, కన్నడ, తెలుగు, హిందీ, మళయాళం వంటి ఇతర భాషలలోను కూడా భక్తులకు లభిస్తోంది.

ఈ పుస్తకం సాయి ఉద్యమానికి ఎంతగానో సహకరించింది. నెల్లూరులోని ఒక ధనికుడైన జమిందారు పాపయ్య శెట్టి ఈ పుస్తకం వల్ల ఎంతో ప్రభావితులయ్యారు. ఆయన 1940 డిసెంబరు 23వ తేదీన శిరిడీలో నరసింహస్వామీజీని కలసి ఆయనకి 11,455 రూపాయలు డబ్బుల కట్టను అందించి వెళ్ళిపోయారు. తనకు సాయిబాబా "ఈ మొత్తాన్ని నరసింహ స్వామీజీకి ఇవ్వమని చెప్పారు" అని మాత్రమే ఆయన చెప్పారు. "సాయి ఆ పైకాన్ని ఎలా వినియోగించాలో ముందు ముందు సూచించగలరని" చెప్పి వెళ్ళిపోయారు. స్వయంగా లక్షల ఆస్తిని వదిలి సన్యసించి, సాధకులైన నరసింహస్వామి ఒక్క క్షణం సందిగ్ధంలో పడ్డారు. ఆయన సాయిబాబా సంకల్పం తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో 3 చీటీలు వ్రాశారు.

1. ఈ డబ్బును సాయి ప్రచార కార్యానికి వినియోగించాలి.

2. ఈ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి దాని మీద వచ్చే వడ్డీని ఒక సత్కార్యానికి వినియోగించాలి

3. ఈ మొత్తాన్ని శిరిడీ సంస్థాన్ ట్రస్టుకు అందచేసి సాయిబాబా ఆలయం అభివృద్ధి నిమిత్తం వినియోగించమని చెప్పాలి.

సమాధి మందిరానికి వచ్చిన ఒక చిన్న పిల్ల వాడిని వాటిలో ఒక చీటీ తీయమని అడిగేరు. పై వాటిలో మొదటి చీటీ తీసి బాబా ఆ పిల్లవాడి ద్వారా తన సంకల్పాన్ని తెలియ చేసారు. నరసింహ స్వామీజీ శిరిడీ సంస్థాన్ ట్రస్టు వారిని ఆ ధనాన్ని సాయి ప్రచార కార్యానికి వినియోగించుకుంటారేమోనని అడిగారు. కానీ వారు నిరాకరించడంతో ఆయన ఆ డబ్బును మద్రాసుకు తీసుకు వచ్చారు.

1940 జనవరి నెలలో ఆయన 'సాయి సుధ' అనే మాస పత్రిక ప్రారంభించారు. దానిలో తమిళ, సంస్కృత, తెలుగు విభాగాలతో పాటు ఇంగ్లీషు ముఖ్య విభాగంగా ఉండేది. ఎస్.ఆర్. సంపత్ కుమారన్ అనే ఆయన దీనికి తొలి ఎడిటర్‌గా పనిచేసి 21 అక్టోబరు 1943లో మరణించే వరకూ ఆ బాధ్యతను నిర్వర్తించారు. తరువాతి సంవత్సరాలలో స్వామి శివానంద, శ్రీ రాధాకృష్ణ స్వామీజీ దానిని ఎడిట్ చేసేవారు. నరసింహ స్వామి 'డివోటీస్ ఎక్స్పీరియెన్సెస్' అనే శీర్షికన ఇంగ్లీషు, తమిళ భాషలలో 3 భాగాలు ప్రచురింప చేసారు.

మద్రాసు హైకోర్టులో జడ్జిగా పని చేసిన జస్టిస్ శ్రీ సోమయ్యగారి అల్లుడైన శ్రీ ఒ.కె. వరదరావు గారు ఆ సమయంలో మద్రాసులోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఆఫీసరుగా పని చేస్తున్నాడు. ఈ ఉత్సాహవంతుడైన యువకుడు ఆల్ ఇండియా సాయి సమాజ్‌కు మొట్టమొదటి గౌరవ సెక్రటరీగా పని చేసారు. ఆయన భార్య శ్రీమతి శారద నరసింహ స్వామీజీకి దత్త పుత్రిక వలే చేరువవడమే కాక ఆయన డిక్టేషన్‌లు తీసుకోవడం, వ్రాత ప్రతులు తయారు చేయడం, వాటిని టైపు చేయడం, తప్పులు సరిదిద్దడం, వాటిని ప్రెస్ వారికి పంపించడం, ప్రూఫ్‌లను సరిదిద్దడం, చివరికి పుస్తకం తీసుకురావడం వంటి అన్ని పనులూ చేసి ఆయనకు పర్సనల్

సెక్రటరీగా విస్తృతంగా సహాయం అందించేవారు. నరసింహ స్వామి చేసిన అన్ని రచనలలోను ఈవిడ ప్రభావం మనకు గోచరిస్తుంది. అంతేకాక శ్రీమతి శారద గారు స్వామీజీ పర్యటనల కార్యక్రమాలను నిర్ధారించడం, ఉపన్యాసాలు, ఇతర కార్యకలాపాలకు టైమ్ టేబుల్ కూడా నిర్ణయించేవారు.

ఆల్ ఇండియా సాయి సమాజ్‌ను శ్రీమతి శారద, ఆమె భర్త మొట్టమొదటి సారి కలుసుకున్నప్పుడు ఆవిడ ఒక సందేహాన్ని వ్యక్తం చేసారు. ఆ సమయంలో స్వామీజీ పిచ్చుకలకు మేత పెడుతున్నారు. ఆమె సందేహం ఇలా ఉంది : "మనం సాయిబాబాను భగవంతునిగా అంగీకరించినప్పుడు ఇతర దేవతలైన లక్ష్మి, సరస్వతి, వినాయకుడు మొదలగు వారిని పూజించడం కొనసాగించవచ్చా? వివిధ దేవతలు ఒక్కొక్క నిర్ధారిత కార్యకలాపానికి చెందిన వారైతే సాయిబాబా మొత్తం భగవత్తత్వానికే ప్రతిరూపం అందువల్ల వేరెవరినీ పూజించకుండా కేవలం సాయిబాబానే పూజిస్తే సరిపోతుందా?"

శ్రీనరసింహస్వామి ఆమెకు ఇలా సమాధానమిచ్చారు.

"శారదా! నీవు చూచే ఈ శరీరానికి నరసింహస్వామి అని పేరు పెట్టబడింది. దీనిలో వివిధ పనులు చేయడానికి అనేక భాగాలు ఉన్నాయి. నోరు తినడానికి, చెవులు వినడానికి, కళ్ళు చూడడానికి, కాళ్ళు అటూ ఇటూ కదలడానికి–ఇలా అన్నీ ఉన్నాయి. కానీ ప్రతి భాగాన్ని విడివిడిగా నరసింహస్వామి అని పిలవం కదా! అవన్నీ ఒకే ఒక్క నరసింహస్వామిలోని వివిధ భాగాలు. ఈ భాగాలన్నీ కలిసిన రూపమైన ఆ వ్యక్తికి ఒక వ్యక్తిత్వం, లక్ష్యం ఉన్నాయి. మనం మొత్తం వ్యక్తిగా ఆయనను భావించినపుడు వివిధ భాగాలను ఒక్కొక్క దానిని పరిగణించము కదా!" ఈ వివరణతో శ్రీమతి శారద గారి సందేహం నివృత్తి అయింది.

శ్రీ నరసింహస్వామీజీ తాను చేసే పనులన్నింటిలోను 'నేను' అనే అంశాన్ని ఏ విధంగా అతిక్రమించారో శ్రీ వరదరావుగారు గర్వంగా తెలియ చేస్తారు. సాయి సమాజ్ వారి ద్వారా ప్రచురితమైన అన్ని పుస్తకాలలోను స్వామీజీ 'నో రైట్స్ రిసెర్వ్‌డ్' అనే వాక్యం ప్రకటించడం ద్వారా ఎక్కడైనా ఆ పుస్తకంలోని విషయాలను స్వేచ్ఛగా ఏ అనుమతులు లేకుండానే వినియోగించుకోవచ్చు. ఒక సందర్భంలో శ్రీ వరదరావు గారు న్యాయ శాఖకు చెందిన వారు కావడంతో పొరపాటున 'ఆల్ రైట్స్ రిసెర్వ్‌డ్' అని ప్రచురింప చేసారు. నరసింహస్వామీజీ దీనిని ఏ మాత్రం ఇష్టపడక వరదరావు గారిని దానిని సరిదిద్దవలసిందిగా తెలియచేసారు. పుస్తకాలు పంచే ముందే ఆ సవరణ చేయాలని చెప్పారు. అయితే పని ఒత్తిడి వలన వరదరావుగారు ఆ పని చేయలేకపోయారు. సాయంత్రం ఆయన సాయి సమాజ్ ఆఫీసుకు వచ్చినప్పుడు శ్రీనరసింహస్వామి ఆ సవరణను స్వయంగా చేస్తుండటం చూచి దిగ్భ్రాంతులయ్యారు, శ్రీ వరదరావు గారు నరసింహస్వామికి నివాళులర్పించే సందర్భంలో ఈ నిస్వార్థ గుణాన్ని ఎంతగానో గుర్తు చేసుకునేవారు.

"నమ్మకం ఉన్న వారికి అన్నీ సాధ్యమే. సానుకూల దృక్పథంతో ఆశించే వారికి అన్నీ సులువైనవే. ప్రేమ ఉన్న వారికి మరింత సులభం. ఈ 3 లక్షణాలు ఉండి సాధన చేసే వారికి అందరి కన్నా సులువుగా సాధ్యపడతాయి" అంటారు శ్రీ రాధాకృష్ణస్వామి.

శ్రీ సాయిబాబా ఫోటోలు విస్తృత స్థాయిలో ముద్రణ చేయడానికి శ్రీ నరసింహ స్వామీజీ ఏర్పాట్లు చేసారు. ఈ పటాలు బాబా పట్ల భక్తులలో మరింత భక్తి భావాన్ని పెంపొందించడానికి తోడ్పడతాయి.

మద్రాసులో ట్రిప్లికేన్ ప్రింటర్స్‌కు చెందిన రావు సోదరులు సాయి బాబా ఫోటోలు 3 రంగుల సమ్మేళనంలో ఆర్ట్ పేపర్ మీద కార్డ్ సైజులోను, కాబినెట్ సైజులోను ముద్రించారు. మద్రాసులోని మౌంట్ స్ట్రీట్‌లో ఉన్న త్రిపుర సుందరి జ్యూయలర్స్ వారు వృత్తాకారంలోను, నక్షత్రాకారంలోను చిన్న, పెద్ద, మీడియం సైజులలో బంగారం పూత, నికెల్ ఉపయోగించి లాకెట్లు తయారు చేసారు. ప్రతీ లాకెట్‌కు ఒక వైపు సాయిబాబా బొమ్మ, మరొకవైపు ఒక దేవుని బొమ్మ ఉండేది. బాబా బొమ్మ చుట్టూ వృత్తాకారంలో బాబా ప్రముఖ సూక్తి 'నేనుండగా నీకు భయమేల' అని తమిళంలో ముద్రించారు. వారు ఉంగరాలు, బటన్స్, పెద్ద లాకెట్లు బాబా ఫోటోతో తయారు చేశారు. వాటిపై చిన్న వెండి బాబా పాదుకలు కూడా ఉంచేవారు. ఈ వస్తువులన్నీ భక్తులను ఎంతగానో ఆకర్షించేవి. దీని ద్వారా ఆల్ ఇండియా సాయి సమాజ్‌కు ఎంతో ఆదాయం లభించింది. దాని సహాయంతో ఆ సంస్థను మరింత విస్తరించడం సాధ్యపడింది. ఈనాడు సాయి పటాలు, లాకెట్లు, ఉంగరాలు దాదాపు ప్రతీ ఇంటిలోను కనబడుతున్నాయంటే వీటికి మూల కారణం నరసింహస్వామీజీ అని మనం గుర్తుంచుకోవాలి. స్వామీజీ ఈ వస్తువులను శిరిడీలో కూడా విస్తరింపచేసారు. 1941కి ముందు ఇవేవీ శిరిడీలో దొరికేవి కావు. 1970 వరకు మద్రాసు సప్లైయర్స్ వారు శిరిడీకి లాకెట్లు, ఉంగరాలు పంపిణీ చేసేవారు.

నరసింహస్వామీజీ మొట్టమొదటిసారి 1936లో శిరిడీ వెళ్ళినపుడు సాయి పాదాలనాశ్రయించిన భక్తులను లెక్క పెట్ట వీలయ్యేంత మంది మాత్రమే ఉండేవారు. బాబా భౌతికంగా శిరిడీలో ఉండగా వేల సంఖ్యలో భక్తులు ఆయనను దర్శించినప్పటికీ ఆయన మహాసమాధి అనంతరం ఆ భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. బాబాకు బాగా సన్నిహితులైన భక్తులు సైతం మిగిలిన మహాత్ములందరి వలెనే సాయి దేహత్యాగం చేయడంతోనే వారి ప్రభావం క్షీణించిందని, వారు శరీరంతో ఉండగా అది అత్యున్నత స్థాయిలో ఉండేదని భావించేవారు. 1936 తరువాత శ్రీనరసింహస్వామి ఆధ్వర్యంలో నడిచిన సాయి ఉద్యమం దేశ వ్యాప్తంగా విస్తరించి అనేక మందిని సాయి పాదాల చెంతకు చేర్చింది. ఈ ఉద్యమం దేశ పరిధులు దాటి విదేశాలకు కూడా విస్తరించింది. ఈనాడు వందలలో కాదు కోట్ల సంఖ్యలో భక్తులు శిరిడీ వచ్చి బాబాను దర్శించి తరిస్తున్నారు.

# అవధూత - శ్రీ రాఖాడీ బాబా బోధామృతం

గుప్తయోగులైన శ్రీ రాఖాడీ బాబా, వారొక అతీంద్రియ శక్తులున్న నిరాడంబర యతీంద్రులు. కీర్తి ప్రతిష్ఠలకై వారేనాడూ ప్రాకులాడలేదు, పనిగట్టుకొని తన దివ్య శక్తులను పది మంది ఎదుట ప్రదర్శించలేదు కూడా. కీర్తి ప్రతిష్ఠలనార్జించుటే వారి జీవితాశయము కాదు. తమ గురుదేవుల ఆదేశములోని అంతరార్థం ప్రకారం నడచుకోవడమే వారి జీవితాశయము, అదే వారికి జీవిత పరమార్థం కూడా!



తమ ప్రియశిష్యులైన తన పూర్ణానందున్ని దివ్యశక్తి సంపన్నులుగా తీర్చిదిద్ది, వారి జీవితాన్ని సమాజ శ్రేయస్సుకై అంకితమగునట్లు చేయుటే, తమ జీవిత పరమార్థంగా బాబావారు తలచారు. సమాజశ్రేయస్సుకు దోహదపడగల "అలాంటి దివ్యశక్తులను తను కూడా సంపాదించాలి" అనే సంకల్పము శిష్యునిలో కలిగించడానికా అన్నట్లు, బాబావారు అడపాదడపా తమ దివ్యశక్తులను ప్రత్యక్షంగా తిలకించే అరుదైన అవకాశాన్ని శిష్యునికి కలిగించేవారు. తమ గురుదేవులైన శ్రీ రాఖాడీ బాబావారి దివ్యశక్తులకు దర్పణము పట్టే ఒక సంఘటనను శ్రీ పూర్ణానందస్వామివారు తమ శిష్యులకు వివరించారు. ఆ అద్భుత సంఘటన వివరాలను మనమిపుడు తెలుసుకొందాము.

అదొక ప్రశాంత సంధ్యా సమయము. ఊరికి చేరువలోనే వున్న ఒక వటవృక్ష ఛాయలో పూజ్య శ్రీ రాఖాడీ బాబావారు, వారి శిష్యశిరోమణి అయిన పూర్ణానందులు ఆశీనులై యున్నారు. పరికించి చూడగా స్వామివారెందుకో పరమానందంతో పరవశించి పోతున్నారు. సుగంధ భరితమైన, మెల్లమెల్లగా వీస్తున్న చల్లని పిల్లగాలులు శరీరాన్ని తాకి పలకరిస్తుంటే, మనసేమో ఒక వంక పులకరించిపోతోంది. మరొకవంక, కన్నులపండువుగా పూర్ణానందస్వామి కళ్లెదుటే గురుదేవులు కొలువై, తనపై కరుణామృత దృక్కులు కురిపిస్తున్నారు. సర్వసాధారణంగా సహజ సమాధిలో లీనమై, మౌనముద్రలో వుండే గురుదేవులు శ్రీ రాఖాడీబాబాగారు ఆ సమయంలో మౌనము వీడి, వీనుల విందుగా అనుగ్రహ భాషణము చేస్తూ "చూడు శివా...! జీవనదులు ఎచటనో పుట్టి, క్రమక్రమంగా ప్రవాహమై మధ్యమధ్య తమతో కలిసే ఉపనదులను తమలో విలీనం చేసుకొంటూ, ఉరవళ్ళు పరవళ్ళ మీద కొండా కోనలూ, కీకారణ్యాల గుండా అవిశ్రాంతంగా పయనిస్తాయి. మార్గమధ్యంలో తమనాశ్రయించిన సకలజీవరాసికీ సమదృష్టితో ప్రాణాధారమైన నీటినందిస్తాయి. "నదీనాం సాగరో గతిః" అన్నట్లు, చివరకు తమ అంతిమ ప్రస్థానమైన సముద్రున్ని చేరి ఆ సాగర గర్భంలోనే విలీనమైపోతాయి. అలా సాగరం చేరిన మరుక్షణమే, ఆ నదులు తమ ఉనికిని, పూర్వపు స్వరూప స్వభావాలను పూర్తిగా కోల్పోయి, సాగర లక్షణాలన్నింటిని సంతరించుకొంటాయి. తుదకు తామే సముద్రంగా మార్పు చెందుతాయి.

అదే విధంగా, సాధక పురుషుడైన వాడు తన సద్గురుమూర్తి ఉపదేశించిన మంత్ర జపాన్ని శ్రద్ధాభక్తులతో చేయగా, చేయగా ఒక దశలో మాంసపిండమైన అతని దేహము మంత్ర పిండంగా మార్పు చెందుతుంది. సాధనా ఫలితంగా ఆ దశలో సాధకునికి అనివార్యంగా కొన్ని దివ్యశక్తులు సంప్రాప్తమౌతాయి. భగవత్కటాక్షలబ్ధమైన ఆ దివ్య శక్తులను భగవత్ప్రీత్యర్థమై లోక కళ్యాణానికై సద్వినియోగపరచుకుంటే ఆ సాధకుడు తన బంగారు భవిష్యత్తుకై తానే చక్కని రాచబాటను వేసుకున్నట్లు అవుతుంది. అలాకాక, తన స్వార్థానికై ఆ దివ్య శక్తులను దుర్వినియోగ పరుచుకుంటే అతను కోరికోరి తన వినాశనాన్ని తానే కోరితెచ్చుకున్నట్లు అవుతుంది. అందుకే పెద్దలన్నారు **" సమాజహితం కొరకై చేసే ఏ మంచి కార్యమైనా తపస్సుతో సమానమని".**

బాబావారు తమ బోధనను కొనసాగిస్తూ "నదులు సముద్రంలో విలీనమై, తామూ సముద్రముగా మారినట్లు – మంత్ర పిండముగా మారిన సాధకుడు మంత్రాధి దేవతగా మారిపోతాడు. ఆ స్థితిలో సాధకునికి – మంత్రాధి దేవతకు మధ్య భేదమనేది వుండదు. సర్వదేవతా అవతారాలు కూడా ఒకే మూలస్థానం నుండి వివిధ మార్గాలలో ప్రవహిస్తున్న నదుల వంటివే. వీరంతా ఒకే అస్తిత్వము నుండి దిగివచ్చినవారే. మరొక విధంగా చెప్పాలంటే సర్వ మంత్రాధి దేవతలు కూడా ఆ పరతత్వానికి అంటే, ఆ పరమాత్మకు ప్రతిరూపాలే. అందుచేత సాధకుడు మంత్రాధి దేవతగా మారిన స్థితి అంటే సాధకుడే పరమాత్మగా మారిన స్థితి అన్నమాట.

అప్పుడు పూర్ణానందస్వామివారు "బాబా...! అత్యున్నత స్థాయినందుకొన్న ఆ అతీత మానవుని మానసిక స్థితిని గురించి కొంత వివరంగా సెలవిస్తారా" అని ప్రార్థించారు. అందుకు బాబావారు "శివా! అంతర్ముఖుడై, భావాతీత స్థితిలో పరమాత్మతో ఏకమై వుండే పరమానందస్థితిని మనస్సు అందుకోజాలదు. మనస్సే అందుకోలేని ఆ పరమానందస్థితిని మాటలతో ఏమని వర్ణించేది. ఇక అతని ప్రవర్తనను గురించి స్థూలంగా చెప్పాలంటే, అంతకు ముందు ప్రపంచంలోని అశేష ప్రజానీకంలో తానూ ఒకటిని – అనే భావనలో వుంటాడు. ఆ స్థితి సిద్ధించిన పిమ్మట ఆ ప్రపంచమే తనలో వున్నట్లు భావిస్తాడు. అంటే సకల ప్రాణికోటి తన ఆత్మస్వరూపాలేననీ, స్త్రీ పురుష భేదము లేకుండా అందరూ తన అనుంగ బిడ్డలేననే నిష్కల్మషమైన అఖండ ప్రేమ భావనలో వుంటాడు.

మరొక్క ముఖ్య విషయము శివా...! సర్వాంతర్యామి అయిన ఆ పరమాత్మ సకల ప్రాణికోటిలోనూ అంతర్యామియై వెలుగొందుచున్నాడు కదా...? ఇంతకు క్రితమే వివరించినట్లు, తన సాధనా పటిమచే అంచెలంచెలుగా ఎదిగి, మనిషే మాధవునిగా మారిన స్థితిలో, అతను ఏ ప్రాణినైనా తన ఆదేశాలకనుగుణంగా నడచుకొనేటట్లు శాసించగల దివ్యశక్తి సంపన్నుడై వుంటాడు. నేడు కరుణామూర్తులు, కారణజన్ములు అయిన అలాంటి తాపసుల సేవలు దేశానికి ఎంతైనా అవసరం. ఎందుకంటే, ఎటు చూచినా నయవంచకులైన బాబాలూ, నకిలీ స్వామీజీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. వీరు తమను నమ్మి, పారమార్థిక చింతనతో తమనాశ్రయించిన సామాన్య ప్రజానీకాన్ని, తమ మాయమాటలతో మభ్యపెట్టి, వారి ధనమాన ప్రాణాలు హరించి నమ్మివచ్చిన వారిని అలా నట్టేట ముంచుతున్నారు. అందుకనే దేశం నలుమూలలా, అలా దగా పడిన తమ్ముళ్లూ, మరెందరో ముముక్షువులు సమర్థుడైన ఒక సద్గురుమూర్తిని సేవించి తరించాలని, అలాంటి మహనీయుని రాకకై వేయికళ్ళతో ఎదురుచూస్తున్నారు" అని భావయుక్తంగా వివరించారు శ్రీగురుదేవులు శ్రీరాఖాడీబాబా.

అప్పుడు స్వామివారు తమ గురుదేవులతో "గురుదేవా! ఒక సద్గురుమూర్తి దివ్యశక్తి సంపన్నుడైనంత మాత్రాన దేశం నలుమూలలా వున్న అలాంటి వందలాదిమంది అభాగ్యులను చేరదీసి సంస్కరించడమెలా సాధ్యము?" అని తమ సంశయాన్ని వెలిబుచ్చగా, బాబావారు "శివా నీ మదిలో మెదిలే అన్ని సంశయాలనూ నివృత్తి చేస్తాము. సావధాన చిత్తుడవై విను.

ప్రపంచంలో ధనవంతులకు అసాధ్యాలుండవచ్చు గాని, తపోధనులకు అసాధ్యాలుండవు. అంతేగాక, నీవు నీ గురుదేవుని విశేష కృపకు పాత్రీభూతుడవై సంకల్పసిద్ధిని కూడా వరంగా పొందగలిగిన అదృష్టశాలివి. అలాంటిది, సమాజ శ్రేయస్సునకై నీవు చేయు ఏ సత్సంకల్పమైనా సఫలీకృతం కాకుండా ఎలా వుండగలదు. మరొక్క వింతైన విషయమేమిటంటే.. కర్మ పరిపక్వము కానట్టి వారిని రక్షిద్దామని రాముడో, కృష్ణుడో ఎదురొస్తున్నా, ఆ దురదృష్టవంతులు కావాలనే, వారిని తప్పుకొని తిరుగుతారే తప్ప – సద్గురు మూర్తిని సమీపించలేరు. వారి సంగతి వారి కర్మకే వదిలేద్దాం, కాని పారమార్థిక చింతనతో హృదయం పరిపక్వమై, చంద్రుని రాకకై ఎదురుచూచే చకోర పక్షుల్లాగా సద్గురుమూర్తి దర్శనానికై ఎదురుచూస్తున్న సన్మార్గులు కొందరున్నారు, అట్టి వారిని చేరదీసి ఆదుకోవటానికై మనమే వారి మధ్యకు వెళ్ళవలసిన అవసరమొస్తుంది. భక్తుని హృదయం అలా పరిపక్వదశకొచ్చిన సందర్భాలలో భగవంతుడే గురురూపంలో తానే ఆ భక్తుని వద్దకు వెళ్ళి అతనిని తగురీతిలో అనుగ్రహించి మార్గదర్శనం చేయటం సృష్టి ధర్మము".

కొంత సమయం గడిచాక బాబావారు తనవైపు సాభిప్రాయంగా చూచిన చూపులోని భావము పూర్ణానందస్వామివారికి బోధపడింది. స్వామివారు వెంటనే లేచి నిలబడి "బాబా...! నాలోని సకల సందేహాలూ నిశ్శేషంగా నిర్మూలమయ్యాయి. ఇపుడు నా శేష జీవితాన్ని మీ పవిత్ర పాదపద్మాలచెంత సవినయంగా సమర్పించుకొంటున్నాను. దానిని సమాజ కళ్యాణానికో, అర్హులైన ఆర్తులనాదుకోవటానికో లేక మరొక పనికో, మీరు ఎలా ఆజ్ఞాపిస్తే అలా నడుచుకొంటాను. అదే నా జీవిత ధ్యేయం" అంటూ గురుదేవుల పాదాలకు ప్రణమిల్లారు.

(ఏప్రిల్ 3వ తేదీ ఆదివారం శ్రీ పూర్ణానందస్వామి ఆరాధనోత్సవము (తిథిప్రకారం) సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **మహద్గురు శ్రీ పూర్ణానంద చరితామృతం**

రచన : **శ్రీ సాయిదాస్‌స్వామి**, హైదరాబాదు

# ఉగాది పచ్చడి

"ఉగాది" అనగానే ఆరు రుచుల ఉగాది పచ్చడి, దానిపై జోకులు వేసుకొని నవ్వుకోవటము గుర్తుకు వస్తాయి. ఉగాది రోజు(సంవత్సరాది) ఎట్లా ఉంటే ఆ విధముగా సంవత్సరమంతా జీవితము కొనసాగుతుందని, ఉగాది రోజు వీలయినంత వరకు సంతోషముగా ఉండటానికి ప్రయత్నము చేస్తూ ఎక్కడా చేదు అనే విషాదము, బాధ తొంగి చూడకుండా జాగ్రత్త పడతాము.

తీపి, పులుపు, ఉప్పు, చేదు, వగరు, కారం (బెల్లము, చింతపండు, వేపపువ్వు, మామిడి పిందెలు, మిరప, ఉప్పు) ల కలయికే ఉగాది పచ్చడి. సుఖ–దుఃఖములు, కష్ట–నష్టముల స్వరూపమే జీవితం. ఉగాది పచ్చడిలోని ఆ ఆరు రుచులు జీవితములోని సంఘటనలకు గుర్తు. జీవితములో అనివార్యముగా సంభవించేవాటిని సమదృష్టితో తీసుకోవటానికి ప్రతీకగా సంవత్సరము ప్రారంభం రోజున ఉగాది పచ్చడి సేవిస్తారు. అంతే గాని బెల్లం ఎక్కువ వేసుకొని తియ్యగా పచ్చడి తయారు చేస్తే సంవత్సరమంతా సుఖము గాని, వేపపువ్వు ఎక్కువైతే సంవత్సరమంతా బాధలు గాని ఉండవు. వాటిని సమదృష్టితో స్వీకరించగలగాలి అంటే సద్గురువు సమాశ్రయము ఒక్కటే శరణ్యము. ఇష్టా, అయిష్టాలను జయిస్తూ, వర్తమానంలో జీవించటం, జీవించటమే ప్రధానముగా కాక, ఎలా జీవించాలో తెలుసుకొని జీవించటము, అందుకొరకు క్షణక్షణమూ ఆత్మవికాసానికై కృషిచేస్తూ, సద్గురువును తెలుసుకోవటానికి ప్రయత్నం చేయటము ద్వారా సద్గురువు సమాశ్రయము పొందిననాడే నిజమైన ఉగాది, మన పాలిటి యుగాది. మన పూర్వ జన్మ సుకృతము వల్లనో, లేక తల్లి తండ్రుల పూజా ఫలము వలనో "శ్రీ శిరిడీ సాయి విశ్వవిద్యాలయము"లో చేరే అర్హత పొందేము. అందులో ఆచరణ ద్వారా బోధ చేస్తూ, ఆచరింపచేస్తూ, అండనుండి నడిపిస్తూ బోధించే ఆచార్యులు, శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరు గారి తరగతిలో చేరేము. ఇక చింతెందుకు, ఆచరించటమే ఆలస్యము. మనసా స్వీకరించి పరిణితి చెందుతూ, జీవితంలో నూతన కాంతి–క్రాంతి, పొందే దిశగా మన పయనం కొనసాగించటమే మన కర్తవ్యం. జీవితములో జరిగే సంఘటనలను సమదృష్టితో స్వీకరిస్తూ ముందుకు సాగటమే నిజమైన ఉగాది పచ్చడి స్వీకరించటము. అలాంటి పచ్చడి సద్గురు సాయిమాస్టర్ అందరికీ అందించాలని ప్రార్థిస్తూ... శ్రీ "శుభకృత్" నామ సంవత్సర శుభాకాంక్షలతో...

– వి.వి.పూర్ణచంద్రరావు

# అనంతసాగరం నాగమునీంద్రస్వామి

బాల్యం నుండే మానవతాగుణాలు క్రమ వికాసం పొంది నడివయస్సునాటికి దైవీ గుణాలుగా పరిణమించిన సత్పురుషుల్లో పేర్కొనదగినవారు నాగమునీంద్రస్వామి. నెల్లూరుజిల్లా ఆత్మకూరుతాలూకా చుట్టగుంటపల్లెలో కాయకష్టం చేసి బ్రతికేసుబ్బయ్య అనే ఒక నిరుపేద వడ్డెర ఉండేవాడు. అతని కొడుకు నాగయ్యయే నాగమునీంద్రస్వామి. నాగయ్య 1897 సంవత్సరం పుట్టినాడు. చదువుసంధ్యలు లేకున్నా చిన్నప్పటినుండి నాగయ్యకు పాపభీతి దైవప్రీతి సత్యనిరతి మెండు. బుద్ధి వికసించినకొలది రామభక్తి మారాకులు తొడిగినది. నాగయ్య ఆజానుబాహువు, బలిష్ఠుడు, నలుగురు చేసేపని ఒక్కడే చేసేవాడు. నడివయస్సు దాకా బావులు త్రవ్వి పొట్ట పోసుకున్నాడు.



అప్పుడప్పుడు భద్రాచలం వెళ్ళి శ్రీరామచంద్రదర్శనం చేసివచ్చే నాగయ్యకు అక్కడే దీర్ఘకాలం తపస్సు చేయవలెననిపించినది. ఆ దేవుని అరణ్యవాసమంత కాలం 14 ఏండ్లు నాగయ్య దీక్షగా గోదావరీస్నానం చేసి, శ్రీరామచంద్రుని సేవించి గంటలకొలది ఆలయప్రదక్షిణం చేసేవాడు. ధునివేసుకొని నిరంతరం ధ్యానంలో ఉండేవాడు. ఆయన తపస్సు 14 ఏండ్లకు ఫలించినది. కలలో శ్రీరామచంద్రుడు కన్పించి చెప్పినవిధంగా నెల్లూరు జిల్లా ఆత్మకూరు తాలూకా అనంతసాగరం చెఱువురేవు ఉత్తరభాగాన అనంరాయుడు పాలించిన శేషగిరిలో ఉన్న పుట్టుశిలను కనుగొని ఆలయం కట్టి నాగయ్య శ్రీరామచంద్రుని కొలువులో చేరిపోయినాడు. ఆయన కనిగిరి ప్రాంతంలో యోగసిద్ధి పొందిన మహనీయుడైన శివరమయోగి సంప్రదాయానికి చెందిన గురువు వద్ద నాగయ్య దీక్షితుడై నాటినుండి నాగమునీంద్ర స్వామిగా ప్రసిద్ధుడైనారు. తపస్సుతో దుర్గాదేవిని ప్రత్యక్షం చేసుకొన్నారు.

ఒకనాడు నాగమునీంద్రస్వామి దుర్గాదేవి ఆజ్ఞప్రకారం భైరవకోనకు పోయి భక్తుల సహాయంతో ప్రాచీనదేవాలయం జీర్ణోద్ధార చేసినారు. ఆదిభైరవుని, త్రిముఖదుర్గాంబల మండపాలు కనిగిరి రాఘవులచే పూర్తిచేయించి, శేషమునీంద్రుల మండపంలో శివరాత్రి, కార్తీకపౌర్ణమి ఉత్సవాలు, శ్రీరామనవమి, శ్రీ సీతారాముల కల్యాణం జరిపించినారు. తరువాత కనిగిరికి వచ్చి మాచవరంలో మఠం నిర్మించి, బావి త్రవ్వించి, మఱ్ఱిచెట్టు పాతించి యజ్ఞాలు రథోత్సవాలు జరిపినారు. ఎఱ్ఱగడ్డపాడు పాలేటిగంగ వద్ద సత్రం కట్టించి మఱ్ఱిచెట్టు నాటినారు. గంగాభవానికి రథం చేయించినారు. రామతీర్థంలోను మాలకొండలోను యజ్ఞాలు చేయించినారు. నాగమునీంద్రులు అనంతసాగరం రామాలయం చేరి సోమ శుక్రవారాలు తప్ప మిగతా దినాలు అక్కడే ఉండేవారు. ప్రతి శుక్రవారం మాచవరంలో, ప్రతి సోమవారం వెంగళాయపాళెం గంగ గుడివద్ద, శివరాత్రి నాడు భైరవకోనలో హోమాలు ప్రారంభించినారు. ఈ హోమాలద్వారా తమను ఆశ్రయించిన భక్తుల, శిష్యుల బాధలు, గతజన్మల, ఈజన్మల కర్మదోషాలు తొలగించేవారు.

భైరవకోనలో శేషమునీంద్రులనే భగవత్స్వరూపులైన మహాత్ములు సూక్ష్మరూపంలో ఉన్నారనీ, నాగమునీంద్రులు శేషమునీంద్రుల దర్శనం దివ్య ప్రకాశరూపంలో చేయించినందున శేషమునీంద్రుల అంశయే నాగమునీంద్రులనీ శ్రీవారి భక్తుల విశ్వాసం. నాగమునీంద్రులకు శ్రీరామచంద్రులవలె శేషమునీంద్రులు కూడా ఇష్టదైవతం, భక్తులకు కొత్తపలకలపైన నాగ మునీంద్రులు "ఓంరామా శ్రీరామా శేషమునీంద్రా" అని వ్రాసి యిచ్చి నిత్యమూ ఏకాగ్రతతో దిద్దుకొనమనే వారు. భక్తులు తెచ్చే కొబ్బరికాయలు కొట్టి ఆ నీరు వారి నెత్తిపై "గంగేచ యమునేచైవ" అంటూ పోసి వారి పీడలను, రోగాలను తొలగించేవారు. నాగ మునీంద్రస్వామి కర్మానుభవం గురించి కొన్ని కొత్త విషయాలు చెప్పినారు. "పూర్వజన్మలో చేసిన కర్మఫలితాలు ఈ జన్మలో అనుభవించటమే కాక పూర్వజన్మల్లో తల్లిదండ్రులు చేసిన దుష్కర్మఫలితాలు సంతానం అనుభవించవలసి వస్తుందనేవారు. మానవులు బిడ్డలమీది వ్యామోహంవలన అక్రమాలు, అధర్మాలు చేసి ధనం కూడబెట్టుతారు. ఆ ధనమూ ఆస్తిపాస్తులు అనుభవించినంతకాలం వారి సంతానం కూడ ఆ పాపఫలితం అనుభవించవలసి ఉంటుంది" అనే వారు. ఏపాపం ఎరుగనివాళ్ళు వచ్చి తమ కష్టనష్టాలు చెప్పుతుంటే వారి పూర్వీకులు చేసిన పాపాలు చెప్పి, అందువలననే మీరీబాధలు అనుభవిస్తూన్నారనే వారు. "అక్రమధనార్జనం చేసి తమ బిడ్డలకు కష్టాలే మూటకట్టి ఇస్తున్నామనీ, ఎవరికీ ఎట్టి అపకారం అన్యాయం చేయకుండా ఉండటమే మన సంతతికి మేలు చేయటమనీ" చెప్పేవారు. స్వామి వారెవరి బాధలు తొలగించినా అది భగవంతుని దయ అనేవారు. తమ గురించి, తమ మహిమల గురించి ప్రచారం చేయటం, చెప్పడం, ఇష్టపడని నిరాడంబరులు శ్రీ నాగమునీంద్రస్వామి ఒకరోజు శ్రీరాముడి అనుమతి అయినది. సమాధి గుంటలోనికి వెళ్ళిపోతాను" అన్నారు. అక్కడున్న శిలలను చూపిస్తూ "సాక్షాత్తు రాముడేనయ్యా! ఇక్కడకు వచ్చి ఏది అనుకుంటే అది అవుతుందయ్యా." శిలలవైపు చూపిస్తూ "నేను అక్కడే ఉంటానయ్యా" అని చెప్పినారు. అన్నట్లే నాగమునీంద్రస్వామి అనంతసాగరం శ్రీరామచంద్రునిలో ఐక్యమై అక్కడే ఉంటున్నారు.

శ్రీముఖ సంవత్సర జ్యేష్ఠ బహుళ త్రయోదశి గురువారం సాయంకాలం 5-59 గంటలకు (17-6-1993) శ్రీ నాగమునీంద్రులు శరీరం చాలించినారు. దూరదూరాల భక్తులు వచ్చినతరువాత మూడవనాడు నాగమునీంద్రులను సమాధిచేసినారు. శ్రీవారి ఆరాధనోత్సవాలు ఏటేట అనంతసాగరం చెరువుకట్ట వద్ద, మాచవరం, గంగాభవాని వద్ద జరుగుతున్నవి.

నెల్లూరు జిల్లా ఆత్మకూరునుండి సోమశిలకు పోయే బస్సులో అనంతసాగరం చెరువు కట్టవద్ద దిగి నాగమునీంద్రుల సమాధిని దర్శించవచ్చును. అక్కడేమీ దొరకవు. భక్తులు, కావలసిన వస్తువులు, భోజన పదార్థాలు తెచ్చుకోవలెను.

(జూన్ 26వతేదీ ఆదివారం, జ్యేష్ట బహుళ త్రయోదశి, శ్రీ నాగమునీంద్రస్వామి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీ యస్. సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి**, నెల్లూరు

# ఏరిన ముత్యాలు

### వినటం
మనస్సు చెప్పినట్లు మనం వినటం కాదు
మనం చెప్పినట్లు మనస్సు వినేలా చేసుకోవాలి.
– గౌతమబుద్ధుడు

### నమ్మకం
మీరు ఒక పనిని చేయగలను అని నమ్మితే
సగం పని పూర్తి అయినట్లే.

### ఆయుధం
శ్రమ నీఆయుధం అయితే
విజయం నీ బానిస అవుతుంది.

### గమ్యం - గమనం
జీవితం అనేది గమ్యం కాదు, గమనం మాత్రమే
ఎన్నిసార్లు ఓడినా గెలవటానికి అవకాశం ఉంటుంది
గమ్యం అనంతం, గమనం అనేకం.

### నేర్పు - ప్రతిభ
కష్టంగా భావించే దానిని సాధించటమే నేర్పు
అసాధ్యంగా భావించే దానిని సాధించటమే ప్రతిభ.

### ఓర్పు
ఓటమిని ఓడించటానికి కావల్సింది ధైర్యం కాదు, ఓర్పు.

### విజయం
జీవితంలో ఓడిపోయే వ్యక్తులు ఇద్దరు
ఒకరు ఎవరిమాట వినకుండా ఓడిపోయేవారు
మరొకరు అందరిమాటలు వింటూ ఓడిపోతారు
ఎవరిమాటలు విన్నా చివరకు ఆలోచన నీదైనప్పుడే
నీ జీవితానికి విజయం లభిస్తుంది.

### ధీరత్వం
అనంతశక్తి అంతా మీలోనే దాగిఉంది, మీరు ఏమైనా
చెయ్యగలరు, అన్నీ చెయ్యగలరు, దీనిని నమ్మండి
మీరు బలహీనులమని భావించకండి, ధీరులై లేచి నిలబడి
మీలోని దివ్యత్వాన్ని ప్రకటించండి.
– స్వామి వివేకానంద

### శాశ్వతం
కోరిక కొంతకాలం బతికిస్తుంది
ఆశ చచ్చేదాక బతికిస్తుంది
ఆశయం చచ్చేక కూడా బతికిస్తుంది.

### పాఠం
భయపడుతూ కూర్చుంటే బ్రతకలేవు,
ఒక్క అడుగువేసిచూడు
గెలుపైతే, నిన్ను ముందుకు నడిపిస్తుంది,
ఓటమి పాలైతే, తర్వాత ఏమిచేయాలో నేర్పిస్తుంది.

### విలువ
బహుమతి విలువ, ఇచ్చే వస్తువు కంటే
ఇచ్చే వ్యక్తి, ఇచ్చే విధానము మీదనే ఆధారపడి ఉంటుంది.

### ఆకలి - ఆలోచన
ఆకలి గొప్పదా, ఆలోచన గొప్పదా అంటే
ఆకలి అవసరాన్ని చూపిస్తుంది,
ఆలోచన బ్రతకటం నేర్పిస్తుంది.

### జీవితం
జీవితమనేది పరుగు పందెం కాదు కొంతదూరం
పరుగెత్తగానే ముగియటానికి, మరణించే వరకు
సాగించే పయనం జీవితం, ఇక్కడ గెలుపు ఓటమిలతో
పనిలేదు, మనం పాల్గొంటున్నామా లేదా అనేదే ముఖ్యం.

### ఆయుధం
నిజాయితీ, ప్రేమ, ఓర్పు మన ఆయుధాలు అయినప్పుడు
ప్రపంచంలో ఏ శక్తి మనల్ని అడ్డుకోలేదు.

### గొప్పతనం
విజయం గొప్పదికాదు – సాధించినవ్యక్తి గొప్పవాడు
బాధపడటం కాదు – బాధను తట్టుకోవటం గొప్ప
బాంధవ్యాలు గొప్పకాదు – వాటిని నిలబెట్టేవాడే గొప్పవాడు

### దైవం
దైవం అంటే గుడిలో ఉండే విగ్రహం మాత్రమే కాదు
ప్రతివారి గుండెల్లో ఉన్న మానవత్వం